తపాలా రిజిస్ట్రేషన్ ఛార్జీల పెంపుదల

ఆరణాలనుండి ఎనిమిదణాలకు

న్యూఢిల్లీ, మార్చి 31

ఏప్రిల్ ఒకటవ తేదీనుంచి తపాలా రిజిస్ట్రేషన్ ఛార్జీని ఆరు అణాలనుండి ఎనిమిది అణాలకు పెంచుతూ ... ప్రకటించారు. ... పంపే వారికి ... అదనంగా ... రిజిస్ట్రేషన్ చేయించవచ్చు.

విశాలాంధ్ర

సంపుటి 4 ★ విజయవాడ: ఆదివారం ఏప్రిల్ 1; 1956 ★ నంబరు 371

విజయవాడ - ... హాలులో

7-4-56 శనివారం రాత్రి 10 గంటలకు

సారంగధర

... శ్రీ ... రేట్లు: రు 5, 3, 2, 1

1-4-56 నుండి ... అమ్మబడును.

ఏప్రిల్ 3న కర్నూల్లో ఆంధ్ర-తెలంగాణా నాయకుల సమావేశం

కొత్తరాష్ట్రంపేరు, హైకోర్టు కార్యస్థానం, తదితర సమస్యలపై చర్చ

కర్నూలు రావలసిందిగా ఆంధ్ర కాంగ్రెసు అధ్యక్షునికి తంతి

విజయవాడ, మార్చి 31

విశాలాంధ్ర నిర్మాణానికి సంబంధించిన విషయాలను చర్చించేందుకుగాను ఆంధ్ర - తెలంగాణా కాంగ్రెసు నాయకులు ఏప్రిల్ 3 వ తేదీన కర్నూలులో సమావేశమవుతారని తెలుస్తున్నది.

కొత్త రాష్ట్రంపేరు, హైకోర్టు కార్యస్థానం, హైకోర్టుకు డివిజన్ బెంచి యేర్పాటు మొదలైన సమస్యలను గూర్చి వారు చర్చిస్తారు. ఈ సమస్యలపై ఆంధ్ర - తెలంగాణా నాయకులు యింతవరకు ఒక అంగీకారానికి రాలేకపోయారు.

ఏప్రిల్ 3 వ తేదీన కర్నూలులో జరిగే సమావేశానికి రావలసిందిగా ముఖ్యమంత్రి గోపాలరెడ్డిగారు ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షులైన శ్రీ అల్లూరి సత్యనారాయణ రాజుగారికి యివాళ తంతి పంపినారు.

ఏప్రిల్ 3వ హైదరాబాదు ముఖ్యమంత్రి రామకృష్ణరావు, రంగారెడ్డి, చెన్నారెడ్డిగార్లు కర్నూలు వస్తున్నారనీ, రాష్ట్రాల పునర్నిర్మాణ బిల్లుపై ... సమావేశం జరుగుతాయనీ గోపాలరెడ్డిగారు ఆ తంతిలో తెలియజేశారు.

"ఆంధ్రప్రదేశ్"

కొత్త రాష్ట్రంపేరు "ఆంధ్ర ప్రదేశ్" అని వుంటే బాగుంటుందని శ్రీ అల్లూరి సత్యనారాయణ రాజుగారు చెప్పారు. ఆంధ్ర-తెలంగాణా నాయకులు పేరునుగూర్చి ఒక అంగీకారానికి రాలేకపోయినందున కేంద్రం "ఆంధ్ర-తెలంగాణా" అని బిల్లులో ఉదహరించిందన్నారు.

అర్థికాభివృద్ధి, ఉద్యోగాలు యితర రక్షణలకు సంబంధించిన సమస్యలపై ఒప్పందానికి రాగలిగినప్పుడు పేరు సమస్యపై ఒప్పందానికి రావడం పెద్ద కష్టమేమీ కాదని సత్యనారాయణ రాజుగారన్నారు.

ఆంధ్ర - తెలంగాణాలను కలిపి ఒకే రాష్ట్ర కాంగ్రెసు సంఘాన్ని స్థాపించితే బాగుంటుందని చెప్పారు.

రాష్ట్రాల బిల్లు

విశాఖపట్నంలో ఏప్రిల్ 20 న ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు చర్చ

విజయవాడ, మార్చి 31

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు కార్యవర్గ సమావేశం ఏప్రిల్ 20 వ తేదీన విశాఖపట్నంలో జరుగుతుంది. సమావేశంలో రాష్ట్రాల పునర్నిర్మాణ బిల్లును గురించి చర్చిస్తారు.

మైసూరు బంగారు గనులను జాతీయం చేసే సమస్య

ముఖ్యమంత్రికి ఢిల్లీనుండి పిలుపు

బెంగుళూరు, మార్చి 30

మైసూరులోని బంగారు గనులను జాతీయం చేసే సమస్యను చర్చించడానికి ఢిల్లీనుండి మైసూరు ముఖ్యమంత్రి శ్రీ హనుమంతయ్య గారికి పిలుపు వచ్చింది.

గనులను జాతీయం చేయడానికి మైసూరు ప్రభుత్వం తయారుచేసిన బిల్లును ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తోంది.

బంగారు గనులను జాతీయం చేయాలని ప్రభుత్వం చేసిన నిర్ణయం అమలు జరుపడానికి అన్ని సన్నాహాలు చేస్తున్నామని శ్రీ హనుమంతయ్య అన్నారు.

కాశ్మీర్‌పై నెహ్రూ ప్రకటనను మార్చుకోవల్సివస్తుందట

పాక్ విదేశాంగమంత్రి హెచ్చరికలు

లాహోర్, మార్చి 30

"మొన్న భారత లోక్ సభలో ప్రసంగిస్తూ ప్రధాని నెహ్రూ కాశ్మీర్‌ని గురించి చేసిన ప్రకటనను భారత ప్రభుత్వం ఈ వేళ కాకపోతే రేపయినా మార్చుకోవలసి వస్తుంది" అని పాక్ విదేశాంగమంత్రి హమీదుల్ హక్ చౌదరీ లాహోర్‌లో పత్రికా విలేఖరులతో ప్రసంగిస్తూ అన్నారు.

గతంలో ప్రధాని నెహ్రూ ప్రపంచంఎదుట స్వీకరించిన బాధ్యతలనుండి ఇప్పుడు తప్పించుకో జూస్తున్నారని ఆయన ఆరోపించారు.

పాకిస్తాన్ ఇస్లామిక్ రిపబ్లిక్ అధ్యక్షుడు ఇస్కందర్ మీర్జా, విదేశాంగ మంత్రి హమీదుల్ హక్ చౌధరి కరాచీనుండి లాహోర్ గత రాత్రి వచ్చారు.

నెహ్రూ ప్రకటనను గురించి తన అభిప్రాయమేమిటని విలేఖరులు అడుగగా, ఆ ప్రకటనను తానింకా పరిశీలించలేదనిమీర్జా జవాబు చెప్పారు. కాశ్మీర్ సమస్యను గురించి పాక్ ప్రభుత్వ అభిప్రాయాన్ని జాతీయ శాసనసభలో మొన్నటి తన ప్రసంగంలోనే వివరించానన్నారు.

కాశ్మీర్ భూభాగంలో పాకిస్తాన్ సైనికదళాలు ఉంటున్నంత కాలం అక్కడ జనవాక్యసేకరణ జరపడం అనే సమస్యే ఉండదని నెహ్రూ తన ప్రసంగంలో అన్న మాటలను ఉదహరించి, "ఎవరెంత వాదించినా ప్రజల ప్రాథమిక హక్కులను తొలగించలేరు"ని హమీదుల్ హక్ చౌధరీ అన్నారు.

కాశ్మీర్ ప్రజల స్వయం నిర్ణయాధికారాన్ని సాధించేందుకు పాకిస్తాన్ దీక్ష పూనిందనీ, ఈ విషయమై ముఖాముఖి సంప్రతింపులతో లాభం లేకపోతే, ఐ. రా. స. కు ఫిర్యాదు చేయవలసి ఉంటుందనీ ఆయన అన్నారు.

నెహ్రూ ప్రకటన దృష్ట్యా పాక్ ప్రభుత్వం ఇకముందు ఏమి చేయవలసిందని విలేఖరులు అడిగిన ప్రశ్నకు, అది ఎప్పటికప్పుడు ఉత్పన్నమయే పరిస్థితినిబట్టి ఉంటుందన్నారు.

నిష్పక్షికంగా ఎవరు తీర్పు ఇచ్చినా, ఆ తీర్పు భారతదేశానికి వ్యతిరేకంగా ఉండి తీరుతుందనే విషయం బాగా తెలుసును కాబట్టే నెహ్రూ కాశ్మీర్ విషయంలో మధ్యవర్తి పరిష్కారాన్ని వ్యతిరేకిస్తున్నారనికూడా ఆయన ఆరోపించారు.

ఇటీవల జరిగిన సరిహద్దు ఘటనలకు బాధ్యత భారత దేశానిదే అని పాక్ ప్రభుత్వాధికారులు చేసిన ప్రకటనలను గురించి అడుగగా, "చెప్పిన ప్రతిమాటా అంతో జాగ్రత్తగా పరిశీలించిన మీదటే చెప్పాను" అని

ఈ ఘటనలను గురించి అసలు విషయాలు నెహ్రూకు తెలిసినట్లు లేదని కూడా అన్నారు.

ఆగ్నేయాసియా, బాగ్దాద్ సైనిక కూటములు రెండూ శాంతికి సాధకములని మీర్జా మరొకసారి అన్నారు.

నెహ్రూ ప్రకటన ఉద్రిక్తతను పెంచుతుందని పాక్ రేడియో

కాశ్మీర్ విషయమై భారతప్రధాని నెహ్రూ చేసిన ప్రకటన భారత, పాకిస్తాన్ దేశాలమధ్య ఉద్రిక్తతను పెంచుతుందనీ, ఉభయ దేశాలమధ్య నిర్యక్ష ఒడంబడికకొరకు పాక్ ప్రధాని చేస్తున్న కృషికి భంగం కలిగిస్తుందనీ కరాచీలోని "తటస్థ పరిశీలకులు" ఆందోళన చెందుతున్నారని పాకిస్తాన్ రేడియో నేడు తెలిపింది. ఉభయ దేశాలమధ్య సత్సంబంధాలు, ఈ ప్రాంతంలో శాంతి ఏర్పడాలంటే కాశ్మీర్‌లో జనవాక్య సేకరణ అవసరమని కూడా ఈ "తటస్థ పరిశీలకులు" భావిస్తున్నారట.

కాంబోడియాపై ద. వియత్నామ్ సైనికుల దాడులు

నామ్ ఫెన్, మార్చి 30

దక్షిణ వియత్నామ్ సైనికులు చాలసార్లు సరిహద్దును దాటివచ్చి కాంబోడియా గ్రామాలపై దాడులు చేస్తున్నారనీ, కాంబోడియా పౌరులను ఎత్తుకు పోవడమూ, లూటీలూ జరుపుతున్నారనీ కాంబోడియా ప్రధాని నరోదమ్ సిహనౌక్ రాకుమారుడు గత రాత్రి ఒక ప్రకటన చేశారు.

గత మూడు మాసాల్లో ఈదాడులు నాల్గుసార్లు జరిగాయన్నారు. వాటిని గురించి దక్షిణ వియత్నామ్ ప్రభుత్వానికి ఎన్నిసార్లు నిరసన తెలిపినా లాభం లేకుండా ఉందని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

గోదావరి ప్రాజెక్టు రెండవ దశ నిర్మాణం

ద్వితీయ ప్రణాళికలో చేర్చాలని తెలంగాణా నాయకుల విజ్ఞప్తి

హైదరాబాదు, మార్చి 31

గోదావరి ప్రాజెక్టు రెండవదశను ద్వితీయ పంచవర్ష ప్రణాళికలో చేర్చాలని కోరుతూ తెలంగాణా కమ్యూనిస్టుకమిటీ కార్యదర్శి శ్రీ బద్దం ఎల్లారెడ్డి (ఎం. పి.), తెలంగాణా రైతు సంఘం కార్యదర్శి శ్రీ ఎ. లక్ష్మీనరసింహారెడ్డిగార్లు ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. అందులో ఇలా వుంది :

హైదరాబాదు ప్రభుత్వం ఎంత ప్రయత్నించి నప్పటికీ గోదావరి ప్రాజెక్టు రెండవదశకు నిధులు కేటాయించడానికి ప్రణాళికాసంఘం సంసిద్ధంగా లేదని ముఖ్యమంత్రి శాసనసభలో చెప్పారు. కాని హైదరాబాదు ప్రభుత్వం సవరించిన మూసాయిదాలో ఆనుకొన్న రూపాయలు మాత్రమే కేటాయించింది. ఈ మొత్తాన్ని ఏ విధంగా ఖర్చుచేయవలసివుంటుందో వివరంగా చెప్పలేదు. ఇదికూడా నిరాకరించబడింది.

ప్రథమ పంచవర్ష ప్రణాళికలో చేర్చబడిన ప్రాజెక్టుల నిర్మాణం కొనసాగేందుకు ద్వితీయ పంచవర్ష ప్రణాళికలో ప్రాధాన్యత ఇస్తామని కేంద్ర ప్రణాళికా మంత్రిత్వశాఖ చాల స్పష్టంగా చెప్పింది. ఈ ప్రాజెక్టులో మొదటిదశను ప్రణాళికా సంఘం ప్రథమ పంచవర్ష ప్రణాళికలో అంగీకరించింది. ప్రణాళికా సంఘం రెండవ దశను అంగీకరించలేదంటే, హైదరాబాదు ప్రభుత్వంఅందుకోసం గట్టిగా ఒత్తిడి చేయలేదని అర్థం చేసుకోవలసి వుంటుంది.

గోదావరి ప్రాజెక్టు రెండవ దశ తెలంగాణా అభివృద్ధికి ఎంతో అవసరమని కేంద్ర ఇరిగేషన్ మంత్రిత్వశాఖ హైదరాబాద్ ...

(మిగతా 2 వ పేజీలో)

నిరాయుధీకరణకై రష్యా కొత్త పథకం

సాంప్రదాయక, అణు ఆయుధాలను గురించి వేరు వేరుగా ఆలోచించాలని సూచన

మాస్కో, మార్చి 31

నిరాయుధీకరణ విషయమై మొన్న సోవియట్ చేసిన కొత్త ప్రతిపాదన వివరాలను సోవియట్ వార్తా సంస్థ 'టాస్' నేడు తెలియజేసింది. ప్రస్తుతం లండనులో జరుగుతున్న ఐ. రా. స. నిరాయుధీకరణ ఉపసంఘం సమావేశంలో సోవియట్ ప్రతినిధి ఆంద్రీగ్రోమికో మొన్న మంగళవారంనాడు ఈ కొత్త పథకాన్ని ప్రతిపాదించారు.

అణ్వాయుధాలను గురించీ, సాంప్రదాయక ఆయుధాలను గురించీ వేరువేరు ప్రాతిపదికలపై చర్చించాలని సోవియట్ పథకం సూచిస్తూంది. అలా అయితే నిరాయుధీకరణ విషయమై పడేపెద్ద ఏర్పడివున్న ప్రతిష్టంభన తొలగగలదని తెలిపింది.

సాంప్రదాయక ఆయుధాలనూ సాయుధ బలాలనూ తగ్గించడం అనే సమస్యను గురించి చర్చించాలంటే ముందుగా అణుయుద్ధం గురించి అంగీకారం కుదరాలని ఈ కొత్త సోవియట్ పథకం షరతు విధించడం లేదని టాస్ తెలిపింది.

"అంతమాత్రంచేత, అణు హైడ్రోజన్ ఆయుధాల నిషేధం గురించి అంగీకారం కుదరడం అసాధ్యమని సోవియట్ భావిస్తున్నదని అనుకోకూడదు," అని టాస్ వివరించింది.

"అణు, హైడ్రోజన్ ఆయుధాలను బేషరతుగా, పూర్తిగా నిషేధించాలనీ, ఆయుధాగారాలనుండి వాటిని పూర్తిగా తొలగించాలనీ మునుపటిలాగానే ఇప్పుడూ సోవియట్ ప్రభుత్వం కోరుతూంది.

"అయితే సాయుధబలాల, సాంప్రదాయక ఆయుధాల తగ్గింపును గురించి అంగీకారం కుదిరితే, అది అణ్వాయుధాల నిషేధంపై ఒడంబడికకు మార్గాన్ని సుగమం చేయగలదు," అని టాస్ తెలిపింది.

తూర్పు, పశ్చిమ దేశాలు ఉంచుకొన్నదగిన సేనల పరిమితులనుకొత్త సోవియట్ పథకంవివరంగా సూచించిందని టాస్ తెలిపింది. ఉభయ పక్షాల్లోనూ దేనిమీదైనా హఠాత్తుగా దండయాత్ర జరిగే ప్రమాదం ఏర్పడినట్లయితే సొగయంచు హెచ్చరికల లాంటి హెచ్చరికలు మోగే పద్ధతిని ఏర్పాటుచేయాలని కూడా అది సూచిస్తూంది.

టాస్ ఇంకా ఇలా అన్నది :

"సాయుధబలాల, సాంప్రదాయక ఆయుధాల పరిమితులను అమలు జరపడం 1956-58 సంవత్సరాల్లో పూర్తికావాలని సోవియట్ పథకం నిర్దేశిస్తూంది.

"ఈవిషయమై ఒడంబడిక అమలులోకి వచ్చిన మొదటి మూడు మాసాల్లోనూ ఏ దేశంగూడా తన సాయుధ బలాలనూ, సాంప్రదాయక ఆయుధాలనూ 1955 డిసెంబరు 31 నాటి పరిమితికి మించి పెంచకూడదనీ, వాటికింద ఖర్చులను కూడా ఆనాటి పరిమితికి మించి పెంచకూడదనీ సోవియట్ పథకం సూచిస్తూంది. ఆ ప్రభుత్వాలు అందుకు హామీలు ఇవ్వాలని కోరింది.

"ఆ మూడుమాసాల అనంతరం సోవియటు, అమెరికా, చైనాదేశాలు మూడూ తమ తమ సాయుధ బలాలను పది, పదిహేను లక్షలకూ, బ్రిటన్ ఫ్రాన్సులు తమ సాయుధ బలాలను 6½ లక్షలకూ తగ్గించే కార్యక్రమాన్ని ప్రారంభించాలని సోవియట్ పథకం సూచిస్తూంది.

"మాయూలు రకం ఆయుధాలనూ, సాయుధబలాల క్రింద డబ్బు కేటాయింపునీ. దాని ననుసరించి తగ్గించడం జరుగుతుంది.

"ఇతరదేశాల సాయుధ బలాలకూ, సాంప్రదాయక ఆయుధాలకు విధించవలసిన పరిమితులను అంతర్జాతీయ సమావేశంలో నిర్ణయించాలనీ, ఆ దేశాల సాయుధబలాలు 1½, 2 లక్షలకు మించకూడదనీ సోవియట్ పథకం సూచిస్తూంది."

ఈ తగ్గింపూ, పరిమితులూ సక్రమంగా అమలు జరిగేలా చూచేందుకు ఒక అంతర్జాతీయ అదుపాయిషీ సంస్థను ఏర్పరచాలనికూడా సోవియట్ ప్రతిపాదన కోరుతూంది.

ఈ సంస్థకు ఉండవలసిన హక్కులనూ, అధికారాలనూ కూడా అది సూచించింది.

హఠాత్తుగా జరుగగల దాడులను గురించి ముందుగానే హెచ్చరించేందుకు, ఇందుకు సంబంధించిన అన్ని దేశాల ... రైల్వే కూడలులలోనూ, విమానాశ్రయాల్లోనూ, ముఖ్య ... హెచ్చరిక ఏర్పాట్లను ఈ అదుపాయిషీ సంస్థ చేయాలనికూడా సోవియట్ సూచించింది.

ఆంధ్ర కోస్తాలో నూనె గనులు

న్యూఢిల్లీ, మార్చి 31

ఆంధ్ర కోస్తాలో నూనె లభ్యమయ్యే అవకాశాలున్నాయనీ, నూనె తీసేందుకు ... పరిశోధన కొనసాగించడానికి ప్రభుత్వం తలపెట్టిందనీ కేంద్ర సహజసంపదల శాఖా మంత్రి శ్రీ కె. డి. మాళవీయా డాక్టర్ చలికాని రామారావుగారి ప్రశ్నకు లోక్ సభలో సమాధానం యిచ్చారు.

ప్రపంచ దేశాలతో చైనా వర్తకం పెరుగుదల

హాంకాంగ్, మార్చి 30

చైనా ఇప్పుడు ఆగ్నేయాసియా, ... యూరప్, ఆఫ్రికా దేశాలకు కొత్తరకాల పారిశ్రామిక సరకులు ఎగుమతి చేస్తున్నదని నవ చైనా వార్తాసంస్థ తెలిపింది.

పారిశ్రామిక సరకులతో విదేశ వర్తకం సాగించేందుకు ... ఏర్పడిన ప్రభుత్వ ... ఉత్పత్తి ... రెండుమూడు సార్లు ... అని తెలిపింది.



1956 ఏప్రిల్ 1 ఆదివారం
మన్మధనామ సంవత్సర
ఫాల్గుణ బహుళ
షష్టి రా. 9-24
జ్యేష్ట రా. 8-0

విశాలాంధ్ర

ఆదివారం 1-4-56

కాశ్మీర్ సమస్య

భారత ప్రధాని నెహ్రూ లోక్ సభలో విదేశ వ్యవహారాల పద్దుపై ప్రసంగిస్తూ కాశ్మీర్ సమస్యపై భారత ప్రభుత్వ విధానాన్ని మరొక్కమారు స్పష్టం చేశారు. కాశ్మీర్‌పై దురాక్రమణ జరిపి, ఎనిమిదిన్నర సంవత్సరాలుగా అచ్చట తిష్టవేసిఉన్న, పాకిస్తాన్ సేనలు, ముమ్ముందుగా ఉపసంహరించుకోవాలన్నారు. అలా చేయకుండా, జనవాక్య సేకరణ కావాలని పాకిస్తాన్ వాదించటంలో అర్థం లేదని, కాశ్మీర్ సమస్యను శాంతియుతంగా పరిష్కరించేదుకు భారత ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగానే ఉన్నదని పునరుద్ఘాటించారు.

నెహ్రూ ప్రసంగంపట్ల, పాకిస్తాన్ అధికార వర్గాలలో కొంత అలజడి బయలు దేరినట్లు వార్తలు తెలుపుతున్నాయి. పాకిస్తాన్ విదేశాంగ మంత్రి లాహోరులో ప్రసంగిస్తూ, భారత ప్రభుత్వం అంతర్జాతీయ ఒప్పందాలను ఉల్లంఘించటానికి యత్నిస్తున్నదని ఆరోపించారు. అవసరమైతే ఈ సమస్యను ఐ. రా. స. సాధారణ సభకు ఫిర్యాదు చేస్తామన్నారు. ప్రధాని నెహ్రూ ప్రకటనవల్ల కాశ్మీర్ సమస్యా పరిష్కారం మరింత క్లిష్టమైందని కరాచీ లోని "తటస్థ రాజకీయ వర్గాలు" భావిస్తున్నట్లు, పాకిస్తాన్ రేడియో ప్రకటించింది.

వాస్తవ పరిస్థితిని ఏమాత్రం పరిశీలించినా, కాశ్మీర్ సమస్యపై పాకిస్తాన్ అవలంబిస్తున్న వైఖరి పూర్తిగా తప్పు అని బోధపడగలదు.

1947లో బ్రిటిష్‌సామ్రాజ్యవాదులు భారతదేశాన్ని రెండుగా విభజించిన వెంటనే, పాకిస్తాన్ ప్రభుత్వం కొండజాతుల సైనికులను ప్రోత్సహించి భారత భూభాగమైన కాశ్మీర్‌పై దాడి చేసింది. ఆ దాడిని భారత సేనలు ప్రతిఘటించి, పాకిస్తాన్ సేనలను వెనక్కునెట్టాయి. ఈ దురాక్రమణ దాడిని గురించి భారత దేశం ఐ. రా. సకు ఫిర్యాదు చేసింది. ఐ. రా. స. వెంటనే యుద్ధ విరమణను సూచించింది. ఆ సూచన ఫలితంగా, కాశ్మీర్ లోని కొంత భూభాగం, పాకిస్తాన్ ఆక్రమణక్రింద ఉండిపోయింది. ఆ ప్రాంతంనుండి తమ సేనలను ఉపసంహరించాలనే ఐ. రా. స. సూచనను నాటి నుండి నేటివరకూ పాకిస్తాన్ అమలు జరపలేదు

గత 8 ఏండ్లలో, కాశ్మీర్‌లో అనేక మార్పులు జరిగాయి. వయోజన వోటింగ్‌పై ఏర్పడిన కాశ్మీర్ రాజ్యాంగ సభ, భారతదేశంలో సంలీనాన్ని కోరుతూ ఏకగ్రీవంగా తీర్మానించింది. కాశ్మీర్ ఆర్థిక విధానాన్ని అభివృద్ధి చేయటానికి అవసరమైనభూసంస్కరణాలను, తదితర చర్యలను కాశ్మీర్ ప్రభుత్వం చేపట్టింది. పాకిస్తాన్ సైన్యాల ఆక్రమణలోవున్న కాశ్మీర్ భాగంలో ఇంతవరకు ఎన్నికలే జరుపలేదు. ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించే వ్యవస్థలు ఎలాంటివి లేనేలేవు. నిరంకుశపాలన సాగిపోతూంది.

ఈ చరిత్రనంతా తిరుగదోడి తిరిగి కాశ్మీర్‌లో అస్థిర పరిస్థితులను కల్పించేందుకే పాకిస్తాన్ యత్నిస్తున్నది. అమెరికన్ సామ్రాజ్యవాదులు ఈ ప్రయత్నంలో పాకిస్తాన్‌ను బలపరుస్తున్నారు. ఈ మధ్య కరాచీలో జరిగిన ఆగ్నేయాసియా సైనిక కూటమి సమావేశంలో అమెరికా మద్దతుతో పాకిస్తాన్, కాశ్మీర్‌పై ఒక తీర్మానాన్ని చేయించింది. ప్రధాని నెహ్రూ ప్రకటనవల్ల పరిస్థితులు క్లిష్టమౌతాయని కరాచీలో 'భావిస్తున్న తటస్థ రాజకీయవర్గాలు' అమెరికన్ వర్గాలు అని తేలికగానే ఊహించవచ్చు.

అమెరికన్ సామ్రాజ్యవాదుల సహాయంతో కాశ్మీర్ సమస్యను తమ కనుకూలంగా పరిష్కరించుకోవాలని పాకిస్తాన్ చేసే యత్నాలవల్ల, కాశ్మీర్ సమస్య పరిష్కారం కాదు సరిగదా, భారత, పాకిస్తాన్‌ల మధ్య విద్వేషాలు పెరుగుతాయి. అట్టి పరిస్థితి ఏర్పడటం, ఉభయులకూ క్షేమకరం కాదు.

అమెరికన్ సామ్రాజ్యవాదులు జోక్యం కలిగించుకున్న ప్రతి సందర్భంలోను, ఆ సమస్యా పరిష్కారం కాకపోగా, అంతఃకలహాలు ప్రజ్వరిల్లాయని కొరియా, ఇండో చైనా ఘటనలే స్పష్టంగా రుజువు చేస్తున్నాయి. అట్టి అమెరికన్ సామ్రాజ్యవాదుల మద్దతును పాకిస్తాన్ తీసుకోవటానికి నిర్ణయించటం తీవ్ర పరిణామాలకు దారితీయగలదు.

ఇప్పటికైనా పాకిస్తాన్, తన విధానాన్ని మార్చుకోవటం అవసరం. పాకిస్తాన్‌లోని ప్రజాతంత్రవాదులు, తమ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానంవల్ల ఎట్టి విషమ పరిస్థితులు ఏర్పడగలవో గమనించాలి. ఇరుగు పొరుగు దేశాలైన భారత, పాకిస్తాన్ దేశాలమధ్యగల అన్ని సమస్యలను, కాశ్మీర్ సమస్యతోపాటు ముఖాముఖి చర్చలద్వారా శాంతియుతంగా పరిష్కరించుకోవాలని, పాకిస్తాన్ ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావాలి.

హర్తాళ్‌కు పిలుపిస్తే డిటెయిన్ చెయ్యొచ్చు

బొంబాయి న్యాయమూర్తుల అభిప్రాయం

బొంబాయి, మార్చి 30

హర్తాళ్ జరపమని, దవాణాను నిలుపుదల చెయ్యమని పిలుపు ఇచ్చిన వారిని డిటెయిన్ చెయ్యడానికి న్యాయశాస్త్రరీత్యా ఆధారాలు వున్నాయని బొంబాయి ప్రధాన న్యాయమూర్తి శ్రీ చాగ్లా, న్యాయమూర్తి శ్రీ దేశాయిగార్లు చెప్పారు.

సంయుక్త మహారాష్ట్ర ఉద్యమం సందర్భంలో పదకొండు మందిని డిటెయిన్ చేసిన విషయం పాఠకులకు విదితమే. వీరి తరఫున కోర్టులో 'హెబియస్ కార్పస్' దరఖాస్తులు విచారణకు వచ్చాయి. డిటెన్యూల తరఫున శ్రీ ఎ. ఎస్. ఆర్. చారి, ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ శ్రీ ఎం. పి. అమీన్ గార్లు హాజరయ్యారు.

డిటెయినింగ్ అధికారులు శాంతి భద్రతలనుకాపాడటానికి ఏ సూత్రాలను ఆధారం చేసుకొని, సంయుక్త మహారాష్ట్రవాదులను డిటెయిన్ చేశారో, అవి సరియైనవని కావని శ్రీ ఎ. ఎస్. ఆర్. చారి వాదించారు. "బొంబాయి నగరంతోసహా సంయుక్త మహారాష్ట్రను మంజూరు చేయుటవల సిందిగా ప్రభుత్వాన్ని వత్తిడి పరచే దృష్టితో" డిటెన్యూలు కొన్ని పనులు అమలు జరపాలని చాల కేసులలో పేర్కొన్నట్లు ఉదాహరించారు. కేంద్ర ప్రభుత్వం కాని, రాష్ట్రప్రభుత్వం కాని రాజ్యాంగానికి లోబడి సంయుక్త మహారాష్ట్ర కోర్కెను మంజూరు చేయజాలదని, పార్లమెంటు మాత్రమే అలాంటి అధికారం కలిగి వుంటుందని అన్నారు.

"ప్రభుత్వం" అంటే అందులో పార్లమెంటుకూడా చేరి వుందని అడ్వొకేట్ జనరల్ శ్రీ ఎం. పి. అమీన్ వాదించారు. ఆయనవాదనతో న్యాయమూర్తులు ఏకీభవించారు.

దరఖాస్తుల విచారణ సోమవారం నాటికి వాయిదాపడింది.

సోవియట్ పత్రికలో గాంధీజీ ప్రశంస

న్యూయార్క్, మార్చి 30

భారతదేశ స్వాతంత్ర్య పోరాట చరిత్రలో గాంధీజీ నిర్వహించిన మహత్తరపాత్రను గురించి "ఇంటర్నేషనల్ ఎఫైర్స్" అనే సోవియట్ మాసపత్రిక ఒక వ్యాసాన్ని ప్రచురించింది.

భారత స్వాతంత్ర్య పోరాటానికి గాంధీజీ ప్రముఖ నాయకులనీ, భారత దేశంలో ఆయన పేరును పరమ పవిత్రంగా పరిగణిస్తారనీ ఆ వ్యాసంలో తెలిపారు.

భారత ప్రజల జాతీయ జీవనాన్నీ, వారి స్వాతంత్ర్య పోరాటాన్నీ సరిగా అవగాహన చేసుకోవడం భారత సోవియట్ ప్రజల మైత్రిని బలపరచగలదని ఆ వ్యాసంలో తెలిపారు.

పంచదార ఉత్పత్తి పెరుగుదల

కేంద్ర వ్యవసాయ మంత్రి వివరణ

ఢిల్లీ, మార్చి 30

ఈ సంవత్సరం పంచదార ఉత్పత్తి 17 లక్షల టన్నులు ఉంటుందనీ, అంటే గత సంవత్సరంకంటె లక్ష టన్నులు ఉత్పత్తి పెరిగిందనీ కేంద్ర వ్యవసాయశాఖామంత్రి శ్రీ పంజాబ్ రావ్ దేశముఖ్ తెలియజేశారు.

ద్వితీయ పంచవర్ష ప్రణాళిక కాలంలో ఉత్పత్తి అంచనా ప్రకారం 22 లక్షల టన్నులని ఆయన తెలియజేశారు.

జపాను పద్ధతిసాగు

దేశంలో మొత్తం 20 లక్షల ఎకరాలు జపాను పద్ధతి సాగుకింద ఉందన్నారు. ఈ నూతన పద్ధతిని పరిశీలించడానికి చైనానుండి నిపుణులు మనదేశం రానున్నారు.

మనదేశాన్నుండి ఒక ప్రతినిధివర్గాన్ని చైనాలో సహకార వ్యవసాయ పద్ధతిని పరిశీలించడానికి పంపుతున్నాము. ప్రతినిధివర్గ సభ్యులను ఇంకా నిర్ణయించలేదన్నారు.

రష్యా ట్రాక్టర్లు

చిన్న చిన్న వ్యవసాయ క్షేత్రాల్లో ఉపయోగించుకోడానికి వీలైన చిన్న ట్రాక్టర్లను రష్యానుండి దిగుమతిచేసుకోడానికి మనదేశంలోని కొన్ని కంపెనీలు ప్రయత్నిస్తున్నాయి. తక్కువ శక్తిగల ట్రాక్టర్ల దిగుమతికి ఇప్పుడు నిషేధం ఉంది గనుక ఈ చిన్న ట్రాక్టర్ల దిగుమతి గురించి ఇంకా ఎట్టి నిర్ణయము చేయలేదని అన్నారు.

మహారాష్ట్ర, బొంబాయిల్లో ఉప ఎన్నికలు

సంయుక్త మహారాష్ట్ర సమితి తరఫున పోటీ

పూనా, మార్చి 30

సంయుక్త మహారాష్ట్ర సమితి, రానున్న బొంబాయి మహారాష్ట్ర ఉప ఎన్నికలలో పోటీ చేయడానికి నిశ్చయించుకొంది. సంయుక్త మహారాష్ట్ర సమస్యపై రాజీనామా చేసిన సభ్యులను వారు ఏ పార్టీకి చెందిన వారైనప్పటికీ బలపరచాలని సమితి నిర్ణయించింది. ఈ ఉపఎన్నికలలో పార్టీల పేరుతో పోటీ చేయరాదనీ, సంయుక్తమహారాష్ట్ర నినాదంపైననే ఒకే చిహ్నంతో పోటీచేయాలని సమితి నిశ్చయించింది.

ఎన్నికలైన తర్వాత సభ్యులైన వారందరు సమితియొక్క ఆదేశాలను, క్రమశిక్షణను శిరసావహించాలని కూడా నిర్ణయించారు.

పూనా రవివారపుపేటలో శుక్రవారం నాడు అగ్ని ప్రమాదం జరిగింది. అనేక ఇళ్లు, గోదాములు కాలిపోయాయి.

ఉత్పత్తితో బాటు కార్మికుల వేతనాలలో పెరుగుదల ముఖ్యం

హైద్రాబాద్ శాసనసభ చర్చసందర్భంలో పలువురు సభ్యుల విమర్శ

[విశాలాంధ్ర విలేఖరి]

హైద్రాబాద్, మార్చి 30

ఉత్పత్తి పెరిగిందని మంత్రులు చెబుతున్నారు కాని కార్మికుల జీవన ప్రమాణం ఏ మాత్రం పెరగలేదని నేడు కార్మికశాఖ పద్దుపై శాసనసభ చర్చ సందర్భంలో శ్రీ మగ్దూం మొహియుద్దీన్ అన్నారు.

నేడుదయం శాసనసభలో కార్మిక శాఖపద్దులపై చర్చ జరిగింది. ఇది 15 లక్షల చిల్లరపద్దు. దీనికి పది కోత తీర్మానాలు వచ్చాయి. కాని ప్రతిపాదకులే సభలో లేకపోవడంచేత ఏడే ప్రతిపాదించబడ్డాయి. అందులో మూడు ప్రతిపక్ష నాయకులు శ్రీ.వి.డి. దేశపాండేవి.మూడు ఫ్రంట్ నాయకులు శ్రీమగ్దూంమొహియుద్దీన్.

శ్రీ వి. డి. దేశపాండే (ఫ్రంట్): ప్రభుత్వ కార్మిక విధానం చాల అసంతృప్తికరం. వేతనాలు బోర్డుల నిర్మాణంలో, హాలీ సిక్కా మార్పు సందర్భంలో, ఇతర సందర్భాలలో కూడ ఇది నిరూపితం అయింది. జీతాల బోర్డులు ఏర్పాటుచేసిమూడేళ్ళయినా, ఇంతవరకు దాని ప్రయోజనం లేకుండడంచేత ఈ ఎస్టుకాలక్షేపానికే నవలసి వస్తూంది. ఏ బోర్డన్నా ఏదన్నా నిర్ణయాలిచ్చినా దానిని అమలు జరపడానికి ప్రభుత్వంవద్ద ధనం లేదంటారు. ఇది ప్రజల్ని మోసగించడం తప్ప వేరుకాదు. మీరు సోషలిజం, ప్రజాక్షేమంగురించిన కబుర్లు బయటవుండి లక్ష చెప్పినాఏమీ లాభంలేదు.

ఉద్యోగ నిర్మాయక కార్యాలయాలలో ఉద్యోగాలకు దరఖాస్తు పెట్టిన 56 వేల మందిలో ఏడోవంతుమందికి వుద్యోగాలు దొరికాయి. అదైనా ధనం ఇచ్చినవారికేనని వింటున్నాం. కావచ్చు ఇంత నిరుద్యోగం ఉండగా నిరుద్యోగ నివారణసంఘం సలహాలను ఎందుకు అమలుజరుపరు ? అమలుజరపని ఏసలహాలకై సంఘాల్ని నియమించడం ఎందుకు ?

ప్రభుత్వం ఇచ్చే ఈ నిరుద్యోగుల లెక్కలు సరికాదు. స్థానిక సంస్థలు గ్రామాలలో నిరుద్యోగుల లెక్కలు తీసే అధికారం ఇస్తే అసలు సంఖ్య బయటపడుతుంది.

కూలీరేటుపై సమష్టిబేరాలపద్ధతిని ప్రోత్సహించడానికి ప్రభుత్వం ప్రయత్నించలేదు. పైగా కార్మిక సంఘాల్ని చీల్చి సమష్టిబేరాల కవకాశంలేకుండా చేస్తూంది. యూనియన్ల మధ్య పోటీ పెట్టి తుపాకులు కాల్చి రక్తం ప్రవహింపచేశారు. బోధన్‌లో ఈస్థితి మూశాం.

ఈ విధానాలు మార్చుకోడం అవసరం.

శ్రీమగ్దూంమొహియుద్దీన్(ఫ్రంట్): ప్రభుత్వం తన కనుకూలంగా పనిచేసే కార్మిక సంఘాలను గుర్తించి, ఉత్పత్తిని పెంచగలమనుకోడంతప్పు. కార్మికులు యూనియన్ వెలుపల హెచ్చు మంది మిగిలిపోవడం, ప్రభుత్వ కార్యకలాపాలలో ఆసక్తి లేక పోవడమే ఈ విధానానికి ఫలితం. తిండీ, కనీసావసరాలను వదలుకొని పనిచేయమంటే ఎవ్వడూ చెయ్యడు. ఎంతోకాలం చెయ్యడు. ఈనాడు ఒక చిన్న కుటుంబం కనీస జీవితం గడపాలంటే నెలకి నూరు రూపాయలుండాలి. ఆ మాత్రం జీతం దొరుకుతూందా ? కనకనే జీతాలు, భత్యాలు, యితర సౌకర్యాలకోసం కార్మికులు పోరాడుతున్నారు. వాటి కింతవరకు ప్రభుత్వం సమాధానం ఇవ్వలేదు. ఏదో చేయబోతున్నట్లు జీతాలబోర్డులు నియమించారు. కాని, వారి సూచనలు అమలు జరపేందుకు డబ్బు లేదంటున్నారు. రెండోవేపున ఉత్పత్తి పెరిగిందని మంత్రులే చెబుతున్నారు. ఆ పెరుగుదలలో కార్మికులకు ఏమన్నా దక్కిందా? పెట్టుబడిదారుల లాభాలు పెరిగాయి. ఇదీ ఉత్పత్తి పెంచిన ఫలితం. ప్రభుత్వం అనుసరిస్తున్న పద్ధతివలన యజమానులు పనివారిని మరింత పిండగలుగుతున్నారు. కేంద్ర ప్రభుత్వ మంత్రి శ్రీ గిరి కార్మికుల జీతాల విషయమై ప్రభుత్వ విధానాన్ని వ్యతిరేకిస్తూ రాజీనామానిచ్చారు. గాలి ఎటు నడుస్తూందో తెలుసుకోడాని కది చాలు. జీతాల బోర్డుల్ని మీరే నియమించారు. వారి సూచనలన్నా కనీసం అమలు జరపండి.

పాలసిక్కా మార్పులో కార్మికుల జీతాలు కోతపెట్టారు. ఇదీ మీరు తెచ్చే సోషలిజం !

ప్రతిచోటా కార్మికుల ఇష్టానికి వ్యతిరేకంగా యజమానుల సంఘాన్ని ప్రోత్సహిస్తూంది మంత్రివర్గం. దానిలో చేరమని ఒత్తిడి తెస్తూంది. కార్మికులలో పేచీపెడుతూంది. శక్కర్‌నగర్‌లో, హట్టిలో, ఆర్. టి. డి. లో, బొగ్గుగనుల్లో కార్మికులలో పోటీలుపెట్టి, తపాయూనియన్ నాయకులపై నిర్బంధాలు పెడుతూంది. వీనిని మంత్రిగారు కాదనగలరా ? ప్రభుత్వం అనుసరిస్తున్న క్లోజ్ షాప్ యూనియన్ షాప్ విధానాలను ఒకప్పుడు హిట్లరు అనుసరించేడు. దేశాన్ని అధోగతికి ఈడ్చ నలిగేడే గాని, కార్మికులకు అణచెండం ఆహిట్లరునూ సాధ్యం కాలేదు.

కార్మికుల హక్కులు

కార్మికుల హక్కుల ప్రశ్నవచ్చేసరికి ప్రభుత్వం ప్రపంచభారం అంతా తనమీదే వుందంటుంది. అదే యజమానులు పైన వేస్తేనాలు, ప్రపంచాన్నంతటినీ సముద్రంలో పారవెయ్యడానికూడా సందేహించరు. రెండో పంచవర్ష ప్రణాళిక విజయం పొందాలంటే త్రైపాక్షికసమావేశాలు పిలవండి కార్మికులకనీసావసరాలు, యజమానులకూ వారికీ వుండవలసిన సంబంధాలు, పరిశ్రమల నిర్వహణలో కార్మిక ప్రతినిధుల స్థానం వగైరా సమస్యలు చర్చించి, తేల్చండి. అప్పుడే పరిశ్రమలలో శాంతిసాధ్యం. శక్కర్‌నగర్‌లో లాగ కాల్పులు కాల్చి, కార్మికుల్ని లొంగదీయగలమనుకొంటే చాల పొరపడుతున్నారనాలి.

తర్వాత శ్రీ గోపిడి గంగారెడ్డి (సోషలిస్టు) గ్రామాలలో వ్యవసాయ కార్మికులే దేశానికి అన్నంపెడుతున్నారనీ, వారికనీస జీతాలంచ్చే విషయం ప్రభుత్వం పూనుకోవడం లేదనీ అన్నారు.

శ్రీ వి. బి. రాజు (కాం) ప్రసంగిస్తూ సమగ్రమైన కార్మిక శాసనం తయారు చేయకపోవడంవలన కార్మికులకు కొంత నష్టంకలిగినమాట వాస్తవం అన్నారు. పరిశ్రమలలో కార్మిక సంఘాల్ని యజమానులంగీకరించాలన్న నిబంధనను యజమానులు తమ కనుకూలముగా వుపయోగించుకుని ప్రభుత్వాన్ని తమ కడ్డంపెట్టుకొన్నారనీ, ప్రభుత్వంఅమాయకంగా వలలో పడిందనీ అన్నారు. ప్రభుత్వ విధానమే దీనికి కారణమా? యజమానుల దుర్నీతి కారణమా ఆలోచించాలన్నారు. రాష్ట్రప్రభుత్వం కేంద్ర కార్మిక విధానాలనే అనుసరిస్తూంది. కాని నూతన మార్గం తొక్కడం లేదు.

"ఉత్పాదకశక్తి, ఉత్పత్తి పెరిగినా కార్మికుని ఆదాయం పెరగలేదు. ఆ దేశాభివృద్ధి అనలేము. వ్యవసాయ కార్మికుల వేతనాల విషయంలో ప్రభుత్వం వానుస్తూంది.

"ఇవన్నీ ప్రజలలో అసమానాలకు కారణం అవుతూంది. ప్రభుత్వం నియమించిన కమిటీలసూచనలనుఅమలు జరపండి. పేచీవస్తే తగ్గి చూడొచ్చు.

"కార్మిక సహకారోద్యమాన్ని ప్రారంభించిన రాష్ట్రాలలో ఈ హైద్రాబాద్ మొదటిది. కాని అది ప్రారంభించిన చోటనే వుంది. లోపాల్ని సవరించి, ఆ వుద్యమాన్ని వృద్ధిపొందించాలి."

శ్రీ శంకరప్ప శివపురే (కాంగ్రెస్) ప్రభుత్వ కార్మిక విధానాలను సమర్థించారు.

శ్రీ ఎం. ఎస్. రాజలింగం (ఉప కార్మిక మంత్రి) ఈవేళ వచ్చిన విమర్శలుమూసేక ప్రభుత్వ విధానాల మీద వ్యతిరేకత హెచ్చుగాలేదనే కనబడుతూంది. కార్మికుల సౌకర్యాల వేపు మాస్తూనే ఆర్థిక వ్యవస్థ తల్లక్రిందులు కాకూడదని ప్రభుత్వ ఆశయం. కేంద్ర ప్రభుత్వం రెండో పంచవర్ష ప్రణాళికలో అవలంబించాలనుకొన్న విధానాలను కొద్ది కొద్దిగా రాష్ట్ర ప్రభుత్వం ముందుగనే అమలుజరిపింది. ఉదాహరణకు జీతాలు పెంచడం, సమష్టి సమాలోచనా సంఘాల నిర్మాణం మొదలయినవి చెప్పవచ్చు. ఇది కార్మిక సంఘాలకూ, ప్రతిపక్షానికీ సంతృప్తి కలిగించక పోవచ్చు.

ప్రభుత్వం కొన్ని కార్మిక సంఘాలకు ప్రోత్సాహం ఇస్తూందని ప్రతిపక్షమేగాక, ప్రభుత్వ సభ్యులు కూడా అనుకొంటున్నారు. అది పొరపాటు. ఎలక్ట్రిసిటీ పరిశ్రమ ప్రభుత్వానిది. అందులో కూడ జాతీయ కార్మిక సంఘాన్ని గుర్తించలేదు. ఇతరత్రా కూడ ఇదేయధార్థం. కార్మిక సంఘాలవారు గుర్తింపుకు సంబంధించిన సమాన ఏక సూత్రాన్ని ప్రతిపాదించగలుగుతే ప్రభుత్వం అంగీకరిస్తుంది. ఈ విషయంలో ఇంత దనుక ఏకాభిప్రాయం ఏర్పడక పోడానికి ప్రధాన కారణం కార్మిక నాయకులే.

శ్రీ వి. డి. దేశపాండే : కార్మికులధిక సంఖ్యలో ఏ యూనియన్‌ను కోంతే దానిని గుర్తించాలని ప్రభుత్వం ఒక చట్టం చేయకూడదా ?

శ్రీ రాజలింగం (ఉప మంత్రి) : ప్రభుత్వం చిల్లర చిల్లరగా చట్టాలు చేయడానికి ఇష్టపడడంలేదు. గుర్తింపు సమస్యలో పేచీ లేకుండా వుండేందుకు ఒక అంగీకృత సూత్రాన్ని ప్రతిపాదించగలుగుతే ప్రభుత్వం అంగీకరిస్తుంది.

కార్మిక సంఘాల రిజిస్ట్రేషన్‌కు కొన్ని నిబంధన లున్నాయి. తగినంత మంది సభ్యులు లేకపోతే రిజిస్టరు చేయరు. ఆ విషయంలో ప్రభుత్వం ఏం చేస్తుంది? మజ్దూరుసంఘం పని మీద ప్రభుత్వానికి కసిలేదు.

కార్మిక సంక్షేమ కార్యక్రమానికి ఇప్పుడు కేటాయించిన ధనం కన్న ఎక్కువ కేటాయించడం సాధ్యం కాదు. విమర్శలకంటేకన్న చెప్పేదీ లేదు.

వ్యవసాయకూలీల జీతాలసమస్యలో కనీస వేతనం నిర్ణయించడం సులభమే. కాని, దానిని కోరే చైతన్యం కార్మికులలో వుండాలి. ఇవ్వగలశక్తి రైతుకుండాలి. అమలు జరిపే వుద్యోగివర్గం కావాలి.

కార్మికులలో చైతన్యం కలిగించే బాధ్యత కార్మిక నాయకులది. అప్పుడే ప్రభుత్వం పని సులభం అవుతుంది."

హాస్పిటళ్లలో లంచగొండితనం: హైద్రాబాద్ శాసనసభలో చర్చ

(విశాలాంధ్ర విలేఖరి)

హైద్రాబాద్, మార్చి 31

ప్రభుత్వ హాస్పిటళ్ళలో లంచగొండితనం ఎక్కువైపోయిందనీ దీనిని అరికట్టడానికి ప్రభుత్వం ప్రయత్నించాలనీ, ఈ ప్రయత్నాలతో తాము సహకరిస్తామని శాసన సభ ప్రతిపక్షనాయకుడు శ్రీ దేశపాండే నేడు అన్నారు.

నేటి సాయంకాలం వైద్య, ప్రజారోగ్య, గ్రామపునర్నిర్మాణ శాఖల మంత్రి శ్రీ మెహిదీ నవాజ్ జంగ్ తమ శాఖలకు సంబంధించిన పదకొండు పద్దులను శాసనసభ చర్చకు ప్రతిపాదించారు. వీనిమీద మొత్తం 41 కోత తీర్మానాలు వచ్చాయి.

శ్రీ ఎ. గుర్వారెడ్డి (ఫ్రంట్) ప్రజలకులభిస్తున్న వైద్యసహాయంస్వల్పం. కొత్త పద్ధతులు మార్చాలి. డాక్టర్లు ఇంటికివెళ్ళి సాయం చేయడం వానిలో ఒకటి. సోవియట్‌లో ఈపద్ధతివుంది. మెడికల్ డైరక్టర్ శ్రీ ఖత్రీ చూసి వచ్చారుకూడా. దాని నిక్కడ అనుసరించడం బాగుంటుంది. ప్రస్తుతం ప్రభుత్వ డాక్టర్లు ప్రజాసేవ మాట పట్టించుకోక, వేరే ప్రత్యేకంగా ప్రాక్టీసుకూడా చేసుకుంటున్నారు. దీనిని ప్రభుత్వం ఆపాలి. దానికి సాధనంగా డాక్టర్ల జీతాలు హెచ్చించడం అవసరం. హైద్రాబాద్‌లో పళ్ళ వైద్యశాల వేరేలేకపోవడం చాల కష్టంగా వుంది. ఒకటి వెంటనే తెరవడం అవసరం.

ఉన్న హాస్పిటళ్ళలోకూడా రంగునీళ్ళే కాని మందులులేవు మంచాలు లేవు. వారికి తిండిచాలదు. వీనిని సరిచేస్తేతప్ప ప్రయోజనం తక్కువ. సిద్దిపేట, మెదక్‌లలో వైద్య సౌకర్యమేలేదు. ఈ రెండూ జిల్లా, తాలూకా కేంద్రాలు. 20 వేల జనాభా కలవి. కాని అక్కడ హాస్పిటళ్ళేలేవు. సిద్దిపేట ప్రజ 25 వేలు ఇచ్చినా ప్రసవ వైద్యశాల తెరవలేదు.

అంటురోగాల్ని నిలపడానికి ప్రచారం హెచ్చుగా జరగవలసివుంది. యాత్రలలో ప్రచారం ముఖ్యంగా జరగాలి. కాని అది జరగడంలేదు.

నర్సింగ్ నేర్చుకోవడానికి ఇంగ్లీషు అత్యవసరం అంటున్నారు అది తగ్గించి ప్రాంతీయ భాషలలో శిక్షణ నిస్తే త్వరలో నర్సులలేని లోపం తీరుతుంది. ప్రభుత్వం ఆలోచించాలి.

రైతులకూ, గొనుగోలుదార్లకూ మధ్య కమీషన్ ఏజంట్లు లేకుండా చేస్తేతప్ప తిండి వస్తువుల ధరలు అదుపులో వుండవు. వీనికి గిడ్డంగుల నిర్మాణం అవసరం. ప్రభుత్వం మార్కెటింగ్ శాఖను నడిపిస్తున్న పుడు కమీషన్ ఏజంట్లు అనవసరం. వారిని తొలగించాలి.

పశువైద్య సౌకర్యాలు

తాలూకాలలో పశువైద్య సౌకర్యాలు చాల తక్కువగా వున్నాయి. అసలే డాక్టర్లు తక్కువ. వున్నవారు కూడా డబ్బు పిండాలనే రకమే.

శ్రీ పెండెం వాసుదేవ్ (ఫ్రంట్) దేశీయ వైద్య విధానాలయిన ఆయుర్వేదానికీ, యూనానీకీ తగు ప్రోత్సాహం ఇవ్వాలి. యూనానీ బోర్డంటూ ఒకటి వుందిగాని దాని అతీగతీ తెలియదు. గ్రామాలలో అక్కడక్కడ వున్న ఆయుర్వేద వైద్యులకు అలవెన్సులు ఎందుకు ఇవ్వడం మానేరో తెలియదు.

ఆయుర్వేదవైద్యకళాశాలలో ఇదివరలో తెలుగులో చదువు చెప్పేవారు. ఇప్పుడు హిందీకి మార్చారు. దానితో తెలుగు విద్యార్థులు అసౌకర్యానికి గురిఅవుతున్నారు. దీనిని సరిదిద్దాలి.

డైరెక్టరు మాస్కో వెళ్ళడానికి ప్రయాణఖర్చులు క్షణంలో మంజూరు అయాయి, కాని మెడికల్ ఇన్‌స్పెక్టర్లకు భత్యాలు ఇప్పటికి పదేళ్ళ క్రితానివికూడా మంజూరుకాలేదు. ఇది అన్యాయం కాదా ?

పిచ్చి ఆసుపత్రి మెడికల్ ఆఫీసరు నటరాజన్ అక్కడ రాజ్యమేలుతున్నాడు. రోగుల్ని చేర్చుకోమంటే డబ్బు ఇవ్వాలి. లేకపోతే అన్నీ తిప్పలే.

మార్కెట్లలో బస్సు నిలుపుటకు సౌకర్యాలు లేవు. పశువులకు, మనుష్యులకు త్రాగేనీరుకూడా వుండదు. వండుకుందుకు సౌకర్యాలు లేవు. మార్కెటింగ్ కమిటీలు లోపాల్ని సరిదిద్దాలి.

శ్రీ వామనరావుదేశముఖ్ మాట్లాడిన అనంతరం శ్రీ వి. డి. దేశపాండే (ఫ్రంట్) ప్రసంగిస్తూ ఇలా అన్నారు.

చిన్న ఆపరేషన్‌కు కూడా లంచం

"పబ్లిక్ హాస్పిటళ్ళలో కూడ ఏ చిన్న ఆపరేషన్ చేయించుకోవలసి వచ్చినా 50 రూ. లు డాక్టరుకిచ్చుకొంటేగాని జరగడంలేదు. ఇది దబాయిస్తే తీసుకొనేది కాదు. అలవాటయిపోయింది. ఇది సామాజికంగానూ, ప్రభుత్వం వేపునుంచీ కూడా ప్రయత్నిస్తే తప్ప తగ్గదు. ఈ ప్రయత్నాలతో మేం సహకరిస్తాం.

వైద్య కళాశాలల్లో సీట్లు రాష్ట్రావసరాలకు సరిపడాలేవు. మోమినాబాద్ లోనో, ఔరంగాబాద్‌లోనో ఒక కాలేజి తెరచి కొంత హెచ్చు మంది వైద్యులను తయారు చేయడం మంచిది. కాలేజీకి మోమినాబాద్ వీలుగా వుంటుంది. అల్ప కాలం వైద్య విద్య నేర్పే కాలేజీలు మంత్రి వుండరాదంటారు. నేను వుండాలంటాను. ఆయన ఆలోచనే అనుసరిస్తే మంచి డిగ్రీవున్న వైద్యుడు లేకపోతే అసలు వైద్యుడే లేకుండా పోతున్నాడు.

గ్రామాలలో ప్రభుత్వం వుంచిన మందుల పెట్టెల్ని పటేల్ పట్వారీలు స్వార్థంకోసం వుపయోగించుకొంటున్నారని ఆరోపణలున్నాయి. వాటిని ప్రభుత్వం విచారించాలి.

మందుల స్టోర్సుకి మందులు కొనడంలో చాల హెచ్చు ఖరీదిచ్చికొన్నారు. వాని సరిక్ష విషయం కూడా శ్రద్ధతీసుకోలేదు. దీనికి కారణం ఏమయి వుంటుందో చెప్పక్కర్లేదు. అవినీతి, స్వలాభం, బంధుప్రీతి తప్ప వేరుకాదు. మందులు కొనిపించేకమిటీ సభ్యులతోలూరు మందుల కార్ఖానాల సౌకర్యంకోసం ఇది జరిగిందనే అనుమానం వుంది.

పిచ్చి ఆసుపత్రిలో పోలీసు అధికారి 'ప్రమాద కరుడ'ని వ్రాసిన రోగిని చేర్చుకు తీరాలి. కాని, ఆ విధంగా పోలీసు అధికారి వ్రాసిన సందర్భంలో కూడా చాల మందిని వదిలారు. అటువంటి సర్టిఫికట్ లేకున్నా చేర్చుకొన్నారు. ఆసుపత్రి డాక్టరు కార్యక్రమానికి అది ఒక ఉదాహరణ. అసలు ప్రమాదకరుడనే సర్టిఫికట్ వుంచేనే చేర్చుకోవాలనే పరతు తీసెయ్యాలి. మరి చేడినవారందరికి ఆ ఆసుపత్రులలో చికిత్స నివ్వాలి.

మన లాంటి దీనదేశానికి మంచి పశువుల పోషణ అవసరం. దానికై ప్రతి తాలూకాలోను మంచి జాతి ఆంబోతులను, దున్నలను పెట్టి ఉత్తమ జాతి పశువుల్ని తయారు చేయించడంలో తోడ్పడాలి.

శ్రీ భుజంగరావు (యు. పి. పి.) హాస్పిటల్ డాక్టర్లు లంచాలు సంపాదించడంలో అవలంబిస్తున్న పద్ధతులను వివరించారు. పోలీసుల ఒత్తిడికి లొంగి గాయపడిన వారికి వైద్యం చేయకుండా తిరిమివేసిన ఘటనలను వుదహరించి, వైద్యులు స్వతంత్రంగా వ్యవహరించాలని ఆదేశిస్తూ సస్పెన్షన్లు పంపాలన్నారు. గ్రామాలలో ఆయుర్వేద వైద్యాలయాలకు సాయం ఇస్తే ప్రజలకు వైద్య సహాయం కొంతయినా చిక్కుతుందన్నారు.

హైద్రాబాదు రైతు రుణవిమోచనబిల్లు

రాష్ట్రపతి ఆమోదముద్రకు ఆలస్యం

న్యూఢిల్లీ, మార్చి 31

హైద్రాబాదు రైతు రుణవిమోచన బిల్లుకు రాష్ట్రపతి ఇంతవరకూ ఆమోదముద్ర వేయలేదు. 1954 లో రాష్ట్రశాసనసభ దీనిని ఆమోదించింది.

ఆక్షేపణకరమైన నిబంధనలుకొన్ని అందులో వుండటమే ఈ ఆలస్యానికి కారణమని ఈవేళ లోక్ సభలో శ్రీ బి. ఎన్. దాతార్ శ్రీ టి. బి. విఠలరావు అడిగిన ప్రశ్నకు జవాబు చెప్పారు.

1955 ఫిబ్రవరిలో రాష్ట్రపతి ఆమోదముద్రకోసం ఆ బిల్లు కేంద్ర ప్రభుత్వానికి పంప బడిందని శ్రీ దాతార్ తెలియజేశారు. అందులో కొన్ని నిబంధనలు ఆక్షేపణకరంగా వున్నాయన్నారు. కేంద్రప్రభుత్వం ఆక్షేపణలు 1955 మే 16 వ తేదీన రాష్ట్రప్రభుత్వానికి తెలియ జేయబడ్డాయన్నారు. ఈ ఆక్షేపణలకు రాష్ట్రప్రభుత్వంఇచ్చిన జవాబు గత ఫిబ్రవరి నెల 3 వ తేదీన అందిందని తెలియజేశారు. పునఃపరిశీలనా నంతరం ఆబిల్లు రాష్ట్రపతి ఆదేశంపై రాష్ట్ర శాసనసభకు తిరుగా పంపబడిందన్నారు

గోదావరి ప్రాజెక్టు

[1 వ పేజీ తరువాయి]

సభ్యుల సమావేశంలో అంగీకరించింది. మొదటి అంచనాను ముప్ఫయికోట్ల నుండి పది కోట్ల రూపాయలకు తగ్గించి తక్షణమే వివరాలతో నివేదిక పంపించవలసిందిగా హైద్రాబాదు ఛీఫ్ ఇంజనీరును ఆదేశించింది. పది కోట్ల రూపాయలకు తగ్గించే పక్షంలో ఈ ప్రాజెక్టు రెండవ దశను చేర్పించడానికై వత్తిడి తెస్తామని ఇరిగేషన్ ఉపమంత్రి వాగ్దానం చేశారుకూడ.

అందుచేత హైద్రాబాదు ప్రభుత్వం తక్షణమే సవరించిన నివేదికను కేంద్రానికి పంపి, రెండవ దశను చేర్చడానికై వత్తిడి తేవాలని కోరుతున్నాము. నాగార్జున ప్రాజెక్టుకై సమష్టిగా ఎడతెగని ఆందోళన జరిపినట్లే, ఈ ప్రాజెక్టునుకూడా రెండవ ప్రణాళికలో చేర్పించేందుకుఆందోళన చేయాలని తెలంగాణా, ఆంధ్రప్రజానీకానికి విజ్ఞప్తి చేస్తున్నాము. వెనుకబడిన అయిదు జిల్లాలలో ఈప్రాజెక్టువల్ల ఇరవై ఒక్క లక్షల ఎకరాల భూమి సాగవుతుంది. అందువల్ల ఈ ప్రాజెక్టును ప్రణాళికలో చేర్పించేందుకు ఆంధ్ర ప్రభుత్వంకూడా కృషి చేయాలని కోరుతున్నాము.

శ్రీనగర్, మార్చి 30

కాశ్మీర్ సమస్యపై లోక్‌సభలో ప్రధాని నెహ్రూచేసిన ప్రకటన కాశ్మీర్ ప్రజలకొక విజయమని కాశ్మీర్ జాతీయ మహాసభ కార్యదర్శి నేడు ఒక ప్రకటన చేశారు.

స్కెచ్

"కోనేటిరావు"

(ప్రభుత్వ ఉద్యోగంలో పరామర్శ)

'వసంత విహార్'

ఆంధ్రదేశంలోని అనంతకోటి కచేరీలలో ఓ కచేరీలో శ్రీ కోనేటిరావు ఓ గుమాస్తా. కోనేటిరావును గురించి అతని జీవితచరిత్రనుగురించి మనకంతగా తెలీదు. అయినా కోనేటిరావు 'గుమాస్తా' అని విశ్వంభరుడంటాడు. కానీ అందులో నిజమ్లేదు. కోనేటిరావు చదువుకొనే రోజుల్లో కలెక్టరవుతాడని అనుకుంటూ వుండేవారు ఆ పరిసరాల్లోని జనం. ఉద్యోగంలో చేరిన కొత్తల్లో తాశీల్దారు అవుతాననుకొనేవాడు కోనేటిరావు తనలోతను. చివరకితను పదిసంవత్సరాల నుంచీ అదే గుమాస్తా - ఆఖరి తరగతి గుమాస్తా - పనే వెలిగిస్తున్నాడు. అయితే కోనేటిరావు మాత్రం నిర్వికారుడు. ఈ విధంగా కోనేటిరావు అతని ముత్తాతలు వగైరా, వగైరా అంతా యిదే విధంగా గుమాస్తాలుగానే రిటైరయ్యారు. కాబట్టే కోనేటిరావు పుట్టుకతోనే గుమస్తా అన్నాడు 'కోనేటిరావు వంశ పరిశీలకుడు' విశ్వంభరుడు.

మొదట్లో కోనేటిరావు కలలుకనేవాడు. ఏ టెన్నిసీలోనో యేలాగో తనో ఛీఫ్ ఇంజనీరుగా పనిచేస్తున్నట్లు, ప్రపంచంలోని ప్రజల నాగరికతకు చిహ్నమైన అమెరికాలో ఆయనకు ఘనసన్మానానికి యేర్పాట్లు చేస్తున్నట్లు. ఆ కలలు మధ్యలోనే కరిగిపోతుండేవి. అయినా ఆ మొదట్లో ఆదేపనిగా కలలుమాత్రం వచ్చేవి.

కోనేటిరావు తాలూకు శ్రీమతి సినిమాల్లో శ్రీమతిలాగా మహాప్రతివ్రతాగాదు, అతిగయ్యాళీ కాదు. అతి సామాన్యమైన మనిషి. అందుకే మొదట్లో మహా యిదిగా భోరుమంటూ వుండేవాడు పాపం కోనేటిరావు. ఈ విధంగా ప్రారంభమైన ప్రేమయాత కోనేటిరావుగారి జీవితం రానురానూ గులాబి పువ్వులు లేని ముళ్లకొమ్మలా తయారవటం నిజంగా విచారించవలసిన విషయం.

దంపతుల యథార్థం అర్థ రూపాయి తీసుకొని పనిచేసి పెట్టాడని. యేం తీసుకొన్నా అత్తగారు ధరించే ప్రియమైన కోటుతాలూకు కన్నాలు ఎప్పటికప్పుడు వృద్ధి అవుతూనే వున్నాయి. కానీ, తరగటమూ లేదు; కోటు మానటమూలేదు. పాపం కోనేటిరావు లంచగొండి అని ఎవరన్నా అంటే వారి అమాయకత్వానికి మనం జాలిపడాలి.

పై అఫీసర్లు దీవెనలిస్తూ వుంటారు. క్రింది నౌఖర్లు వెక్కిరిస్తూవుంటారు. అయినా గమ్మత్తైన విషయం కోనేటిరావు తొణకడూ, బెణకడు. అందుకనే గుమాస్తాల రిక్రూట్‌మెంటుకు కూడా వంశపారంపర్యత వుంటే 'డిసిప్లినరీ కాడర్' ఏర్పడుతుందని విశ్వంభరుడి వాదన. కోనేటిరావు తాలూకు తాతలు వగైరా గుమాస్తాలు కావటంవల్లనే 'యితగాని'లో యింత ఓర్పు, సహనం, విక్రమింగుడు గుణము (తిట్లు, దీవెనలు) యింత అమితంగా కన్పడుతున్నాయని అతగాడి బుజూవు. నిజానికి అంతేనేమో అనిపిస్తుంది. మొన్న మధ్యనొచ్చిన 'డైరెక్టుగా' ఆఫీసరైనాయన మనవాడి మొఖాన 'పాస్' గిరవాటువేస్తే నవ్వుకుంటూ తిరిగొచ్చాడు. అట్లా అని చాలామంది బహుశా యితేమన్నా 'వేదాంత సంబంధమేమో'నని అనుమానపడేరు. ముమ్మాటికి కాదు.

గద్దరోజుల్లో కోనేటిరావుబలగం తాలూకు జీవితాల్ని ఆసాంతాంగా తీసుకొని ఒక 'ఎర్రరంగు' తాలూకు మనిషి ఓ నాటకం వ్రాసి వీళ్ళ జీవితాల్లోనిగుట్టు, మట్లుబయటపెట్టాడు. అంతేరకు వీళ్ళ నడుపుకుంటున్న సంఘానికి ఇంకో అక్షరం చేర్చి పేరు మార్చారు. ఆ సంఘానికి ప్రతినిధిగా వీరి కోరికల్ని గురించి ఎవరన్నా తేవీరు అనగదల్చుకొన్నారో ఆయన్నే అధ్యక్షుడుగా ఎన్నుకొని తతంగం నడుపుకోటంతో పని సగంలో సగం కలిసొస్తుందట. ఇదీ కోనేటిరావు ఉన్న వాతావరణం.

* * *

అఫీస్‌లో ఓ ఆదివారం పదిగంటలు రాత్రప్పుడు గుడ్డిలాంతరు ముందు కూర్చున్న కోనేటిరావు ఎగిరి గంతు వేశాడు. కోనేటిరావు యింటిలో శ్రీమతి నిద్రలో కలుక్కుమని "ఏమయిన యింకా రాలేదా?" అని తనలోతనే ప్రశ్నించుకొని "ఎప్పుడూ యింతే, యీ మనిషితో వేగేదెట్లా?" అని ఓ ప్రశ్నలాంటి జవాబు చెప్పుకొని మళ్ళీ నిద్రకు పడింది.

ఇంతకూ కోనేటిరావు ఆ రోజు రాత్రి ఎగిరిగంతు వేయటానికి కారణం తను మూడు రోజులనుంచి బాధపడుతున్న 'ఎకౌంట్ ఫిగర్' కుదిరిందట. ఈ విషయం వెంటనే పై అధికారికిచెప్పి ఆయన తాలూకుకోపాన్ని తగ్గించి తెల్లార యీముందే స్పెషల్ ప్యూన్‌ను పంపాలి. ఇంత కర్మకాండ ముందున్నప్పటికీ 'ఫిగర్' కుదిరేటప్పటికి అంత సంతోషపడి పోయేడు పాపం అల్పసంతోషి.

కోనేటిరావు తాలూకు ఫ్యాక్టరీకి సెలవంటూలేదు. పనిగంటలూ, తేదీరూల్సు అసలేలేవు. అది సర్కారు తాలూకు ముఖ్యమైన కర్మాగారం. అది గడియారం లాంటిదని ప్రతి ఆదివారమూ 'పర్మిషన్' మీద పొరుగూళ్లతిరిగొచ్చే పైఅధికారిఅంటూ వుంటాడు. అందుకని ఆ కర్మాగారపు ప్రధాన ద్వారానికి తాళాలు వెయ్యరు. పాపం విసుగొచ్చి ఈతలుపులుమాత్రం ఎందుకు దండగఅన్నాడు కోనేటిరావు మొదట్లో.

ఉద్యోగంలో చేరకముందూ, కాలేజీ విడకముందూ కోనేటిరావు మంచి కళాభిమాని, పత్రికాపాఠకుడు, సారస్వతాభిలాషి, సాహిత్య సేవకుడు. ప్రస్తుతం వాటిఊసెత్తితే చెప్పమంటే గుర్తులేలనేస్తాడు. 'నెహ్రూ ఎవరంటే 'మహాభారత' నవయిత అని జవాబు చెప్పినా కోనేటిరావును గురించి మనం నవ్వలేము.

* * *

కోనేటిరావుకు రానురాను ఏ శీలకు ఆ శీల తీయటం చేతనైంది. ఇలాంటి వాళ్ళను గురించే, అఫీసరుపోగానే తలకాయ టేబిల్ మీదపెట్టి పనికి దిగుతాడని అనేవాడు శ్రీ శ్రీ. అసలు ఇప్పుడతనికి ఆ పైమర తుప్పుపట్టి పనిచేయటం మానివేసిందని విశ్వంభరుడంటున్నాడు. ప్రస్తుతం చేతులతాలూకు శీలలు మాత్రమే అమితంగా పదపడి కలిగియున్నాయని తెలుస్తోంది. అందువల్లే రోజుకు అయిదారు, పాడ్‌లు వ్రాసి పారేస్తాడట - అవలీలగా - !

ఇదీ కోనేటిరావు తాలూకుజన్మ. కోనేటిరావు ప్రభుత్వమనే యంత్రంలో ఓ మర. ఆమరలోని శీలలు కోనేటిరావును నిలుపు తున్నాయి. కోనేటిరావు ఫ్యాక్టరీ ఓ గడియారం- అది ఆగదు. ఆదివారమంటూ లేదు దానికి. కోనేటిరావు శ్రీమతి రాత్రపుడు (ఆదివారమైనా!) పదిగంటలు వరకు మగతనిద్ర పోతుంది. కోనేటిరావు ఆంధ్రదేశంలోని అనంతకోటి కచేరీలలో ఓ గుమాస్తా.

'చైనా పారిశ్రామికాభివృద్ధికి సోషలిజమే శరణ్యం'

చైనాలో సోషలిస్టు పరివర్తననుగూర్చి షాంగ్‌హై పారిశ్రామికవేత్త అభిప్రాయం

సోషలిస్టు పరివర్తన వలననే చైనాలో పరిశ్రమలు అభివృద్ధిచెంది దేశంఆర్థికంగాపటిష్ఠవంతమవుతుందని షాంగ్‌హైలోని పెద్ద పెట్టుబడిదారులలో ఒకడైన జేంగ్ యూజెన్ తెలియజేశాడు.

ఇటీవల చైనాలో వ్యక్తిగత పెట్టుబడిదారుల క్రిందవున్న పరిశ్రమలను పెట్టుబడిదారుల - ప్రభుత్వ సమిష్టి యాజమాన్యంలోకితీసుకుంటున్నారు. ఈ సోషలిస్టు పరివర్తనను గూర్చి నవచైనా వార్తాసంస్థ విలేఖరి జేంగ్ యూజెన్‌ను కలుసుకొని యింటర్వ్యూ చేసినప్పుడు ఆయన వెలిబుచ్చిన అభిప్రాయాలను యీ క్రింద పొందుపరుస్తున్నాం.

జేంగ్ యూజెన్ షాంగ్‌హై సుంగ్ సింగ్ పత్తిమిల్లుల జనరల్ మేనేజరు. ఈయన కుటుంబానికి ఎనిమిది నగరాలలో కొలిమిల్లులు, పిండిమిల్లులు, యంత్రపరికరాలు తయారుచేసే ఫ్యాక్టరీలు అన్నీకలిపి మొత్తం 24 మిల్లులు వుండేవి.

"నేను సోషలిస్టు పరివర్తనను బలపరచడం వలన రాజకీయంగానూ యితరత్రా ప్రజలలో నాకు పలుకుబడి పెరిగింది" అని జేంగ్ నవచైనా వార్తా సంస్థవిలేఖరితో చెప్పాడు. ఆ విలేఖరి జేంగ్‌తో జరిపిన ఇంటర్వ్యూను గురించి యిలా వ్రాస్తున్నాడు:

ఒక పెద్ద తోటలో అందంగా అలంకరించిన స్వంతభవనంలోకి జేంగ్ నన్ను ఆహ్వానించాడు. ఒక కిటికీ దగ్గర పెద్ద పియానో వుంది. తన నలుగురు కూతుళ్ళలోనూ ఒక అమ్మాయి సంగీత విద్యార్థిని అని తెలియజేశాడు.

ఆయన అప్పుడే బయటనుంచి యింటికి తిరిగి వచ్చాడు. షాంగ్‌హై పరిశ్రమల వాణిజ్య మండలికి జేంగ్ యూజెన్ ఉపాధ్యక్షుడు. షాంగ్‌హైలో పెట్టుబడిదారుల యాజమాన్యంలోకి మార్చడానికి జరుగుతున్న కృషివలన ఆయనకు గతవారంలో తీరిక దొరకటంలేదు. 'మీరు పెట్టుబడిదారుడిగా వుంటూ సోషలిజాన్ని ఎందుకు బలపరుస్తున్నారు,' అని నేను ప్రశ్నించాను. "అవును. నేను పెట్టుబడిదారుడినే. కాని నేను చైనాదేశస్థుడనుకూడాను. నేను చైనా దేశీయుడిగా మీతో మాట్లాడుతున్నాను" అని జేంగ్ జవాబిచ్చాడు.

"నిన్న సోషలిస్టు పరివర్తనను బలపరుస్తూ జరిగినసభలలో మావాళ్ళంతా పాల్గొన్నారు. వ్యాపారస్తుల భార్యల సమావేశానికి నా భార్య వెళ్ళింది. చిన్న తమ్ముడూ యువవ్యాపారస్తుల సభకు హాజరయ్యాడు. ఇతరసిని పెకింగ్‌లో జరి[illegible] యువవ్యాపారస్తుల సమావేశానికి ప్రతినిధిగా ఎన్నుకున్నారు. చిన్నమ్మాయిలు ముగ్గురూ మాధ్యమిక పాఠశాలలో చదువుకుంటున్నారు. వీళ్ళు వ్యాపారస్తుల పిల్లల సమావేశానికి వెళ్ళారు. వాళ్లంతా సోషలిస్టు [illegible] పరుస్తూ ప్రసంగించారు.

"పెట్టుబడిదారీ దేశాల్లోని మిత్రులు చాలామంది మేం సోషలిజాన్ని బలపరచడంచూచి ఆశ్చర్యపోయారు. నువ్వు వుంటున్న స్వంత యిల్లు యింకా నీకిందే వుందా? అని కొంతమంది ప్రశ్నించారు. మరికొంతమంది నన్ను పెట్టుబడిదారుడి బురఖా వేసుకున్న కమ్యూనిస్టేమోనని అనుమానించారు. దేశ విముక్తికి పూర్వం నేను కమ్యూనిస్టుల నెప్పుడూ కలుసుకోలేదనీ, వాళ్ళంటే నాకు హడలుగా వుండేదనీ నేను ఆ మిత్రులతో చెప్పాను. ట్యునిస్ నుంచి వచ్చిన మిత్రుడు ఒకాయన మా యింటికివచ్చి పరిశ్రమల స్థితిగతులను స్వయంగా చూచాక, నా అనుభవాలనుగూర్చి విన్నాక చైనా వచ్చినప్పుడు తనకు వున్న అనుమానాలన్నీ తొలగిపోయాయని ఆయన నాకు చెప్పాడు."

తరువాత జేంగ్ తన తండ్రి పినతండ్రీ పరిశ్రమలను స్థాపించడానికి మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో ఎంత కష్టపడిందీ చెప్పుకొన్నాడు. యుద్ధం అయిపోయిన తరువాత సామ్రాజ్యవాదుల హయాంలోనూ, తరువాత జపానువాళ్ళకిందా ఆర్థిక సంక్షోభంకాలంలోనూ ఎన్నెన్ని అవస్థలుపడిందీ వివరించాడు.

కొమింటాంగ్ హయాంలో అవస్థలు

"మా తండ్రీ, పినతండ్రీ కొమింటాంగ్ ప్రభుత్వంమీద గంపెడంత ఆశపెట్టుకున్నారు. చాంగ్‌కైషేక్ అధికారంలోకి రాగానే చేసిన మొదటి పని ఏమంటే మా పినతండ్రిని బెదిరించీ, అదిరించీ బలవంతంగా ఒక లక్ష వెండి డాలర్లు వసూలుచేయడం. 1934 లో మా నాన్న 3, 4 కోట్ల యువాన్‌లు ఖర్చుచేసే అప్పుడంటే చైనా బ్యాంకు, షాంగ్‌హై బ్యాంకులోనూ 50 లక్షల యువాన్‌లకు తాకట్టుపెట్టాల్సి వచ్చింది. బ్యాంకువాళ్ళు 28 లక్షల యువాన్‌లు చెల్లించాక చాంగ్‌కైషేక్ ముఠాకు చెందిన నిరంకుశ పెట్టుబడిదారుల నాయకుడు టి. వి. సూంగ్ అన్నదమ్ముడి బ్యాంకువాళ్ళు మిగతా అప్పు మాకు చెల్లించకుండా చేశారు. సూంగ్ మా అప్పుని కాజెయ్యాలని చూచాడు. జపాను వ్యతిరేకయుద్ధం ముగిసాక షాంగ్‌హైపనికి గస్తీ పటాలంవాళ్ళు పంపిన గుండాగులు డబ్బుయిస్తేనేళ్ళ ముసలివాడైన మా నాన్నను పట్టుకొని 40 రోజులు నిర్బంధంలో వుంచారు. 2 లక్షల అమెరికను డాలర్లు ముడుపు చెల్లించాకనే ఆయనను విడిచిపెట్టారు.

"కొమింటాంగ్ పాలనలో అమెరికను సామ్రాజ్యవాదులు మన నెత్తిన రుద్దిన సరకుల నిల్వల మూలంగా చైనా పరిశ్రమలు దివాళా తీసాయి. గ్రామీణ ప్రాంతాల ఆర్థిక విధానం దెబ్బతిన్నది. మన పరిశ్రమలలో వాడే ముడిపత్తిలో అధికభాగం అమెరికానుండి దిగుమతి అయ్యేది. పరిశ్రమలను పెంపొందించి దేశాన్ని పటిష్ఠం చేయాలని మా నాన్న, కన్న కలలన్నీ కల్లలయ్యాయి.

కమ్యూనిస్టు ప్రభుత్వం చేసిన సహాయం

"దేశం విముక్తి పొందుతున్న రోజులలో కమ్యూనిస్టులు అంటే భయపడ్డాం. మా అన్నదమ్ములలో కొంతమంది హాంకాంగ్, మరికొంతమంది వ్యాపారం చేసుకోడానికి థాయిలాండ్ వెళ్ళిపోయారు. కొమింటాంగ్ అంటేనూ, సామ్రాజ్యవాదులంటేనూ అసహ్యంపుట్టిన మా నాన్న, నేనూ దేశంవిడిచి పోగూడదనుకున్నాం.

"కొమింటాంగ్, అమెరికావాళ్ళు సాగించిన బాంబుల దాడివలనా, పెట్టుబడి తరిగిపోవడంవలనా మా పరిశ్రమలన్నీ చాల క్లిష్టదశలో వున్నాయి. అప్పుడు ప్రజాప్రభుత్వం మాకు అప్పులుయిచ్చి తోడ్పడింది. మా సరకులకు ప్రభుత్వం ఆర్డరిచ్చింది. మేనేజి మెంటులు అభివృద్ధి చేయడానికి సహాయపడింది. కార్మికులుకూడ నూతనోత్సాహాన్ని ప్రదర్శించారు. వీటన్నిటి ఫలితంగా మా పరిశ్రమలు నిలదొక్కుకోడానికీ, ఉత్పత్తిని పెంచడానికీ వీలైంది. 1951 నుండీ లాభాలు పెరిగాయి. 1953 లో మాకు మొత్తం పెట్టుబడిమీద నూటికి 25 వంతుల కంటె యెక్కువలాభాలు వచ్చాయి. మా అన్నదమ్ములు థాయిలాండ్‌లో పెట్టిన వ్యాపారం దివాళా తీసింది.

పారిశ్రామికాభివృద్ధి

"విముక్తి పొందిన అనంతరం దేశం నానాటికీ బలపడుతుండటం యింతకంటే ముఖ్యవిషయం. ఇది ప్రతి చైనా దేశస్థుడు గర్వించవలసిన విషయం. ప్రభుత్వ కార్యక్రమంలోని ప్రతి అంశమూ, అధ్యక్షుడు మావో చెప్పిన ప్రతి మాటా అక్షరాలా నిజమని తేలింది. మన దేశంలోనే ప్రత్తి పంట పెరగడం వలన మన కొలిమిల్లులు విదేశీ దిగుమతులపై ఆధారపడాల్సిన అగత్యం తప్పింది. కొరియాలో విజయం సాధించడంతో సామ్రాజ్యవాదుల ప్రమాద భయాలన్నీ తొలగిపోయాయి. ఇప్పుడు దేశమంతటా పెద్దపెట్టున పునర్నిర్మాణ కార్యక్రమం సాగిపోతున్నది. కమ్యూనిస్టుపార్టీ లేకుండా, సోషలిస్టు పథాన్ని చేపట్టకుండా యిదంతా [illegible] సాధ్యమవుతుందా" జేంగ్ యూజెన్ ప్రశ్నించాడు.

సోషలిజంవల్ల ప్రయోజనాలు

సోషలిజాన్నిగూర్చి అభిప్రాయాలు తెల్పవలసిందిగా ఆయనను కోరాను.

"గడచిన ఆరు సంవత్సరాలూ నాకు ఒకరకంగా సోషలిస్టు పాఠశాలగా పనిచేశాయి. 1950 లో నేను సోవియట్ యూనియన్ వెళ్ళాను. సోవియట్ కార్మికుల జీవితం మనదేశంలోని అనేకమంది పెట్టుబడిదారుల జీవితంకన్నా బాగుంది" అని జేంగ్ వివరించాడు.

పెట్టుబడిదారీ విధానం పరివర్తనం చెందడంవలన మీకు వచ్చే లాభనష్టాలేమిటి? అని ప్రశ్నించాను. "నాకు దోపిడీవలన వచ్చే వ్యక్తిగత లాభం పోతుంది. దీనికి బదులుగా రెట్టింపు భాగ్యవంతమూ, సుఖ సంపదలకు ఆలవాలమూ, పటిష్టమూ అయిన దేశం లభ్యమవుతుంది. ఇతరులను దోపిడి చేసుకుని బ్రతికేవారిలో సాధారణంగా వుండే మోసం పోతుంది. డబ్బుతో కొనుక్కోడానికి వీలులేనటువంటిది కార్మికుల ప్రేమ, విశ్వాసం. అది మనకు లభ్యమవుతుందని" జేంగ్ జవాబిచ్చాడు.

ఇంటర్వ్యూ చివరిలో "ప్రతి చైనా దేశీయుడూ కోరుకుంటున్నది మనదేశం పటిష్టమైన సోషలిస్టు దేశంగా అభివృద్ధి చెందాలనే" అని జేంగ్ చెప్పాడు.

అధిక లాభాలు

ఆయన ప్రస్తుత జీవితాన్ని గురించీ, భావి కార్యక్రమాన్ని గురించి అడిగాను.

"గడచిన కొద్దిసంవత్సరాలలో యెన్నడూ రానంతటి లాభం పరిశ్రమలనుండి నాకు వచ్చింది. నాకు ఖర్చుపెట్టలేనంత లాభం వస్తున్నది. ఇప్పుడు ఆ పరిశ్రమలన్నీ ప్రభుత్వ-పెట్టుబడిమీద సమిష్టి యాజమాన్యం క్రిందకు వచ్చాయి. నేను పెట్టిన పెట్టుబడి రావలసిన లాభాన్నిగూర్చి నాకు హామీ యిచ్చారు. ఈ లాభమంతటితోను నేషనల్ బాండ్లు కొని దేశ పునర్నిర్మాణ కార్యక్రమంలో తోడ్పడదలచాను. సమాజంలో ఉపయోగకరమైన సభ్యునిగా వుండటానికి శాయశక్తులా పాటుపడుతున్నాను."

కథానిక

జమున

మూలం: శ్రీ కిషన్‌చందర్

అనుసరణ: శ్రీ యస్. డి. షహీద్

జమున సాగ్రాలో వుండేది. సాగ్రా అనాదినుంచి బ్రాహ్మణ వర్గానికి ధారదత్తంగా వుంటున్న గ్రామం. గజిబిజిగా అల్లుకున్న కాశ్మీర్ పర్వతాల్లో సీమూల లోయ గర్భంలో ప్రపంచంతో సంబంధంలేనట్టు ఒంటరిగా కనిపిస్తుంది. ఇరుగ్గా రెండు కొండలు సాగ్రా చుట్టూ పెట్టని కోటలా నిలబడ్డాయి. మంచుముద్దలా ప్రతి ఉదయం తూర్పుకొండ చీల్చుకొచ్చే సూర్యబింబం ఎర్రబడి పడమటి కొండగర్భంలోకి కుంగిపోవటం సాగ్రా ప్రజలకు 'జ్యా' ఆకారంలో కనిపిస్తుంది. ఈ 'జ్యా' గమనాన్ని బట్టి వాళ్ళు ఋతువులు నిర్ణయించుకుంటారు. వేసవిలో 'జ్యా' నీటి మడుగునుంచి నిటారుగా బయల్దేరి రెండు కొండల్ని చీల్చుకొని శరవేగముతో ప్రవహిస్తున్న కొండవాగులో అంతర్థాన మవుతుంది. ఆ వేళరోజుల్లో మొక్కజొన్న పైరువేసి, గట్లమీద మిర్చి పండిస్తారు. కాలవపక్క పొలాల్లో నీరు దండిగా వుండటం వల్ల వరిపైరు ఏపుగా పెరిగేది. అప్పుడప్పుడు వర్షం లెక్కవైపైన పంట వగద పొలాలపోవటం కూడా కద్దు. చలికాలంలో నదీ ప్రవాహం తగ్గి నిలకడగా ప్రవహిస్తున్నప్పుడు మాత్రం సాగ్రా ప్రజలు మళ్ళీ పొలాలు దున్ని గోధుమపంట పండించాలని ప్రయత్నించేవాళ్ళు.

సాగ్రాకు పగటిపొద్దు తక్కువ, రాత్రిపొద్దెక్కువ. ఎండ తీవ్రంగా నాలుగు ఘడియలపాటైనా వుండదు. పగలంతా ఆకాశం నిట్టూరుస్తున్నట్టు తెల్లని మంచుతెర కప్పుకుంటుంది. రాత్రి నల్లని చీకటి దట్టంగా వ్యాపిస్తుంది. ఆ చీకటికి భయపడి దూరంగా పారిపోతున్నట్టు నక్షత్రాలు నిప్పురవ్వల్లా కనిపిస్తాయి. చలికాలంలో వాడిమొనలా శరీరాన్ని తాకేచలిగాలి. దానికి తోడు ఆకాశంనిండా నల్లని మబ్బులు, ఉరుములు, మెరుపులు! ఒక్కముక్కలో చెప్పాలంటే సాగ్రాకు రెండే రెండు ఋతువులు. ఒకటి సంక్షిప్త వసంతం, రెండోది సుదీర్ఘ శిశిరం; పంటలు కూడా రెండే. మొక్కజొన్న, వరి.

శిశిరంలో సాధారణంగా సాగ్రా ప్రజలు ఇతర ప్రాంతాలకు పోయి వంటపనికి కుదురుకుంటారు. కొంతమంది దూరంగావున్న సంతలకెళ్ళి ఉప్పు, బెల్లం తెచ్చుకుంటారు. స్త్రీలు మాత్రం ఇళ్ళల్లోనే వుండి దారం వడుకుతారు. ఉన్నివస్త్రాలు, దుప్పట్లు, స్త్రీలకోసం నాజూకైన రంగులు వాళ్ళ చేతులమీదే తయారవుతాయి. వాటిమీద రంగురంగు దారాలతో రకరకాల డిజైన్లు కుట్టి అందంగా అలంకరించుకుంటారు.

సాగ్రాలో సమారమి వంద గడపలుంటాయి. ఆవంద గడపలమీద గ్రామపెద్ద పెత్తనం చెలాయిస్తుంటాడు. ఆయనే ఆ గ్రామానికి అధికారి. కులపెద్ద. బైటప్రపంచంతో సంప్రదింపులు మొదలుకొని [illegible] వగైరా ఆయనద్వారా జరగవలసిందే! దగ్గరదగ్గరగా ఆయన ఆ గ్రామానికి ప్రతినిధి అనిచెప్పాలి. సాగ్రా బైటి ప్రపంచంలో రకరకాల మార్పులొచ్చాయి. ఆర్యులు, మంగోలులు, టిబెట్టువాళ్లు, నేపాలీలు, చైనావాళ్ల మొగలులు అంతరించిపోయారు. చివరికి డోగ్రా ప్రభుత్వం స్థిరపడింది. రాజకీయంగా యిన్ని పరిణామాలొచ్చినా సాగ్రా ఇక్కడ ఎదరలేదు. వాళ్ళ జీవితప్రమాణం పెరగలేదు, తరగలేదు. పూర్వంనుంచి యిప్పటి వరకూ పంటలో నాలుగోవంతుశిస్తు క్రింద ముట్టచెపుతున్నారు. వెట్టిచాకిరి, శిస్తుబాకి, కరణంగారి కుటుంబఖర్చులు మొదలైనవన్నీ వాళ్ళ నెత్తినే పడతాయి. పోగా మిగిలిన అరపంటలో ముప్పాతిక కౌలు క్రింద పిండుకొనే వారు.

ఈ సాగ్రాలోనే జమున వుండేది. జమునభర్త వ్యవసాయం, వ్యాపారం రెండూ చేసేవాడు. జమునవాళ్లు కొండవాగుకు నైరుతీమూల చిన్నగట్టుమీద వుండేది. ఇంటిముందు బాహ్య ప్రపంచంతో సంబంధం కలుపుతూ సాగ్రా గుండా ఈశాన్యంగా పర్వత శిఖల్లోకి పడిపోయే సన్నని బాట కనిపిస్తుంది. సాగ్రాకి జమునఇల్లే అంగడి. ఆనాడు దారే రాజబాట. జమునభర్త ఒకరోజు యీ రాజబాట ముందున్న కొండవాగు దాటుతూ వుండగా ప్రవాహం ఆకస్మాత్తుగా పెరిగి నీటి అడుగున దాగివున్న బండరాళ్ళకు ఢీకొన్నాడు. అతని తలపగిలి మెదడు నుజ్జు నుజ్జు అయిపోయింది. ఎముకలన్నీ విరిగిపోయాయి. మొత్తంమీద ఇది వాడి కర్మే అనండి, లేకపోతే ఈశ్వరేచ్ఛ అనండి, లేదా జమున దౌర్భాగ్యం అనండి, పోనీ ముక్కుపచ్చలారని కుర్రాడి దురదృష్టం అనండి—మొత్తంమీద అతని శరీరం బూడిద పాలవ్వటం, జమున విధవ కావటం తప్పలేదు. జమునకి భర్త చనిపోయినందుకు కలిగిన విచారం కన్నా పోతూపోతూ పసుపూ కుంకం వొలుచుకుపోయాడే అన్న విచారం ఎక్కువైంది. ఎంతో ముచ్చటగా కొనుక్కున్న చీరలన్నీ మూల పడ్డాయి. శరీరంమీద ఒక్కనగైనా నిలవలేదు. అవన్నీ పెట్టె అడుగున కనిపించినప్పుడల్లా వెక్కి వెక్కి ఏడ్చేది. ఇప్పుడు తన అందమైన శరీరాన్ని ఏ వెధవా చూస్తూకోడు. ఏ గాడిద కొడుక్కీ తన బుల్లిపెదాలు అందుకొని, నడుంచుట్టూ చేతులు చుట్టే దమ్ము లేదు. రాత్రిళ్ళు జమున ఆలోచనలు ఎక్కడెక్కడికో పయనించేవి. ఉదయం తనవును దగ్గర అన్నీ ఏకరువు పెట్టేది. ఆయనకి యివన్నీ పట్టించుకొనే తీరికా; అవకాశం వుంటుందా? మైలు రాయన్లే మెదలకుండా పూరుకొనే వాడు. దేవుడు పూరుకున్నా ఊళ్ళో పెద్దలుమాత్రం మెదలకుండా వుండలేకపోయ్యారు. మనశ్శాంతికోసం ఏవో నాలుగుముక్కలు చదువుకున్నవి, చదువుకోనివి వల్లించి, వాళ్ళ కర్తవ్యం కాబట్టి కొన్ని సూచనలు, సలహాలు యిచ్చారు. గ్రామ పెద్ద తన అమూల్య సందేశాన్నికూడా పంపాడు. మొత్తంమీద జమున యీ సంసారబంధనాలు తెంచుకొని, శివాలయంలో దేవదాసిగా వుండటం మంచిదని, కుర్రాడు, కొట్టు, పొలం తమ నెత్తిమీద పడేయ్యమని వాళ్ళ విజ్ఞప్తి. కాని జమున దేనికీ ఒప్పుకోలేదు. ఒద్దన్నా, మా బ్రాహ్మణ్యం మంటకలిసిపోతుందన్నా జమున కొట్టు వదలనంది. పొలంపని మాత్రం ఒకతని కిచ్చింది.

జమున భర్తపోయి ఒకసంవత్సరం కావచ్చింది. కుర్రాడు, కొట్టు, పొలం మంచి దర్జాగా వున్నాయి. జమున వ్యాపారంలో మంచి అనుభవం సంపాదించింది. ఎవరితో ఎంత లాలనగా నవ్వుతూ మాట్లాడితే సుఖాలు అమ్ముడుపోతాయో తెలుసుకుంది. ఈ తతంగం ఊళ్లో పెద్దలకు చిర్రెత్తిస్తున్నా జమున పట్టించుకోనట్టు తిరిగేది; ఇప్పుడు కుర్రాడికి రెండో ఏడు. వాడే ఆమెజీవితానికి కేంద్రం. ఇలా జమున జీవితం కొంతవరకూ స్థిరపడిపోయింది. కాని ఏదో లోపం ఎక్కడో దాగివుండేది. ఎవరన్నా లాలనగా తనవంక చూసినప్పుడు రక్తం వేడెక్కడం, ఊపిరిబిగపట్టడం, శరీరం పులకరించడం జరిగేది. రాత్రిళ్లు భర్త గుర్తొచ్చినప్పుడల్లా ఒక నిట్టూర్పు విడిచేది. అప్రయత్నంగా కుర్రాడి చేతులు, శరీరం వక్షంమీదికి లాక్కొని గట్టిగాముద్దాడేది. కుర్రాడు ఏడ్చినా వదిలేదికాదు. నిజానికి యీ బాధ భరించరానిదే అని చెప్పాలి. అయినా జమున తన జీవితంలో మిన్ని జయిస్తాననుకునేది. జయించాలనికూడా ప్రయత్నించేది. కొంతకాలానికి యీ యవ్వనం సడలిపోయి వార్ధక్యం రానే వస్తుందనేది అనుకుంది. కాని యమదూతలా తాసిల్దారొస్తున్న సంగతి జమునకేం తెలుసు!

సాగ్రాకి ఆఫీసర్లు రావటంచాలా అరుదు. అసలు వచ్చేఅవసరం వుండేది కాదు. అంతా బ్రాహ్మణ వర్గమే కాబట్టి భూమీలు, దొంగతనాలు జరిగేవికావు. చిన్నచిన్న తగాదాలు తీర్చడానికి పంచాయితీ వుండనేవుంది. ఎప్పుడన్నా, ఎవరన్నా రావాలనుకున్నా అరణ్యాలు, కొండలు, వాగులు అడ్డగించేవి. ఇటువంటి పరిస్థితుల్లో తాసిల్దారుగారిరాక అందర్నీ కలవరపరిచింది.

తాసిల్దారు అందంగా వుంటాడు. కండలుతిరిగినశరీరం, దానికితగ్గ హుందాతనంవుంది. మొహంలోగర్వం తొణికిసలాడుతుంది. వీటన్నిటికితగ్గట్టుకోటు, హేటు ఉన్నాయి. జమున తన కొట్టుముందునుంచి గుర్రం మీద వెడుతున్న తాసిల్దార్ని చూసింది. ఇక్కడున్న కుర్రాళ్ళు ఝుం ఝుం పొగుతప్ప ఈ సూట్లూ బూట్లూ ఎరగరయ్యె. జమున ఈ కొత్తరకం మనిషివంకచూసి బిత్తరపోయింది. తాసిల్దారుకూడా అగి నిభూతా చూసేసరికి జమున నిశ్చేష్టురాలై చేతిలో త్రాసు పడిపోయేవరకూ మేలుకోలేక పోయింది.

కచేరీ ఒక పెద్ద చెట్టుక్రింద ఏర్పాటు చేశారు. తాసిల్దారుగారు ఒక మంచి కుర్చీమీద కూర్చున్నారు. చుట్టూ నిలబడ్డ సాగ్రా ప్రజలంతా భయంతో వణికిపోతున్నారు. దేవుడి ముందు సామాన్య మానవులు తమ కార్యాలు విన్నవించుకుంటున్నట్టుందా దృశ్యం.

గుమాస్తా అబ్దుల్ రహిమాన్ తన బవిరిగడ్డం సవరిస్తూ అన్నాడు "ఏరా గాడిదకొడుకా, గడ్డిమోపులు తెచ్చావా?"

"చిత్తం. నాలుగు గడ్డి మోపులు తెచ్చానండి." గాడిద కొడుకు సమాధానం చెప్పాడు.

"నాలుగు గడ్డిమోపులట్రా నువ్వు తెచ్చేది. కోళ్ళ సంగతే మన్నావ్?" మళ్ళీ తాసిల్దారు వంకచూసి అన్నాడు "యీ ప్రాంతానికి తమబోటి పెద్దలు రాకపోవటం పెద్దలోటయి పోయిందండి. ఈ వెధవలకి ఎవర్తో ఎలా వ్యవహరించాలో తెలీదు. వొట్టి అడవి జాతి."

గ్రామ పెద్ద భయపడుతూ అన్నాడు. "అయ్యా! ఇది బ్రాహ్మణులుండే పల్లె అని ఏలినవారికి మనవి చేసుకుంటున్నాను. ఇక్కడ కోళ్ళను పెంచేవారు, తినేవారు లేరు. ఎక్కడినుంచయినా తేవటానికి ఈపరిసరాల్లో మరో గ్రామ మయినా లేదు."

దఫేదారు ఘసీటూరాం గర్జించాడు. "ఏరాకుక్కా! ఏమిటి వాగుతున్నావ్. ఈ వెధవని చెట్టుకుకట్టేసి కొరడాతో కొట్టండి. పెద్దలతో మాట్లాడే పద్ధతే తెలీదు."

గ్రామపెద్ద వణికి పోవటంచూసి తాసిల్దారు తన సన్నమీసాలు వడేస్తూ అన్నాడు. "పోనీ పాపం, నిజం చెప్పాడు. సరే, నువ్వు గ్రామపెద్దవి కదూ?"

"చిత్తం."

"నీ పేరు?"

"సత్యనారాయణ్ అంటారండి."

తాసిల్దారు నవ్వుతూ అన్నాడు "నువ్వు చాలా అమాయకుడివి సత్యనారాయణ్. మంచిది, రాత్రికి మా బసెక్కడో చెప్పు."

"చిత్తం! తమరు ఎక్కడ వసతిగా వుంటుందో అక్కడే ఏర్పాటు చేస్తాం."

తాసిల్దారు కొద్దిగా ఆలోచించి అన్నాడు "నాకు దార్లోవున్న దుకాణం డాబా అయితే బాగుంటుందనుకుంటాను. డాబామీద సుఖంగా నిద్రపోవచ్చు."

"అది జమునఅనే విధవరాలిదండీ."

"అవునవును. అదే. అని జమున యిల్లా......జమున!"

"చిత్తం! గత సంవత్సరం దాని భర్త రామభరోసా ఆ వాగులో కొట్టుకుపోయాడు."

"సరే, అక్కడే వుంచండి. ఏమంటావ్ ఘసీటారామ్!"

ఘసీటారామ్ చేతులు జోడించి అన్నాడు. "చిత్తం. మంచిస్థలాన్నే ప్రభువులు ఎన్నుకున్నారు. ఊరబయట, చక్కని డాబా, చల్లనిగాలి......"

గ్రామపెద్ద అన్నాడు. "ప్రభువులు అనుగ్రహిస్తే మా డాబా మరింత విశాలంగా, నివాస యోగ్యంగా వుంటుంది."

"వద్దొద్దు. ప్రభువులు అక్కడికే వేంచేస్తారు." గుమాస్తా వారించాడు.

జమున ఆ రాత్రి గ్రామపెద్ద యింట్లో వుంది. మర్నాడు దుకాణానికికూడా వెళ్ళలేదు. మూడో రోజుకూడా యిల్లు ఖాళీకాలేదు. సాగ్రా వాతావరణం ఆయన్ని బాగా ఆకర్షించింది. పగల్లా అడవుల్లో వేటాడటం, సాయంత్రం కచేరీ అక్కడ గ్రామప్రజలంతా పోగవుతారు. ప్రభువులు తమ కోరికలు నివేదించుకుంటారు. ప్రజలు వాటిని నెరవేరుస్తారు.

తాసిల్దారుగారికి ఆ గ్రామం శిస్తు చాలా తక్కువగా కనిపించింది. ఈలోగా ఆయనొక రిపోర్టు తయారు చేసిపెట్టేశాడు. రిపోర్టులో ప్రజలు ప్రభుత్వానికి ద్రోహం తలపెడుతున్నారని, ప్రభుత్వం అనుమతిలేకుండా అడవుల్లో ప్రవేశిస్తున్నారని, టేకు, దేవదారు మొదలైన వృక్షాలు నరికి అడవులు నష్టపరుస్తున్నారని విశదీకరించబడింది. గ్రామపెద్ద శిస్తుబకాయి చెల్లించలేదు. అసలు ప్రతిఫసలీ బకాయి లేకుండా చెల్లిస్తున్నాడో లేదో అంతు దొరకడంలేదు. పై విషయాలన్నీ సక్రమంగా పరిశీలించమని అనుచరుల్ని తాకీదుచేశాడు. నేరం బుజువైందా వాణ్ణి ఉద్యోగంనుంచి తొలగించి రెండున్నర సంవత్సరాలు కఠినశిక్ష విధించాలని ఆయన సంకల్పం. తాసిల్దారు బంట్లకి సందు దొరికేసరికి గ్రామంలో స్వైరవిహారం సాగించారు. వాళ్ళ కోపశాంతికి అప్పటికే ముగ్గురు కొత్తకోడళ్ళు రాధాదేవి, దులారి, ఖేతరి ఆహుతయి పోయారు. దారిద్ర్యం అభిమానాన్ని, ఆత్మగౌరవాన్ని చంపేసింది. ఆకలి వాళ్ళచేత వరసపెట్టి అన్ని పనులూ చేయిస్తుంది. వాళ్ళకున్న ఒక్క ఆసరా చారెడు భూమి. కులగౌరవం, ప్రతిష్ఠచూసుకుంటే భూమి పోతుంది. భూమి లేందే బతకడం కష్టం. వాళ్ళు చావలేరు. కాని ఒక్క జమున మాత్రం చచ్చినాసరే తాసిల్దారు మొహం మాడనంది. చనిపోయినభర్తమీద, కుర్రాడిమీద ఒట్టు కూడా పెట్టుకుంది.

కాని జమున మొండిపట్టు గ్రామానికే ముప్పుతెచ్చి పెట్టింది. అప్పటికే యిద్దరు ముగ్గురు గ్రామస్తులు ఆమెని [illegible] నించ బద్దాయ. వాళ్ళ గడ్డాలు వుంచ నడిబజార్లో యిష్టం వచ్చినట్టు కొట్టి తలెత్తుకోకుండా చేశారు. జమునవాళ్ళ యింటి కోడలయినా, బిడ్డయినా పంపించేవాళ్ళే. కాని జమునని ఒప్పించడం వాళ్ళ చేతుల్లో పనికాదు. కాళ్లూ చేతులూ పట్టుకున్నారు. బుజ్జగించారు. చివరికి బెదిరించినా లాభంలేక పోయింది. అటు తాసిల్దారుగారికి గడ్డిమోపులు, కోడిగుడ్లు, కోళ్లు సప్లయిచేయలేక వాళ్ళదుంప తెగుతోంది. అసలు జమున మొదట్నుంచి వాళ్ళమాటవిని కొట్టుమీద కూర్చోకుండా ఏమూలన్నా పడివుంటే యీ బాదరబందీ వచ్చిపడేదికాదు. ఆనాడు నీతిగా వుండమంటే అలా అంది; యీనాడు అవినీతికి పాల్పడమంటే యిలా అంటుంది.

జమున అవూసెత్తిన వాళ్లందర్నీ వరసపెట్టి కడిగేస్తుంది. "నాకు దిక్కూ మొక్కూ లేదనేగా మీరు నోటికొచ్చినట్టు కూసేది. ఆయనేవుంటే ఒక్కొక్క వెధనీ తన్ని తగిలేసేవారు."

ఖేతరి మండిపడింది. "ఆఁ... ఆఁ...అన్నీ అయ్యేవి. నీ మొగుడే వుంటే మా అందరికోర్కూ విప్పకముందే నిన్ను బరబరా యీడ్చుకుపొయ్యేవాడు." ఖేతరి అంతకన్నా ఎక్కువ మాట్లాడలేక పోయింది. బాధ, కోపం కళ్ళల్లో పొంగేయి. ఆమె ఏడవటంచూసి రాధాదేవి, దులారికూడా ఏడ్చారు.

మర్నాడు జమున వెళ్ళాలా వద్దా అని ఆలోచనలోపడింది. ముందు నుయ్యి వెనక గొయ్యి. ఒక ప్రక్క గ్రామంలో పెద్దలంతా అవమానించబడటం చూస్తూనేవుంది. శిస్తు పెరిగినా, ఎవరైనా జైలుకువెళ్ళినా దానికి తనే బాధ్యురాలవుతుంది. జీవితాంతం వరకూ అందరి తిట్లూ పడాలి. ఆత్మహత్య చేసుకుంటే ఊపిరి చెర వదిలిపోతుందేమో అనుకుంది. కాని కుర్రాడు గుర్తొచ్చాడు. లాభం లేదనుకుంది. కాని ఏంచెయ్యాలనే ప్రశ్న అలాగే వుండిపోయింది.

పోనీ గ్రామంకోసం తాను యీ మాత్రం త్యాగం చెయ్యకూడదా! గ్రామ పెద్ద ఇంతకుముందే మించిన త్యాగం చేశాన్నాడు. అసలిది పాపం కాదు, శాస్త్రరీత్యా యీ రకంగా యితరులకు మేలు చెయ్యటం పుణ్యం అనికూడా నచ్చచెప్పాడు.

(మిగతా 6 వ పేజీలో)

విశాలాంధ్ర

బూజుపట్టిన పాతయంత్రాలకేగాక పాతభావాలకు కూడ స్వస్తిజెప్పి పురోగమించుతున్న సోవియట్

సాంకేతికరంగంలో విప్లవంతో ముందంజ

లండన్ టైమ్స్ పత్రికా విలేఖరిగా ఇదివరలో ప్రసిద్ధి చెంది, దానితో తెగ తెంపులు చేసుకొని ఇపుడు మాస్కోలో స్థిరపడిపోయిన బ్రిటిషు పత్రికా విలేఖరి, రాల్ఫ్ పార్కర్ సోవియట్ కమ్యూనిస్టుపార్టీ ఇరవయ్యోమహాసభను గురించి వ్రాసిన విశేషాలను ఈ వ్యాసంలో యిస్తున్నాం.

సుమారు ముప్పై ఏళ్ళక్రితం గోర్కీ వ్రాసిన ఒక వ్యాసంలో తాను పెట్రోగ్రాడ్‌లో 1917 లో చూసిన ఒక దృశ్యాన్ని వర్ణించాడు. ఆ దృశ్యం ఇది:

మోడరన్ సర్కస్ బయట నిలబడ్డ ఒక సైనికుడు ఇలా అంటున్నాడు: "...ఇదిగో, నీకే, టోపీ పెట్టుకొన్న నీకే, తిన్నగా చెబుతున్నాను: మీ చేతుల్లోంచి దేశాన్ని లాక్కొంటున్నాం. ఈ విషయంలో మీకు ఎలాంటి సందేహం అక్కరలేదు. తర్వాత ప్రతిదీ క్రొత్తగా నిర్మించుతాం."

"అలాగా! గుండ్రటి ఇళ్ళు కట్టేది, పువ్వు కాయల్లాగా?" అపహాస్యం చేస్తూ, పొడుగుపాటి టోపీపెట్టుకొన్న ఒకతను ప్రశ్నించాడు.

"తప్పకుండా, మేం ఇళ్లుకడతాం" అన్నాడు సైనికుడు.

"పర్వతాలుకూడా తునాతునియలు చేస్తారు కాబోలు".

"తప్పకుండా. అవి మాకు అడ్డువస్తే, తుత్తునియలు చేస్తాం."

"నదుల్ని కొండలపైకిపారిస్తారా?"

"అదికూడా. మా ఇష్టం వచ్చిన మార్గాన పారించుతాం. ఏమి టా ఎకసెక్కాలు, నువ్వూను."

లావాటిగుండ్రటిముఖం, ఒత్తయిన మీసాలూ ఉన్న ఆ మనిషి ఎగతాళిగా నవ్వుతున్నాడు.

సైనికుడు అతని రెక్కబట్టుకొని విదిలించుకొని ముఖం దగ్గర ముఖం పెట్టి ఇలా అన్నాడు.

"మాకు వ్యవధి యివ్వండి. ప్రజలు చైతన్యవంతులై అద్భుతమైన పనులు చేస్తారు. వారుచేసిన పనులకు నీలాంటి వెధవలంతా కృతజ్ఞతా పూర్వకంగా నేలకువంగి సలాములు పెడతారు."

సోవియట్ కమ్యూనిస్టు పార్టీ ఇరవయ్యో మహాసభను గురించి అనేకమంది అనేక రకాలుగా వర్ణించారు. కొందరు దానిని మహాద్భుతంగాను, మరికొందరు మహా నీచంగాను వర్ణించారు. సుభిక్షా యుగోదయం అని పిలవడం ఎలా పొరపాటో, స్టాలిన్‌పై మసిపూయడానికే ఈ మహాసభ సమావేశమైందనడంకూడా అంతే పొరపాటు.

ప్రపంచ పరిస్థితులను గురించి, తమ దేశాన్ని గురించి తమ మనస్సులలో ఒక క్రొత్తచిత్రాన్ని సోవియట్ నాయకులు ఈ రెండు మూడేండ్లలో ఏర్పరచుకున్నారనీ, నిర్ధారణ చేసుకొన్న విషయాలను ప్రాతిపదికగా చేసుకొని, రాజకీయ పరిణామాలు ఎలాంటి మార్గాన్నవలంబించుతాయో, ఆ క్రమాన్ని గురించి వారు క్రొత్త అభిప్రాయాలు ఏర్పరచుకున్నారనీ నిస్సందేహంగా ఈ సభ తెలియజేస్తుంది.

గత ఇరవైయేండ్లలో చేసిన తప్పులనుకూడా వారు ఖచ్చితంగా ఖండించారు. ఆ విధంగా కమ్యూనిస్టుపార్టీ రాజకీయ అధికారాన్నేగాక, నైతిక అధికారాన్నికూడా తిరిగి దృఢంగా నెలకొల్పారు.

కాని సోవియట్ ప్రజలకు కన్పడిన మహాసభ ముఖ్యలక్షణం ఇంకొకటి వుంది. సోవియట్ ప్రజలు ఇప్పుడు పరిణితులయ్యారని, ఈడేరారని తమ నాయకులు గుర్తించినట్లు వారు భావించుతున్నారు.

మహాసభ పర్యవసానాలను గురించి ఆలోచించుతున్నపుడు పైన ఉదహరించిన గోర్కీ వర్ణించిన సైనికుని మాటలు జ్ఞాపకం వచ్చాయి. సోవియట్ ప్రజలు గత కాలంలో చాలా మారిపోయారు. ప్రపంచాన్ని సంభ్రమింపచేసే కాలం వచ్చింది. తన ప్రయత్నాలను ఆశ్చర్యంతోనో, భయంతోనో గాక, కృతజ్ఞతతో మిగిలిన మానవజాతి అంతా చూసే దినం దగ్గర పడుతోందని సోవియట్ మానవుడు నేడు భవిష్యత్తువంక చూస్తున్నాడు.

పాతపద్ధతులకు, ఛాందసాలకు స్వస్తి

అందుచేతనే మహాసభలో అనేకమంది చేసిన ప్రసంగాలలో అసహనం కన్పడటానికి కారణం. పాతకాలపు పద్ధతులకు స్వస్తిచెప్పాలి! రక్తం, చెమట, కన్నీళ్ళు ధారపోసి 25 ఏండ్ల క్రితం విదేశాలనుండి కొన్న యంత్రాలకు - తుప్పుపట్టిన యంత్రాలకు స్వస్తిచెప్పాలి.

ఇప్పుడు వాడుకలోలేని పురాతన ఉత్పత్తి విధానాలకూ, క్రొకోడిల్ (వ్యంగ్య పత్రిక) పేజీలలోనేగాక నిజంగా జీవితంలోకూడా ఉన్న బద్ధక బ్రహ్మలకు, అజ్ఞానులైన నిరంకుశాధికారులకు స్వస్తిచెప్పాలి.

ఇవీ నేటి యువసాంకేతిక నిపుణుల మనస్సులలో ఉడుకెత్తుతున్న అభిప్రాయాలు. స్థానికంగా చొరవ తీసుకోకుండా కాళ్ళూ చేతులూ కట్టివేసే, మతిమాలిన "ఆజ్ఞ"లంటేను, రహస్య, గుప్తపత్రాలపై లాగా రబ్బర్ స్టాంపులు ముద్రించడంలో అతి శ్రద్ధ కనపరచడంతప్ప మరేమీ ఎరుగని పౌరులంటేను, యువసాంకేతిక నిపుణులలో తీవ్ర క్రోధాగ్ని చెలరేగుతోంది.

రాల్ఫ్ పార్కర్

భయానికికూడా స్వస్తి చెప్పాలి. సోషలిస్టుశిబిర బలాన్ని తక్కువ అంచనావేసి ఇంకా కొందరు "పెట్టుబడిదారీదేశాల వలయం" ఉన్నదనే పాతకాలపు ధోరణిలోనే మాటాడుతున్నారు. కాని వాస్తవానికి సోషలిస్టు శిబిరమే, ఎటూచేరని దేశాల సపోర్టును రోజురోజుకు సంపాదించగలుగుతూంది. సోషలిస్టు శిబిరం తనను రక్షించుకొనే శక్తికల్గి యుండటమేగాక, ప్రపంచయుద్ధాలనుకూడా ఆపగల శక్తికల్గివుంది. ఈ నూతన శిబిరానికి ఉన్న కీలక, ఆర్థిక, జనసంఖ్యాబలాల్ని చూచినట్లయితే, సోవియట్ యూనియన్ ఒంటరిగా వుందనీ, శతృదేశాలతో పరివృతమైనదనీ ఉండేభావంఅంతాపుప్పూడిపోతుంది. పిడివాద ధోరణికి రూపొందిన పాతకాలపు సిద్ధాంతానికి స్వస్తి చెప్పాలి. వాస్తవ విషయాలు చూడండి! రుషీ నిర్మించిన సమాజ నూతన నిర్మాణాన్ని చూడండి. అన్నిటికన్నా ప్రజలను, నూతన ప్రజలను చూడండి. గోర్కీ వర్ణించిన సైనికుడు రైఫిల్ని భుజంనుండి దింపి, సుత్తీ కొడవలిని చేపట్టిన తర్వాత సోవియట్ జీవిత సారాన్నే మార్పులు చేసింది.

సాంకేతి వృత్తిలో పనిచేసే వారితోను, ప్రత్యేకమైన పనులను నిర్వహించేవారితోను కూడిన సంస్థలు, అపార అత్యంత క్లిష్టమైన సమిష్టి సంస్థలు, ముఖ్య నిర్ణయాలు తీసుకొంటున్నాయి. సాధారణ ఆదిమ సమాజంస్థానే క్లిష్టసమాజం ఒకటి నిర్మింపబడింది.

పార్టీ ఇరవయ్యో మహాసభ ఈ మార్పులను గుర్తిస్తోంది. ముఖ్యంగా సమిష్టి నాయకత్వ సూత్రాన్ని ఖచ్చితంగా అన్వయించాలని ఇచ్చిన ఆదేశంలో ఇది స్పష్టమౌతోంది. పార్టీ అగ్రసంస్థలకు మాత్రమే ఇది అన్వయించుతుందనిఅనుకోడం పొరపాటు.

పార్టీ కేంద్రకమిటీలోను, దాని అధ్యక్ష వర్గంలోను నిర్మొగమాటమైన తీవ్రచర్చలు కొనసాగించే పద్ధతిని పునరుద్ధరించాలని నిశ్చయించారు. ఈ నిశ్చయాన్ని స్థానిక శాఖలకు కూడా వర్తింప చేయాలని నాయకులు కోరుతున్నారనేదిస్పష్టం. స్థానిక సోవియట్లలో కూడా వర్తింప చేయాలని కోరుతున్నారు. స్థానిక సోవియట్లు 15 లక్షలమందికి ప్రాతినిధ్యం వహించుతాయి. ఉన్నతవిద్య కల్గినవారు సోవియట్లలో చాలమంది వున్నారుకూడా. ఈ సంస్థలే స్థానిక వ్యవహారాలను నడుపుతున్నాయి. ఇలాంటి స్థానిక సోవియట్లుకూడా సమిష్టి సూత్రాలను వర్తింపచేయాలని సోవియట్ నాయకులు కోరుతున్నారు.

యూనియన్ రిపబ్లిక్కులకు, అటానమస్ రిపబ్లిక్కులకు, (రాష్ట్రి), ఉపరాష్ట్రి రిపబ్లిక్‌లు) ఎక్కువ అధికారాన్ని అప్పగించాలని బుల్గానిన్ చేసిన సూచనలను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించిందంటే, అది ఈ మార్పులను గుర్తించిందన్నమాట. తమ తమ ఆర్థిక వ్యవహారాలను ఇక మీదట యూనియన్ రిపబ్లిక్‌లు, అటానమస్ రిపబ్లిక్‌లు నిర్వహించుటలో వీటికి ఎక్కువ స్వాతంత్ర్యం ఉంటుంది. ముమ్ముందు రాజకీయ హక్కులు కూడా విస్తృతంగా వీటికివ్వబడతాయనడంలో సందేహంలేదు. ఇప్పటికే 11,000 పారిశ్రామిక సంస్థలపై పెత్తం కేంద్రంనుండి స్థానిక సంస్థలకు అప్పజెప్పబడింది.

సాంకేతికంగా విప్లవం

రెండుమూడు విషయాలలో పార్టీ మహాసభ పూర్తిగా క్రొత్తపెఖరిని అవలంబించిందని ప్రజలు త్వరగా గ్రహించారు. ప్రజలు సోవియట్ ప్రభుత్వానికి చేసే సహాయం; ప్రభుత్వం ప్రజలకిచ్చే పారితోషికం - ఇవీ ఆ విషయాలు. అధికోత్పత్తికై పథకాలను సమర్పించుతూ, ప్రజలను ఎక్కువ పని చేయమనిగాని, ఇంకా కష్టపడి పనిచేయమనిగాని సోవియట్ నాయకులు కోరలేదు. మరింత చాతుర్యంతో మాత్రమే పనిచేయాలని కోరారు. ఆహారపదార్థాలు, వస్తూత్పత్తి ఎక్కువ అవుతున్న కాలంలోనే, పని గంటలను జీతం నష్టంలేకుండా తగ్గించడాకి వారు వాగ్దానం చేశారు. (పని గంటలు అపుడే తగ్గించారుకూడా).

ఆ విధంగా ఉత్పత్తి యొక్క సాంకేతిక విజ్ఞానంపై దృష్టి కేంద్రీకరింపబడింది. ప్రస్తుత పంచవర్ష ప్రణాళికా కాలంలో 40 లక్షలమంది యువకులకు ప్రత్యేక సాంకేతిక శిక్షణ ఇవ్వబడుతుంది. దీనికయ్యే ఖర్చులు ప్రభుత్వమే భరించుతుంది. ఇపుడున్న ఫ్యాక్టరీలలో క్రొత్త యంత్రాలు స్థాపించుటద్వారాను, ప్రస్తుత యంత్రాలను ఇంకా ఎక్కువ సామర్థ్యంతో ఉపయోగించు కొనుట ద్వారాను ఉత్పత్తిని హెచ్చు చేస్తారు. తాత ముత్తాతల నాటి యంత్రాలవల్ల కనిగే లోసుగులను జయించగలిగే గారడీ గుణం ఏదీ సోషలిస్టు ఉత్పత్తి విధానంలోలేదు.

బహుమతుల, ప్రోత్సాహాల విషయంలో కూడా క్రొత్తదృక్పథం అవలంబించబడింది. ప్రజలతో సన్నిహిత సంబంధం ఏర్పరచుకొనడంవల్ల, ప్రయాణాలద్వారా సామాన్య ప్రజలతో కలిసి మెలిసిపోవడంవల్లాబహుశా సోవియట్ నాయకులు ఈ క్రింది విషయాలలో అభివృద్ధి అవసరమని స్పష్టమైంది అనుకుంటున్నాను. అవి: ఇంకా అతిక్లిష్టంగానే ఉన్న ఇళ్ళపరిస్థితి; పెన్షన్ తీసుకొనేవాళ్ళ, పోషించే వాళ్ళు లేని ముసలవాళ్ళ దుస్థితి; బిడ్డల తల్లులై వుండి పనిచేసే స్త్రీల, తండ్రులులేని బిడ్డల సమస్యలు; తక్కువ జీతం సంపాదించే వారిసాధారణపరిస్థితులు. ఈరంగంలో తీసుకొంటున్న చర్యల వలన, పాలకుల, పాలితుల మధ్య సన్నిహిత సంబంధం ఏర్పడుతూందని ప్రజలు గ్రహించ గల్గుతున్నారు.

ఉక్కు తెర విధ్వంసం

ఆరవపంచవర్ష ప్రణాళికలో శాస్త్రవిజ్ఞాన పాత్రను గురించి మహాసభలో చాలా మంది మాట్లాడారు. ఇది యువకులను బాగా ఉత్తేజ పరిచింది. ఆధునిక శాస్త్రవిజ్ఞాన అవకాశాలను గురించి సోవియట్ యువకులు గాఢ అభిలాషను వ్యక్తపరుస్తున్నారు. ప్రకృతిని ఇంకా ప్రశంసనీయంగా జయించే అవకాశాలు దానివల్ల ఏర్పడుతున్నాయి.

విద్యార్థులను- ఆడ మగపిల్లలను- ఏ మొత్తానైనా తీసుకోండి. ఇందులో 100 కి 80 మొదలు 90 వరకు సాంకేతిక విద్యను అభ్యసించేవాళ్లే. అంగారానది జలాలను అదుపులోకి తెచ్చి దానినుండి వచ్చే విద్యుత్తు ద్వారా తూర్పు సైబీరియా లో పూర్తిగా క్రొత్త లోహ పారిశ్రామిక ఇంజనీరింగ్ కేంద్రం నిర్మించ బోతున్నారు. ఇది సోవియట్ యువకులను అత్యంత ఆధునిక టెక్నిక్‌ను వినియోగించే నూత్న ప్రపంచంలోకి తీసుకు వెళ్ళే అవకాశం కల్గించుతుంది.

మాస్కో - పెకింగ్ రహదారిపైన అణుశక్తితో నడిచే మోటారు కార్లు తిరుగుతాయన్నా, మంచుగడ్డను ఛేదించే అణుయంత్రం ఒకటి నిర్మాణంలో వుందనీ ఉత్తర ధృవాన్ని చేరుకోడానికి అది సహాయపడుతుందని అన్నా, శాస్త్రవిజ్ఞాన అకాడమీలో, మెకానిక్ బ్రెయిన్ ఇంగ్లీషును రష్యాలోకి అనువదించుతుందని అన్నా, సోవియట్ యువకులు సంభ్రమాశ్చర్యాలతో ఉత్తేజితులౌతున్నారు.

మిగతా ప్రపంచంతో సోవియట్ యూనియన్ సంబంధాలను విస్తృతి పరచుకోడాన్ని సోవియట్ యువకులు హర్షించుతున్నారు. ఈ విషయంలో చాలా అభివృద్ధి కనపడుతోంది. మహాసభ ఈ విషయమై ఇంకా కృషిచేస్తుందని వాగ్దానం చేయడం ప్రజల కెంతో ఆనందం కల్గించింది.

సెన్సార్ల అధికారాలు తగ్గించబడ్డాయి. లైబ్రరీలలోను, యూనివర్సిటీ పఠనాలయాలలోను, శాస్త్రవిజ్ఞానసంస్థలలోను, ఇతర త్రా, టైమ్సు, కాలియర్, న్యూస్‌వీక్ లాంటి పత్రికలు కూడా విదేశ సాంకేతిక సాహిత్య పత్రికలతోపాటు కనపడుతున్నాయి.

విలియం సారొయన్‌ను, లేక గ్రాహామ్‌గ్రీన్‌ను చదవేందుకు "ప్రత్యేక కారణాలను" ఇకముందు ప్రజలు చెప్పవలసిన పనిలేదు. ఇంగ్లండ్, ఫ్రాన్స్, స్వీడన్, ఇటలీ, ఈజిప్ట్ మొదలైనదేశాలు సోవియట్ ప్రజలను ఈ సంవత్సరం యాత్రికులుగా ఆహ్వానించాయి. డబ్బుచెల్లించుటకుగల శక్తి ఉంటేచాలు వారు ప్రయాణం చేయవచ్చు.

ఆరవ పంచవర్ష ప్రణాళిక పెద్ద ఆర్భాటం ఏమీ లేకుండా ప్రవేశపెట్టారు.

సోవియట్ ప్రజలకు పవిత్రమైన మాట ఒకటివుంది. దానిని వారెప్పుడూ హీనపరచడంగాని, దుర్వినియోగం గాని చేయలేదు. అది శాంతి. శాంతికి విరుద్ధమైన పదాన్ని—యుద్ధాన్ని—వారు ద్వేషించడానికి కారణం మనకు తెలిసిందే.

ఇపుడున్న పరిస్థితులలో ప్రాణాంతకమైన యుద్ధం తప్పనిసరి అనేభావం సరియైనదికాదని కృశ్చేవ్ అన్నాడు.

సామ్రాజ్యవాదం యావత్తు ప్రపంచాన్ని ఆక్రమించియున్న రోజులలో యుద్ధాన్ని వ్యతిరేకించే సామాజిక, రాజకీయ శక్తులు బలహీనంగా ఉండి నిర్మాణ రీత్యా దుర్బలంగా ఉన్న రోజుల్లో, 'సామ్రాజ్యవాదం వున్నన్నాళ్ళు యుద్ధం తప్పనిసరి' అనే మార్కిస్టు లెనినిస్టు సిద్ధాంతం ప్రతిపాదించబడిందని కృశ్చేవ్ అన్నాడు. నేడు శాంతికోసం పోరాడే శక్తులకు దురాక్రమణను అరికట్టేందుకు నైతిక సాధనాలేగాక, రాజకీయ సాధనాలు కూడా ఉన్నాయని కృశ్చేవ్ తెలియజేశాడు.

శాంతికి ఆయువుపట్టు

శాంతిని సంరక్షించే సాధనాల పటిష్ఠత వారి స్వంతప్రయత్నాల మీదనే ఎక్కువ ఆధారపడి వుందని సోవియట్ ప్రజలకు వేరే చెప్పనవసరంలేదు. గతంలో తమ ప్రభుత్వం కొన్ని తప్పులను చేసిందని వారికి తెలుసు. ప్రస్తుత నాయకులు ఇపుడు వాటిని అంగీకరించడం వల్ల, ముమ్ముందు తప్పులు చేయకుండా జాగ్రత్త పడగలరనే విశ్వాసం ప్రజలలో కల్గుతోంది.

శాంతిని సంరక్షించుటలో సోవియట్ యూనియన్ ఒక ముఖ్య విషయమే అయినా, ఆ విషయమొక్కటే శాంతి సంరక్షణకు సరిపోతుందని అంత తేలికగా శాంతి సమస్యను వారు చూడ్డంలేదు. అయితే తమదేశం నైతికంగాను, భౌతికంగాను శాంతి శిబిరానికే ఆయువుపట్టు అనివారికి తెలుసు. ప్రపంచశాంతి బలానికీ, స్థిరత్వానికీ - సోవియట్ బలానికి స్థిరత్వానికీ - మధ్య ప్రత్యక్ష సంబంధం ఉందని వారికి తెలుసు.

ఎంత మితభావంతో చెప్పవలసి వచ్చినా ఈనాడు సోవియట్ పౌరుడు తాను శాంతి ప్రియుడనని భావించుతున్నాడు; శాంతి అనే మాటకు గర్వపడుతున్నాడు.

మహా పంజాబు వాదుల ప్రదర్శన

అమృతసర్, మార్చి 30

మహా పంజాబువాదులు రెండువేల మంది ఈవేళ సాయంకాలం జిల్లా కాంగ్రెసుకమిటీ కార్యాలయంబయట ప్రదర్శన జరిపారు.

ప్రదేశ్ కాంగ్రెసు నాయకుడు శ్రీ జ్ఞానీ గురుముఖ్ సింగ్ ముసాఫిర్ కాంగ్రెసు కార్యకర్తల సమావేశంలో ఉపన్యసిస్తుండగా ఈ ప్రదర్శన జరిగింది.

రాష్ట్ర చేనేత సహకార సంఘాభివృద్ధికి సూచనలు

తలబరువు ఖర్చుల తగ్గింపు, కింది ఉద్యోగుల సహకారం ఆవశ్యకత

ఆంధ్రరాష్ట్ర చేనేత సహకార సంఘానికి తలబరువు ఖర్చులు తగ్గాలన్నా, రాష్ట్ర సంఘ వ్యాపారం అభివృద్ధి కావాలన్నా వ్యాపారం అనుభవంలేని ప్రభుత్వాధికార వర్గాలవంక చూడటంమాని, అనుభవం కలిగిన ప్రాథమిక సంఘాల ప్రతినిధుల సలహాపై క్రింది ఉద్యోగులను సంఘటిత పరచాలని, వారి నిత్యఅనుభవాలనుండి పాఠాలు నేర్చుకొని రాష్ట్ర సంఘాన్ని అభివృద్ధి పరచాలని ఈ వ్యాసరచయిత సూచిస్తున్నారు.

ఆంధ్ర చేనేత సహకారసంఘం, మద్రాసు చేనేత సహకార సంఘం నుండి 14-9-53వ తేదీన విడివడి ఆ మరుసటి రోజునుండి విజయవాడలో పనిచేస్తున్నది. మద్రాసు సంఘం నుండి విడివడేనాటికే బహుశా ఎన్నికలు జరుగవలసి వుంది. అయినా ప్రజాస్వామిక పెద్దలంతా కూర్చొని అప్పటికున్న పాలకవర్గాన్నే మరొక 3 సంవత్సరాలు అనగా 31-12-56 వరకు అధికారంలో ఉండాలని లిఖించారు. పాలకవర్గము, గత 2 సంవత్సరాలలోనుసర్వసభ్యసమావేశం జరపనేలేదు. ఈ సంవత్సరం ఫిబ్రవరి 12 వ తేదీన సర్వసభ్య సమావేశం జరిపారు. సమావేశానికి పాలకవర్గంవారు తమ పరిపాలనా నివేదికను, ఆడిట్ సర్టిఫికేట్‌ను సమర్పించారు.

నివేదికలో సామాన్య విషయములనే శీర్షికతో ఇలా ప్రారంభమయింది: "ఇండియా ప్రభుత్వంవారు మంజూరుచేసిన సెస్ ప్రణాళికల ఫలితంగా ఈ నివేదికకాలంలో నూలు, బట్టల క్రయం శీఘ్రంగా అభివృద్ధి చెందినది. ఈ క్రింది లిస్ట్సులు ఈ విషయములను రుజువు చేయుచున్నవి."

పై మాటలు సంఘంయొక్క అభివృద్ధిని తెలియజేస్తున్నాయి. ఇదే సంఘంపై డైరెక్టర్లలో ఒకరైన శ్రీవి. వి. రామన్‌గారు 1955 జులై 'హాండ్ లూమ్'లో, ఇలా వ్రాశారు! "నేను ఎరుగున్న తిరుత్తని చేనేత బట్టల వ్యాపారి ఒకరు, ఆ ప్రాంతంలో తయారుకాబడే చేనేతబట్టలు సాలీనా 60 నుండి 75 లక్షలవరకు అమ్ముతున్నారు. 100 కు పైగా అమ్మకపు డిపోలు కలిగియున్న ఆంధ్ర చేనేత సహకారసంఘం 50 లక్షలు రూపాయలు అమ్మలేక పోతున్నది. ఇక వ్యాపార ఖర్చుల విషయంలో ఆ వ్యాపారితో పోల్చి చూస్తే, మన ఖర్చులు పూ పేస్తున్నవి." బాధ్యులైన వారు చెప్పిన విషయాలను మనము అర్థం చేసుకోటానికి తప్పక ప్రయత్నించాలి. పాలకవర్గంవారు తమ నివేదికలో సంఘంలో తాము చేసిన వ్యాపారాన్ని ఈ దిగువ విధంగా చూపించారు.

14-9-1953 నుండి 30-6-1954 వరకు

	నూలు	బట్టలు
ప్రారంభపు నిల్వ:	రు 12,02,745	రు 14,26,896
క్రయం:	రు 37,78,740	రు 27,92,249
విక్రయం:	రు 39,24,871	రు 32,32,838
అంత్య నిల్వ:	రు 11,79,538	రు 13,11,329

అంత్యనిల్వ, విక్రయం కలిపి, విక్రయంగాను, క్రయాన్ని ప్రారంభ నిల్వను కలిపి, క్రయంగాను చూడవలసి యుంటుంది. అలా చూచినచో ఈ దిగువ విధంగా వుంటుంది:

నూలు విక్రయము,
అంత్యనిల్వ మొత్తము రు. 51,04,409
నూలు క్రయము,
ప్రారంభ నిల్వ ,, రు. 49,81,485
మిగులు రు. 1,22,924

బట్టలు అంత్యనిల్వ,
విక్రయం మొత్తం రు. 45,44,167
బట్టలు క్రయము,
ప్రారంభనిల్వ మొత్తం రు. 42,19,145
మిగులు రు. 3,25,022

ఈవిధంగా మిగులు కన్పిస్తున్న నూలు, బట్టల మొత్తం, రు 4,47,946. పాలకవర్గం వారు తమ నివేదికలో నికరనష్టంగా చూపిన మొత్తం 4,77,199. ఈ రెండు మొత్తములు కలిసి మిగులు రు 9,25,145. షుమారు 9 లక్షల 25 వేలకు మనకు వివరాలు కావలసివున్నాయి. ఇందుకు ఆడిట్ సర్టిఫికెట్‌లోగాని, పాలకవర్గపు వారి నివేదికలోగాని తగిన వివరాలు లేవు. పాలకవర్గంవారు లాభనష్టములన్న శీర్షికలో ఇలా వ్రాశారు:

"మద్రాసు ఉమ్మడిసొసైటీ విభజనలో ఈ సంఘము వాటాకు రు. 1,16,314-9-0 నష్టం వచ్చింది. 15-9-53 నుండి 30-6-54 వరకు రాష్ట్రసంఘానికి రు 4,77,199-12-0 నష్టంవచ్చింది. మార్కెటు మాంద్యం చేతను, రాష్ట్రసంఘం విభజనలో తన వాటాకు వచ్చిన నూలుబట్టలు విపరీత నష్టానికి అమ్మవలసివచ్చుట చేతను, ఇంత పెద్దమొత్తం నష్టంపడక తప్పిందికాదు. కాని విభజనకాలంలో ఈ సంఘంవాటాకు వచ్చిన రిజర్వు నుండి ఈ నష్టం సర్దుబాటు చేయబడింది."

పై అంకెల వివరాలనుబట్టి పాలకవర్గంవారు తమకు నివేదికలో వ్రాసినట్లు, నూలుబట్టల అమ్మకంలో నష్టం వచ్చిందనేది వాస్తవంకాదని స్పష్టమవుతుంది. పాలకవర్గంవారి నివేదిక ప్రకారం నాటికి రు 6-0-0 లు షుమారు లాభంతో వ్యాపారం చేయబడింది. సామాన్యులు వూహించ గలిగినంతవరకు పై 9 లక్షల 25 వేల

శ్రీ మెట్ల వీరయ్య
అధ్యక్షుడు
ఆంధ్రరాష్ట్ర చేనేత సంఘం

రూపాయలు వ్యాపారపు ఖర్చుల క్రిందనే క్రుంగిపోయిందని నిర్ణయించవలసి వుంటుంది. అనగా రాష్ట్ర సంఘం 9 నెలలలో వాస్తవంగా విడుదలచేసిన నూలు, బట్టలఖరీదు షుమారు రు 71 లక్షల 57 వేలకు 9 లక్షల 25 వేలు ఖర్చయింది. ఇది గాక సెస్‌నిధినుండి రిబేటురూపంలో మరొక 92 వేల రూపాయ లివ్వబడినవి. సెస్‌స్కీముక్రింద డిపోల నిర్వహణకు, పర్యవేక్షణకు, మొబైల్ వ్యానులకు, ప్రచారం మొదలగువాటి కొరకు మరొక లక్షా 15 వేలు రూపాయలు ఇవ్వబడినవి. ఈ మొత్తాలలో మొబైల్ వ్యానుకొరకు 78 వేలు పోను మిగతా మొత్తం అంతా కూడా 9 నెలల వ్యాపారానికి ఖర్చు చేయబడిందనే చెప్పాలి. రాష్ట్ర సంఘం 9 నెలలలో 71 లక్షల 57 వేల రూపాయల నూలు, బట్టలు అమ్మడానికి దాదాపు 11 లక్షల రూపాయలు ఖర్చుచేసింది. అనగా ప్రతి రు 100 ల అమ్మకమునకు 15 రూపాయలు ఖర్చయింది.

ఇంత ఖర్చు అవుతున్నా డిపో మానేజర్లు, సెంట్రల్ గోడౌను మొదలగు చోట్లకు వెళ్ళినపుడు ఇచ్చే దిన భత్యం 0-12-0 మాత్రమే అని తెలుస్తుంది. ప్రాథమిక సంఘాలు తయారుచేసిన 1 కోటీ 11 లక్షల రూపాయల విలువగల రాష్ట్రసంఘం 26 లక్షల 57 వేల రూపాయల విలువగల బట్ట మాత్రమే కొన్నది. పాలకవర్గం ఈ విషయాలన్నింటికి వివరాలతో బాధ్యత గల ప్రాథమిక సొసైటీల ప్రతినిధుల ముందు పెట్టి ప్రజాస్వామిక పద్ధతిలో చర్చించి తలబరువు ఖర్చులు తగ్గడానికి, వ్యాపారాభివృద్ధికి, రాష్ట్రసంఘం లాభప్రదంగా నడవటానికి తగునైన సూచనలు పొందవలసింది. పాలకవర్గంవారు అలాంటి ప్రయత్నం చేసినట్లు కనుపించదు. సరిగదా పాలకవర్గంవారి నివేదికయొక్క రచనా పద్ధతిచూస్తే, దీన్నంతా కప్పిపెట్టటానికే ప్రయత్నించినట్లు కనిపిస్తుంది.

ఉదాహరణకు ఉత్పత్తి కేంద్రాలు అనే శీర్షికక్రింద ఇలా వ్రాయబడివుంది: "నివేదికకాలంలో కాళీహస్తి చేనేత కేంద్రములో 110 మగ్గములు పనిచేసినవి. ఇవి ఉత్పత్తి చేసిన వస్త్రముల విలువ మొత్తము 45,380 రూపాయలు. చేనేత ఫ్యాక్టరీలలో 74 మగ్గములు పనిచేసి, రు. 1,07,073 ల విలువగల 91,777 గజాల వస్త్రములు తయారు చేసినవి. ఈ ఫ్యాక్టరీలలో తయారైన సన్నరకము చీరలు, కోటింగులు, షర్టింగులు గృహాలంకరణ వస్త్రములు, దుప్పట్లు, తువ్వాళ్లు మొదలగునవి విశేషంగా ప్రజల మన్ననలను పొందినవి."

ఈ విషయం చూచినవారు చాల గర్వపడతారు. కాని ఇదే కాళీహస్తి చేనేత కేంద్రాన్ని గురించి ఆడిట్ సర్టిఫికేటులో ఇలావుంది: "కాళహస్తి సమిష్టి చేనేత కేంద్రం రు. 884-1-0 నష్టం పొందినట్లు విన్నవారు తప్పక విచారపడతారు. 100 మగ్గాలుగల మాస్టరు వీవరు సాలీనా వ్యాపార ఖర్చులుపోను 5 వేలనుండి 7 వేల రూపాయలవరకు సంపాదిస్తున్నట్లు పెద్దలైన వారంతా అంగీకరిస్తారు." మరొక ఉదాహరణ చూదాము. పాలకవర్గంవారి నివేదికలో రంగుల కార్ఖానాలు అనే శీర్షికలో ఇలా వ్రాశారు: "నెల్లూరు, చీరాల, రాజమండ్రీలలో రాష్ట్రి సంఘం 3 అద్దకపు కార్ఖానాలను నడుపుతున్నది. 30-6-54 తారీఖు అంతమైన నివేదిక కాలంనాటికి వీనిలో 188 బేళ్ళనూలు చాయవేయబడింది. ఈవిధంగా అద్దిన నూలులో చాలా భాగం చేనేతఫ్యాక్టరీలే వినియోగించినవి. మిగతానూలు అద్దకం ఏర్పాట్లు లేని చేనేత ప్రాథమిక సంఘాలకు సరఫరా చేయబడింది. చాల ప్రాథమిక సంఘాలునూలును తమస్వంత రంగుల ఖార్ఖానాలలోగాని, ఇతరుల వద్దగాని అద్దించు కొంటున్నది. నివేదిక కాలంలో రంగుల కార్ఖానాలకు సరఫరా చేయుటకొరకు రాష్ట్రసంఘం 30,932 రూపాయలవిలువగలరంగులు, రసాయనములు కొన్నది."

ఈ విషయం చూచినపుడు రంగుల కార్ఖానాలు లాభప్రదంగా పనిచేసినట్లు అర్థంచేసుకుంటాము. ఈ రంగుల కార్ఖానాల గురించి ఆడిట్ సర్టిఫికెట్‌లో యిలావుంది: నెల్లూరురంగుల కార్ఖానా 2756 రూపాయలు లాభం పొందగా చీరాల, రాజమండ్రి ఫ్యాక్టరీలు 1155 రూపాయిలు నష్టం పొందినవి.

మన రాష్ట్రంలో అద్దకం కార్ఖానాల్లేని మాస్టరు వీవర్లు అరుదు. ఎవరైనా వున్నా మార్కెట్‌లో నిలబడటం కష్టం. మాస్టరు వీవర్లుకువచ్చే ప్రధాన ఆదాయాల్లో రంగుల కార్ఖానాఒకటి. ఇక రాష్ట్రిసంఘంయొక్క రంగుల కార్ఖానాలలో హెచ్చు నష్టపోయాయి. నూలు ఉపయోగించిన చేనేత ఫ్యాక్టరీలు నష్టపోయాయి. ఆశ్చర్యమేమంటే, నెల్లూరు కార్ఖానా లాభం పొందగా అదేపని చేసిన చీరాల, రాజమండ్రి ఫ్యాక్టరీలు నష్టపోయినవి. ఇలాంటి ఉదాహరణలు ఇంకా చూడవచ్చు.

రాష్ట్రిసంఘ పాలకవర్గపు నివేదికగాని, ఆడిట్‌సర్టిఫికెట్ వల్లగాని, తగినన్ని వివరాలు తెలియకపోయినా తలబరువు ఖర్చుతో రాష్ట్రిసంఘము క్రుంగిపోతున్నట్లు స్పష్టమవుతుంది. ఇంకూడా క్రిందవుద్యోగులకొరకు ఖర్చుచేయబడుటలేదని, కేవలం పై వుద్యోగుల కొరకు మాత్రమే ఖర్చు చేయబడుతుందని అర్థమవుతుంది. ఈనాడు రాష్ట్రిసంఘం ఎదుర్కొంటున్న తలబరువు ఖర్చులు తగ్గాలన్నా, రాష్ట్రిసంఘ వ్యాపారం అభివృద్ధి కావాలన్నా, రాష్ట్రిసంఘ పాలకవర్గం, వ్యాపారఅనుభవంలేని ప్రభుత్వాధికారవర్గాలవంక చూచుటమాని, అనుభవం గలిగిన ప్రాథమికసంఘాల ప్రతినిధుల సలహాలను క్రిందివుద్యోగులను సంఘటితపరచి, వారి నిత్యఅనుభవాలనుంచి పాఠాలు నేర్చుకొని రాష్ట్రిసంఘఅభివృద్ధికి కృషిచేస్తారని ఆశిస్తున్నాను.

సాగిపో

— కాముది

సాగిపో,
సాగిపో!
యుగ యుగాల
సమాధిలో
కన్ను మూసి
కుళ్ళి, కుమిలి
ఎన్నేళ్ళని?
ఎన్నాళ్ళని?
సంకుచితపు
టగాధ ప్రగా
ఢాంధకార
కూపంలో
భేకం వలె
ఘూకం వలె
ఎన్నేళ్ళని?
ఎన్నాళ్ళని?
దరిద్రాల
బరువులతో
కరువులతో
కష్టాలకు
నష్టాలకు
గుండె లెండి
కుమిలి కుమిలి
యిన్నేళ్ళుగ
యిన్నాళ్ళుగ
కార్చిన క
న్నీళ్ళు చాలు!
సాగిపో,
సాగిపో,
రోత బుట్టె
పాత బ్రతుకు
రుచింపదిక
సమాధి బ్రతుకు
నీ చుట్టూ
నవ లోకం
నగారాలు
కొడుతున్నది
నీలో నిద్రిత
శక్తుల కిక
అరుణోదయ
మగుచున్నది
నిన్ను, నీవు తెలుసుకో
నవలోకం చేరుకో
సాగిపో,
సాగిపో—
నింగినంటే, వి
హంగమయి
పొంగి పొరలు, త
రంగమయి
విహంగమయి
తరంగమయి
విహంగమయి
సాగిపో,
సాగిపో—

'దక్షిణాత్యులపై హిందీని రుద్దరాదు'

బెంగుళూరు, మార్చి 30

మైసూరు, తదితర దక్షిణ భారతీయ రాష్ట్రాలపై హిందీని బలవంతముగా రుద్దరాదని మైసూరు ముఖ్యమంత్రి శ్రీ హనుమంతయ్య ఈవేళ శాసనసభలో విజ్ఞప్తి చేశారు.

ఆ హిందీ రాష్ట్రాలపై హిందీని బలవంతంగా రుద్దినట్లయితే, భారతీయ ఐక్యతకు భంగం కలుగుతుందని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం ఒక నిర్ణయానికి వచ్చేటప్పుడు, దేశ ఐక్యతను కాపాడటానికి అవసరమైన చర్యలు తీసుకుంటుందనే ఆశాభావం వెలిబుచ్చారు.

భరణివారి 'చింతామణి'లో భానుమతి, యన్. టి. రామారావు

అంజి అల్లరి

శ్రీ మద్దులూరి రామకృష్ణ

అంజి చేసే అల్లరికి అంతేలేదు. చేసేనైనా రెండు కాళ్ళు ఒకచోట ఉంచిన పాపానపోడు. అల్లరికి వాడిది పెట్టింది పేరు. వాడకొంటె తనానికి కొసరేవుండదు. రోజూ వాళ్ళపైన ఇరుగు పొరుగు ఇళ్ళవాళ్ళు చెప్పే చాడీలు కుప్పలు తెప్పలు. ఎంత గోలచేసేవాడో అంత చురుకైన అబ్బాయి. కోపంతో కొట్టవచ్చిన వాళ్ళను బులబూచికంమాటలు చెప్పి నవ్వుకచ్చేటట్లు చేసేవాడు. పిల్ల గుంపుకు ఉసిగొలిపి దేవుడగుడిపై వానరమూకతో దండెత్తేవాడు. పండ్లచెట్లు బిరబిరా ఎక్కి పండ్లు అన్నీ దులిపేవాడు. ఎవరన్నా అడిగితే దేముని నిర్మాల్యం మేమంటే ఆ ఆంజనేయస్వామికి ఎంతో ఇష్టం. ఆ స్వామి ప్రసాదం ఎంత ఆరగిస్తే అంత భక్తి అని పెద్దలందరూ చెప్పుతూ ఉంటారు. ఎందుకైనా మంచిదని వీలున్నప్పుడల్లా సందు దొరికే గుళ్లో ఆచార్యులకు పంగనామాలు పెట్టేవాడు. మిత్రబృందానికి తుఫీదుయిన్నా ఇలాంటి పనులు జోరుగా సాగించి మొనగాళ్ళు అనిపించుకోవాలని హుషారు కబుర్లు చెప్పేవాడు. ఎవరైనా జట్టులో మందమతిగా ఉంటే ఉత్సాహం రగిలించి జిడ్డువదలగొట్టేవాడు. వీడంత గొప్పవాడని ఊహించే కాబోలు పుట్టిన పదకొండోరోజునే 'అంజి' అని ముద్దుగా పేరు పెట్టారు. పైగా ఆంజనేయస్వామి, వారి యింటి ఇలవేలుపు.

ఆ చిన్నోడు చేసే కొంటెపనులు ఊరివాళ్ళంతా కథలల్లి చెప్పుకొని విరగబడి నవ్వుకునేవారు. ఒకనాడు రచ్చబండవద్ద ముచ్చటలో చెప్పుకొన్న వాడి కథలలో ఇదొకటి.

అంజిని అడుపుఆజ్ఞలలో ఉంచాలని అరచి అరచి వాళ్ళ అమ్మగారు కాయకాచింది. వాడిసంగతి ఆమెకు గొప్ప తీరని సమస్య అయికూర్చుంది. ఏ క్షణాన ఎవరు కొంపమీదకు తగాదాకు వస్తారో అని ఆమె గుండె దడదడ లాడేదట. చిన్నతనాన వాడు అంటే ఎంత గారాబమో ఇప్పుడు అంత దిగులు.

ఒకనాడు గామా అంత గొప్ప వస్తాదు కావాలనుకున్నాడు అంజి. ఇక బుర్ర అరికట్లు ఆలోచించాడు. కడకు ఒక ఆలోచన తట్టింది. "జై వీర హనుమాన్" అంటూ లంగోటా బిగించి కట్టాడు, గదిలో నిలువెత్తు అద్దం ముందు కసరత్తు చేయ మొదలు పెట్టాడు. రొప్పు వచ్చిందాకా దండేలు' బస్కీలు ఊఁ ఊఁ ఊఁ అంటూ తీశాడు. అలుపు వచ్చింది. ఇంతటితో నేనిలిపితే కండలు ఎట్లా తిరుగుతయి అని లోడ తిప్ప నారంభించాడు. ఓపిక తగ్గింది కాని దీక్ష వదలదలచలేదు. ముందట మెల్లగా త్రిప్పి క్రమంగా జోరుచేశాడు. దాని బరువుకు తట్టుకోలేకపోయాడు. లోడీ కాస్తజారి అద్దంమీద పడింది. అద్దం ముక్కచెక్కలయింది. అంజిఅమ్మకు ఏనాడూ రానంతకోపం వచ్చింది. గుడ్లు ఉరిమిచూచింది. అంజినెత్తిన పిడుగులు పడ్డంత పనయింది. కోపం ఎంత దిగమ్రింగినా ఆగటంలేదు. మూల కూర్చొని ఏడ్చింది. ఏమిచేస్తే ముక్కలైన అద్దం అతుకుతుందా కాని ఆమె మనస్సు కుదుటపడితేగా. వాడి వీపు విమానంమోత వాళ్ళ నాన్నచే మోగించాలని పట్టుపట్టింది. ఆయన ఇంటికిరాగానే వాడు చేసినపనికి బుద్ధి రావాలంటే మంచి చింతబరికె తీసికొని వాడిని బాదించితే తప్ప లాభంలేదని ఆ క్షణాన ఆమెకు అనిపించింది.

పిట్టలు గూళ్ళు చేరుతున్నాయి. అంజి నాన్నా యింటికి వచ్చాడు. రోజూ నవ్వుతూ కులాసా కబుర్లు చెప్పుతూ ఎదురుగా ఆమె వచ్చేది. ఈనాడు అట్లా కాదు. కాస్తకోపంతో కందగడ్డలాగా మొఖం వేసుకొని ఎదురైంది. రుసరుస లాడుతూ పిల్లాడి మీద ఫిర్యాదు చేస్తే సాంతం విన్నాడు. ఆయన కుదురుగా యుండలేదు. "ఏదో తెలియక చేశాడు. చెయ్యి జారిపుంటుందిపాపం, అద్దంపగలగొట్టాలని ఎవరికన్నా వుంటుందా" అన్నాడు.

అంజి అంటే అమ్మకు, నాన్నకు బలే గారాబం. ఇంతవరకు ఆయన అంజిని ఒక్క మాట అన్న పాపాన అయినా పోలేదు. ఆమెకు అంజి అంటే ఎంతో ముద్దు. వాడి కొంటె పనులు వినివిని విసిగిపోయింది ఆమెకు. అసలు కోపంరాదు. వచ్చిందంటే ఎవరు చెప్పినా వినదు. అనుకున్న పని అయిందాకా కన్నుమూయదు. పట్టిన కుందేలుకు మూడే కాళ్ళనే రకం. ఆ సంజవేళ నుక్కిమంచంలో కూర్చొని ఇదంతా దిగులుగా విన్నాడు ఆయన. తలరెండు చేతులా మధ్య ఇరికించుకొని ఒకటే యిదిగా ఆలోచించాడు. ఒక ప్రక్క పని అలసట, మరొక ప్రక్క బిడ్డ చిలిపిచేష్టలకు శిక్షవిధించుతారా లేదని ఆమె మొండిపట్టు. సతమతమయ్యాడు. కొట్టితే చిన్నాడు బండబారి ఇంకెందుకు అక్కరకు రాడు. కొట్టకపోతే పిల్లాడికి అలుసిచ్చి భయం భక్తిలేక పాడయిపోతుంటే చూస్తూ ఊరుకున్నారని ఊళ్లోవాళ్ళగోల. "ఆ సంగతి అన్నం తిన్నాక ఆలోచిద్దాం" అని వాయిదా వేశాడు. "అన్నం అయిందా" అన్నాడు. ఇంకా పొయ్యిలో నిప్పే వేయలేదు. ఊరపొద్దన్నా పోలేదు. అంజికి చింతబరికెపూజ కానియ్యండి తరువాతనే తిండీ తిప్పలు అంది ఆమె. ఇక చేసేదిఏమీలేక "అయితే ఏమేం, ఇక ఆ బాబు పనిపట్టిద్దామా" అన్నాడు. ఆ మాట విన్న ఆమెకు ప్రాణం లేచివచ్చింది. ఇంతవరకు దెబ్బల రుచి ఎరుగని అంజి అదెట్లావుంటుందో చూద్దామని ఎదురు చూస్తున్నాడు. చింతబరికె పూజ అనుకుంటుంటే అంజి పెదవులమీద చిరునవ్వు నాట్యమాడింది.

అమ్మా, నాన్నా, అంజి పెరటిలో వున్న చింతచెట్టుకద్దకు బయలుదేరారు. కొమ్మా, కొమ్మా వెతికారు మంచి బరికెకోసం. ఒక మాత్రానికి అవి విరిగితేగా, నారసాగినయి. ఎంతసేపటికీ ఒక్కటీ ఊడిరాదు. "ఏమే! ఇంట్లోకివెళ్ళి కొడవలి తీసికొనిరా" అన్నాడు. ఆమె ఎంతో సంబరాలు పడుతూ దొర్లుకుంటూ పోయి గడేసిమీదవున్న కొడవలి తీసికొని గబగబా వచ్చింది. మంచి పొడుగైన, తిన్నని, బొటనవ్రేలంత లావుపాటిది బరికెఅయితే దెబ్బ బాగా తగులుతుంది బలేబాగాతేలు వలుస్తుంది. సరి, బెత్తం కోద్దాము, లేకుంటే మన శ్రమఅంతా వృధా అవుతుందన్నారు నాన్న. అంజి అమ్మతో కురుచబెత్తంఅయితే మంచి ఊపువ్వదు, మరీ పొడుగుబాటిదైతే ఊపుజాస్తయి విరిగి ముక్కలయిపోతుంది, సన్నదయితే సరిగా దెబ్బ తగులదు, మరీ లావయితే అనుకున్నంత ఫలితమివ్వదు అని ఏదేదో అంటున్నాడు ఆయన.

ఇక ముగ్గురూ ఎంతో వెతికారు. అనువైన బెత్తం దొరికితేగా. ఇదంతా వింతగావుంది అంజికి. అసలుసంగతి మరచిపోయి వాడే ఈ బెత్తం సన్నం, ఇదిలావు, అది పొడుగు, అని ప్రతి బెత్తానికి ఏదో ఒక వంక పెట్టసాగాడు. సరైన బెత్తంసంగతి తేల్చలేక అంజి నాన్న వాటిను బరికెలు కోశాడు. కోసికోసి ఆయన చేతులుపడిపోయినయి. ఇక కొయ్యలేక కొడవలి మెల్లగా ఆడిస్తుంటే చూస్తూ అంజి ఊరుకోలేక, "నాన్నా!" ఇక నేను కోస్తా, ఏ కొమ్మ సరి-మంటావు" అన్నాడు అంజి. దానితో చింతబరికెలు కోసే విధంమూడా అంజికి కాస్త చేతనయిందట.

ఇక ఈ బెత్తాల సత్తా చూద్దామని అంజి అమ్మ, నాన్నా పడకగదిలోకి పట్టెడు బెత్తాలతో అడుగుపెట్టారు. అంజి నాన్న ధోవతి గోచిబిగించి పైకి కట్టాడు. పై ఉత్తరీయం తీసి అవతల దూరంగా దణ్ణెంపై విసరి వేశాడు. రకానికి ఒకటివంతున ఐదు మంచి బరికెలు ఎన్నుకున్నారు. "ఇక నువ్వు వెళ్ళి వంటచెయ్యి, అలసిపోయాం ఆకలి అవుతుంది" అన్నాడు అంజి నాన్న.

నిజంగా పిల్లాడిని బయలుదేరిన చింతబరికెలతో బాది బుద్ధి చెప్పుతున్నానని ఆమెకు నమ్మించాలని ఆయన ప్రయత్నం. ముచ్చుకు దెబ్బ ఎట్లా తగులుతుందో చూద్దామని అంజి నాన్న పూనుకున్నాడు. పెద్ద మంచంపైపు చూశాడు. దానిపై కొబ్బరిపరుపు పరిచాడు. చింత బరికెను తన శక్తికొద్దీ పరుపుపై బాదాడు. ఒక్కొక్క బెత్తం తీసికొని పరుపుమీద కొట్టుతూ ఉన్నాడు. లావాటిబెత్తం బయ్యిబయ్యిమని రొదచేస్తూ పరుపుతాకింది. వెంటనే తునాతునకలైంది. కనుక అలాంటి బెత్తాలు దెబ్బకొట్టటానికి పనికిరావని తేల్చేశాడు. ఇట్లా రకానికి ఒక బెత్తంతో బాది చూశాడు. అవి రకరకాలయిన ఫలితాలనిచ్చినయి. దూరంగా వంటయింట్లో అన్నం వండుతున్న ఆమె నిజంగా పిల్లాడి తాట వలిచేస్తున్నాడని లోలోన దిగులుతో కుమిలిపోతున్నది. అయినా ఆడతప్పరాదని, అన్నమాట తీసికోలేక ఇంత జరుగుతున్నా అవతలకు అడుగు పెట్టలేదా తల్లి.

పరుపుపై బాది బాది చేతులు నొప్పులు పుట్టాయి అన్నమాటేకాని ఒక బెత్తం ఆయనకు నచ్చలేదట. ఆఖరుకు ఒకటి తేల్చుకున్నాడు. జాస్తిపొడుగు, బాగాలావు, తేలికగా వుండే బెత్తం అయితే మంచి ఊపుయిచ్చి బాగా దెబ్బ తగులుతుందని తెలుసుకున్నాడు. అలాంటిది అందులో ఒక్కటీలేదట.

తండ్రీ, కొడుకులు మంచి బెత్తం కోసం తలమునక ఆలోచిస్తున్నారు. ఇదంతా తన పెండ్లికి ఏర్పాట్లు అన్న సంగతే మరచిపోయాడు అంజి. దెబ్బలు తినేది, తినే అనే గమనమే అతనికిలేదు. "మూల ఉన్న పొన్నుకర్ర అయితే బాగా దెబ్బ తగులుతుంది నాన్నా" అని ఉపాయం చెప్పాడు. నాన్న "అబ్బో! అంతగట్టికర్రా! మనిషి వీపు విరగగొట్టుతుంది" అన్నాడు ఆయన. "అయితే కండికట్టేనా" అన్నాడు అంజి. అదేం లాభం లేదన్నాడు ఆయన.

ఇద్దరూ కలసి ఆలోచించారు, ఆలోచించారు "బల్లమీదపేముబెత్తం అయితే మన పని పూర్తవుతుంది నాన్నా" అన్నాడు ఏదో గొప్ప సంగతి కనుగొన్నాననే ఆనందంతో. "అయితే చొక్కావిప్పి ఆపేముబెత్తం తీసికొనిరా, అంజీ" అని నాన్న హాలులోకి పంపాడు. అంజి హుషారుగా హాలులోకి అడుగు పెట్టడం తల్లి చూచింది. "ఏమిరా! నాయనా!! ఏమిటా తొందర, ఎక్కడకు బిరబిరా పరుగెత్తుతున్నావు" అంది. చింతబరికలతో అయింది ఇక పేము బెత్తంతో మ్రోగించాలంటున్నారు నాన్న. అందుకని చొక్కా విప్పేసి పేము బెత్తం తీసికొనివెళ్ళి త్వరగా దెబ్బలు తిందామని పరుగెత్తుతున్నా అన్నాడు అంజి. "ఇక చాలులే తండ్రీ!" ఆ దెబ్బల మోతకు నా గుండెలు ఉగ్గబట్టాయి" అన్నది అంజి తల్లి. "ఉఁ, కాదు అమ్మా అదెట్లావుంటుందో చూడాలి? వేగం తీసికొని రమ్మన్నారు. నాన్న మాటకు ఎదురుచెప్పరాదు అమ్మా" అన్నాడు అంజి.

పేముబెత్తంతో అంజి గబగబా నాన్న ఉన్న గదిలోకి ఉరికాడు. గది తలుపులు గట్టిగా వేశారు. ఆ పేముబెత్తం తీసికొని ఈసారి మరీ మోతపుట్టేట్లు పరుపై బాదుతున్నారు. ఆ మోతవిని తట్టుకోలేకపోయింది. ఆమె ఎక్కడదవంట అక్కడే వదలి వేగం గదివద్దకు తోసుకుంటూ వచ్చి తలుపు తట్టింది. "తలుపు తియ్యండి" అన్నది కొంపలు అంటుకుపోయినన్నంత ఆందోళనతో. "ఆగు, ఇంకా పేము బెత్తంతో బాదటం పూర్తి కాలేదు" అన్నాడు అంజితండ్రి. ఉండబట్టలేక బిగ్గరగా ఏడవడం మొదలు పెట్టింది. "చాలు లేవయ్యా, బిడ్డను చావచితక కొట్టుతున్నావు. ఇక వాడేమన్నా బతుకుతాడా," అని టకటకా తలుపు తెరిచిందాకా కొట్టుతూనే ఉన్నది ఆమె. తాకిడికి తలుపుబందులు కదిలాయి. తప్పనిసరి అయి ఆయన తలుపు తీశాడు. చీదేస్తూ దిగులుదిగులుగా ఆమె గదిలోకి అడుగుపెట్టింది. తన కళ్ళు తానే నమ్మలేకపోయింది. కళ్ళు ఒకటేమయిన చిరుకొంగుతో తుడుస్తూ కలా, నిజమాని బిడ్డవీపువంక చూస్తున్నది. "పరుపునా - అంజి ననుకొని గాభరాపడ్డా - మంచిపనే చేశారు. లేకుంటే నా అంజి దక్కేవాడేనా-" అన్నది.

"అంజికి బుద్ధివచ్చింది అమ్మకోపానికి, నాన్న నిదానానికి వాడు మనసు మారింది. ఇక ఎప్పుడూ కొంటెపనులు చేయను ఒట్టు అమ్మా!" అన్నాడు. "నా బంగారుకొండకదూ" అని ముద్దు పెట్టుకుంది. అంజివైపుచూచి నాన్న ఆనందంతో చిరునవ్వునవ్వాడు.

గేయ కథ

బుజ్జి బాబు

శ్రీ అడుసుమిల్లి పూర్ణచంద్రరావు

కలదు వొకచోట, మునియేటి గట్టునందు
కలదు గ్రామము గలదు, కలదు ఒక గుడిసె
వెట్టి ఏనాది వీరాయి దా గుడిసె, చుట్టు గుడిసె
అతని కొక్కడే బిడ్డ, మురిపాల బిడ్డ.

తప్ప టడుగుల బిడ్డ నడుతు లేస్తుండ
కొసరి కొసరి బాబు బువ్వ తినుచుండ
లాలించి దీవించి పెంచు కన్నతల్లి
మాయ రోగాన చిక్కి మరిణించె!

చావు పుట్టుక లసలెరుగడా బిడ్డ
పాప పుణ్యాలు పసిపాప డే మెరుగు!
పెద్ద విషయాలతో పాప కేటిపని?
'అమ్మ!' 'అమ్మ' అంటూ తల్లడిల్లినాడు.

ఊయలూపి లాలించు వారేరి?
జోల పాటలు పాడు వారెక్కడ?
జాబిల్లి దిగివచ్చి బువ్వ తినిపించదు
'అమ్మ' 'అమ్మ' అనిన – వీరాయి ఏ మనును?

బిడ్డ తోడిదే లోకమని వీరాయి తలచె
ప్రాణ మెత్తుపెట్టి పోషించి పెంచె నతడు
ఎన్నొ గాలిమేడలు కట్టుకొని కడకు వీధి
బడికి పంపె బిడ్డను, ఐదేడుల బిడ్డను.

ముద్దుగా బుజ్జిబాబంటు పేరున్ననూ
'వెట్టాడి కొడుకం'ద్రు లోకు లాతన్ని.
'ఏనాదికి కూడా చదువు కావలెన?'
అంచు ఆడిపోతురు ఊరి పెత్తనదార్లు.

బడికి మొత్తము 'మొదటి వాడుగ' నెగ్గి
పంతులయ్య ప్రేమ చూరగొనెను బుజ్జి.
'కమ్యూనరు, రెడ్డోరు' దరికి రానీయనంత
కసువేమి మార్కులకు కష్టపడి చదువంగ!

బుజ్జి బాబును గుండె హత్తుకొని వీరాయి
'పై చదువుకై నేను యత్నింతు' ననెను,
'బిడ్డ గొప్ప చూసుకో తల్లి లేదాయె' ననుకొని
'అన్నిటికి నేనె దిక్కు!' నని కన్నీరొడెను.

మూడు రోజులు ముసురు
మూడు వేళల వాన
వాగు వంకలు పొంగి
వరద క్రమ్మెను నాడు.

మునియేరు బుసబుసా పొంగింది
మిన్ను మన్నేకముగ ఉరవళ్లు పెట్టింది.
ఏటి లంకలు కొన్ని తార్మారు నయ్యె
ఊరిపైబడి వరద ఊడ్చుకొని పోయె!

తోటలన్నీ కూలిపోయె
బాటలన్నీ మాసిపోయె
పైర్లు ఊర్లూ కానవాయె
ఏటి గట్టే రూపుమాసె.
నీటి నున్న ఇంటి చూరుల
తాచు పాములు చేరుకొన్నవి
అడవిలోని మృగములన్నీ
నడి బజారున కొలువు తీర్చె.

ఏటి నీటిలో ఎన్ని జీవాలు కూలినవో?
ఎవరికైనను వరద చెప్పి వస్తుందా?
విరుల తరుల నెల్ల దొర్లించుకొని వచ్చె వరద
'వీరాయి' ఎప్పుడెటు కొట్టుకొని పోయెనో?

ఎందు కయ్యా బుజ్జి! అలుల రోదింతువు?
మొన్న పట్నంపోయి కలగంటివా నీవు?
'ప్యాసయ్యా' నని పట్నం చుండబోతివే!
ఇంతలో ఇంతగునని తెలియ లేవు కదా?

ఊహ తెలియక ముందె నినుబాసె తల్లి
ఊహ తెలిసిన వయసున పోయె నీ తండ్రి
వరద తీసిన ఆ సెలయేటి నడుగుమా!
'నాన్న నెక్కడికి ఎత్తుకొని పోతివే?' అని.

నీ కన్నుల నీరు తుడువ రారెవ్వరు
నీ చదువుకై దయచూప రెవ్వరు
అడిగి అడిగి వేసారితివా తుదకు!
ఆలింపరు కద నీ విషాదగాథలను!

బుజ్జిబాబు చేయునది లేక, ఆశమాలి
గొడ్లకాపరివృత్తి చేబట్టితివా?
పశువుల మళ్ళించి, ఏట ఇసుకపై
వ్రాయుచుందువా పాత చదువులెల్ల?
చెరిపి వ్రాయుచుందువు సదా ఏవో
పాటలు! పదములు! కథలు! గాథలు!

* * *

బాలలారా! పరిహసింపకు డాతని
ప్రేమామృతము చిల్లి దరిజేర్చుకొనుడు,
'కలిమి లేములు కులగోత్రములు మనకేల?'
'బాలలందరము ఒక్కటే, ఒక్క బ్రతుకే!'
అనుచు చల్లగా చెప్పుడాతనికి మీరు!

'ఊహాచిత్రణ!'

పిల్లల రాజ్యాంగం

శ్రీ "పురాణం"

[ఇదొక చమత్కారమైన ఊహా చిత్రణ. కథకాని ఈ కథలో చాలమంది ఉలికిపడే విషయాలు కనిపిస్తాయి. ఐతే, ఇది ఊహా చిత్రణ కనక ఎవరూ ఉలికిపడనక్కరలేదు. ఇలా జరుగుతుందిసుమా అని ఎలా చెప్పడానికవీల్లేదో, అలాగే ఇలా జరగలేదని చెప్పడానికి వీల్లేదు.

ఏమయితేనే, పిల్లల తరఫున వకాల్తానామా తీసుకొని ఈయన గొప్ప అలజడి కలిగిస్తున్నందుకు ధన్యవాదాలు చెబుదాం ఏమంటారు.?]

పిల్లల న్యాయస్థానం! కిటకిట లాడపోతోంది.

తల్లులూ, తండ్రులూ, మంత్రులూ పాలకుల దగ్గర్నుంచి అమ్మమ్మలు, నాయనమ్మలవరకూ అందరికీ బోనులు తగిలించబడ్డాయి.

బడిపంతుళ్ళకు, పత్రికా రచయితలకి, కవులకూ బాల పోలీసువారు ప్రత్యేకంగా పహారా యిస్తున్నారు.

పెద్దవాళ్ళని విచారించే కాల మొచ్చిపడింది.

న్యాయస్థానం వొక విశాలమైన మైదానంలో ఆకాశమంత పందిరివేసి భూమంతా అలికి చెప్పలేనన్ని ముగ్గుల్తో, తోరణాల్తో అలంకరించారు. వేలాదిరంగు బెలూన్లు రంగు కాగితాల అలంకరణలతో మెరసిపోతూన్న పందిట్లో వేలాది లక్షలాది బాల బాలికలు వుత్సాహంతో గుమిగూడారు. గుండ్రటి వేదికచుట్టూ ఎర్రతామర పూలతో నింపారు. న్యాయ పీఠమంతా తెల్లకలువ పూలతో రమ్యంగా నిర్మించారు.

ఆ తెల్లకలువపూల సింహాసనంలో మీగడకన్నా, పాలరాతికన్నా తెల్లటి దుస్తులు తొడుక్కున్న వో అందమైన అమ్మాయి కూర్చొనివుంది. ఆ అమ్మాయి చాలా ఠీవిగావుంది. ఆమె కళ్ళు చాలా శాంతంగావున్నాయి. దిగువను చాలామంది నల్లపరికిణీ అమ్మాయిలు చేతుల్లో రకరకాల కాగితాల్తో అటూ యిటూ పరుగులు పెడ్తున్నారు. ఈ ఆవరణచుట్టూ నీలిరంగు దుస్తుల్లోవున్న బాలురు గజానికొక్కరు చొప్పున కోటకట్టారు. ఎర్రపరికిణీలు కట్టుకున్న ఆడపిల్లలు నిందితులచుట్టూ బోనులా నిలబడ్డారు.

న్యాయస్థానమంతటా బాకాలు, బూరాలు తగిలించారు. నల్లపరికిణీ అమ్మాయిలు బారులుతీర్చి నిల్చున్నారు. బాకాలోంచి తెల్లకలువ పూల మధ్యనుంచి లేచిన అమ్మాయి గొంతుక మధురంగా వినిపించి వుంటుంది. పిల్లలు జేజేధ్వానాలు చేశారు. సముద్రం పొంగినట్లుగా సంతోషం పెల్లుబికింది. అంతే- గంభీరమైన ప్రశాంతత న్యాయస్థానమంతటా ఆవరించింది. పిల్లల రాజ్యాంగం ప్రకారం పెద్దవాళ్ళ అక్రమాలకూ, అన్యాయాలకూ అప్పుడే విచారణ ప్రారంభమయింది.

తల్లులూ - తండ్రులూ!

నల్లపరికిణీ అమ్మాయి ప్రశ్న బాకాలోంచి వినపడింది.

'మమ్మల్ని మీరెందుకుకన్నారు?'

ఎవరూ నవ్వలేదు. పెద్దవాళ్ళు చిరాకుపడి బోనులోంచి యేక కంఠంతో కోపంగా యిలా అరిచారు

'ఇటువంటి ప్రశ్న మేమెన్నడూ మా పెద్దవాళ్ళను వేయలేదు.'

తల్లులూ,తండ్రులూ యీ ప్రశ్నకు చిరాకుపడ్డం, పళ్ళు పిండుకోవటం జరిగాక నల్లపరికిణీ అమ్మాయి తిరిగి ప్రశ్నించింది

'బాధ్యతలు తెలియనివాళ్ళు తల్లిదండ్రులైపోతున్నారు. అసమర్థులు పిల్లల్ని కని కూర్చుంటున్నారు. పోషించలేని తలిదండ్రుల చేతుల్లో పిల్లల బాల్యమంతా నరకయాతనై పోతోంది. పిల్లలకు సరియైన ఆహారం, పోషణ, విద్య, వైద్యం యివన్నీ యివ్వలేని పెద్దలు వాళ్ళను లోకంలోనికి తీసుకువచ్చినందుకు చట్ట ప్రకారం నేరస్థులు. ఇది మీరు ఒప్పుకుంటున్నారా?'

తల్లిదండ్రులు గింజుకొంటున్నారు. నల్ల పరికిణీ అమ్మాయి యింకా యిల్లా అంది 'పిల్లలకి మీరు సరియైన విద్య రావాలనుకోవటంలేదు. ఇంట్లోంచి లేకుండా పోతే కొంత అల్లరి తగ్గుతుందని బళ్ళోకి పంపిస్తూంటారు. ఇంకా మీలో చాలామంది పిల్లలచేత నానా చాకిరీ చేయించుకుంటారు. మీకు దురాశ, ద్రోహం, కక్షలు, కార్పణ్యాలు హెచ్చు - వాళ్ళకోసం ఏది తలపెట్టినా అంగులో అవినీతికి భాగస్వాములై పోతూంటారు మీరు. పిల్లలకు వుచితంగా మందులుగాని, వైద్యంగాని కనీసం వొక గ్లాసుడు పాలుగాని యివ్వలేక పోతున్నారంటే అందుకు ఎవరు అడ్డు వస్తున్నారు? మీ రే మీ పెద్ద వాళ్ళే మీ ప్రాణాలికి డబ్బుకి లంకె మీలో కొందరు డబ్బుకోసం మనుష్యుల్ని హతమారుస్తారు. మంచి, సుఖం, శాంతి, దయ యిల్లాటివన్నీ మీరు పుస్తకాల్లో భద్రపరిచి చూసి ఆనందిస్తూవుంటారు. మీలో మీరే సరిగా చదువుకోలేదు. అజ్ఞానం, అసూయ దారిద్ర్యంతో మీరు పిల్లల అభివృద్ధికి నిరోధకులవుతున్నారు. మీ పిల్లలమీద మీకు శ్రద్ధలేదు. మీరు ఎనిమిదికీ పనిసికీ, మళ్ళ అష్ట గోడల్ని కడుతున్నారు. పిల్లల రాజ్యాంగం యీ ప్రత్యేక న్యాయ స్థానంలో మిమ్మల్ని నేరస్థులుగా నిలబెట్టింది.'

అపరాధుల వైపునుంచి కలకలం వినవచ్చింది

న్యాయ పీఠంనుంచి తీర్పు యిలా వచ్చింది.

'బాధ్యతల్లేకుండా పిల్లల్ని కనెయ్యటం పోషించలేని అసమర్థతవరకూ తల్లులూ, తండ్రులూ నిందార్హులు. అన్నైని పరిస్థితులకీ, అరాచకానికీ మంత్రుల్నీ పాలకుల్నీ విచారిస్తున్నాం' మంత్రులూ, పాలకులూ బోనులో కెక్కి నిల్చున్నారు

మంత్రులూ - పాలకులూ!

నల్లపరికిణీ అమ్మాయి అభియోగాన్ని తెచ్చి చదివింది.

'మీరంతా దేశాన్ని పరిపాలిస్తున్న పెద్దలు. మాకోసం మీ రేంచేశారని అడుగుతున్నాం. ఏటా అనేకమంది పసిపిల్లలు సరియైన వైద్యం పోషణలేక చనిపోతూంటారు. మమ్మల్ని పసిపిల్లలుగా మీరే జాగ్రత్త తీసుకుని పోషించాలి. మాలో ఎవరికీ ఆహార లోపం, వైద్యలోపం జరక్కుండా చూడాలి. మాకోసం ప్రత్యేకంగా ఆటస్థలాలు, స్కూళ్ళు, బస్సులు యివ్వాలి. అసలు మీరు రాజ్యాన్ని పరిపాలించేది ఎవరికోసం? నిర్బంధ విద్యావిధానం అమలులోకి తీసుకురావాలి. కాని మీలోమీరే కొట్లాడుకొంటున్నారు. మీరు మనుష్యుల్లోనే చాలా తేడాలు పెంచేశారు. ఒకరు ఎక్కువ ఒకరు తక్కువ, ఒకరు స్వతంత్రులు, వొకరు బానిసలు, వొకరు నలుపు, వొకరు తెలుపు - మీరు మాట్లాడే భాషను సౌకర్యంకోసం వాడుతున్నామని కూడా అనుకోరు. ప్రతి చిన్నవిషయం కూడా మీరు చాలా పెద్ద అవరోధాన్ని కలిగించ కలరు, ఒకరివద్ద ఎక్కువగా మురిగిపోతున్న వస్తువుని రెండవవారికి లేనప్పుడుయివ్వరు. సమంగాపంచుకోలేరు, సుఖంగా జీవించలేరు. చాలా మంచివాళ్ళనిసైతం మీరు కాల్చి చంపుతారు. ఆయుధాలమీద మీకు యింకా విశ్వాసంవుంది. శాస్త్రవిజ్ఞానాన్ని పెంచుకుని మేము అధికులమని విర్రవీగుతున్నారు. ఇంత విశాలమైన విశ్వం గుప్పిట్లో యిముడ్చుకోగలిగామని సంతోషిస్తున్నారు. కాని మీ సంకుచితత్వాలతో, ద్వేషాలతో, అసూయాస్పర్థలతో 'మనిషిగా విశాల హృదయులుగా వొక్క మెట్టు' కూడా ముందుకు పోలేకపోతున్నారు. ఇక మీరు మా పిల్లలకు ఏం చేయగలుగుతారు? వీధుల్లో అడుక్కునే మురికి పిల్లలు, చెట్లక్రింద వుయ్యాలలతో గీ గ్యారుమని యేడ్చే ఆకలి నిసువులు, రోడ్లమీద పేవుమెంట్లమీద పడుకునే అమ్మాఅబ్బా తెలియని అనాథులు, కాలువల్లో కొట్టుకొచ్చే బొడ్డుకోయని శవాలు, మీ మురికివుండ్లు, పెంటకుప్పలవద్ద పుల్లి విస్తరాకులకోసం ఎందుల్తో, కుక్కల్తో ఒకగా పోరాడే హీన దీన మానవులు - వారి సంతతి -

ఈ వ్యవస్థ బాగులేదంటున్నారా?

అవస్థ తప్పించలేమంటున్నారా?

మీరు ప్రభువులు, మీరంతా భవిష్యత్తుకు డబ్బు కూడబెట్టడం తెలుసుకున్నారు. ఇప్పి కట్టుకోగలుగుతున్నారు. కాని సరియైన వారసుల్ని తయారు చేసుకోలేకపోతున్నారు. మీరంతా కబుర్లేగాని ఆచరణలో ఆక్షేపణలేదు. కనీసం విద్యనీ, వైద్యాన్నీ వుచితంగా అందుబాటులో వుంచలేకపోయారు మీ పిల్లలకు. ఈ కారణంగా మిమ్మల్ని బాల్యసైనికి న్యాయస్థానం దోషులుగా పరిగణిస్తున్నది.'

మంత్రులు పాలకుల ముఖాలు ఎర్రగా కెంపులైపోయాయి

అమ్మమ్మలూ,నాయనమ్మలూ!

ఈ విచారణ ప్రారంభమయ్యేసరికి న్యాయస్థానమంతా నవ్వులు, కేరింతలతో క్షణకాలం గిల్లంలుగా వుప్పొంగింది. బొక్కిపళ్ళవాళ్ళూ, బోసనోటివారు, పండుజుత్తు వారూ, వంగినడిచేవారూ, 'సీతారామా' అనుకుంటూ బోనెక్కారు.

'మీకేమొచ్చిందర్రా మమ్మల్నిలా అవస్థపెట్టడానికి..'

నల్ల పరికిణీ అమ్మాయి కాగితాలు తెచ్చి చదివింది-

'మీరు చాలా విషయాల్లో పిల్లలతో పోటీకు వస్తున్నారు. మీరు సోమరులు. మీకుపనిలేదు. మీకంటే చిన్న తరంవాళ్ళు కష్టపడి సంపాదించి తెస్తే అందులో భాగస్వాములు.'

ముసలివాళ్లు కోపంగా యిలా అరిచారు-

'మా బిడ్డల్ని మేం పెంచి పెద్దవాళ్ళను చేసుకున్నాం. తిరిగి వాళ్ళు మమ్మల్ని పోషిస్తే మీకెందుకు దుఃఖ పడుతారు?'

న్యాయవాది సముదాయించి చెప్పింది.

'మేం భవిష్యత్తుకు వారసులం. మా హక్కులతో మీరు పోటీలుపడ్డం మేం నిరసిస్తున్నాం'

ముసలివాళ్ళు కోపంగా యిలా అన్నారు

'మేం మీకేంతచేశాం? మిమ్మల్ని, అడ్డాలలో యెత్తుకుని ఎవరు మోశారు? మీకు గోరుముద్దలు కలిపి కాకుల్నీ పిల్లుల్నీ చూపుతూ అన్నంతినడం యెవరు నేర్పారు? మీకు నడకరాకపోతే...మీకు మాటలు రాకపోతే ..మిమ్మల్ని పాటలుపాడి మీతో ఆటలు ఆడి ఎవరు పెద్దవాళ్ళనిచేశారు? జరిగిందంతా మర్చిపోయి మళ్ళా మమ్మల్ని తినాన్ని నిందిస్తున్నారా? మీరు చిరకాలం నవనవలాడుతూనే వుంటారా? మీరు ముసలివాళ్ళుకారా? మీరు మీ బిడ్డలపై ఆధారపడరా?'

నల్లపరికిణీ అమ్మాయి యిలా చెప్పింది.

'ఒకరు మరొకరిమీద ఆధారపడ్డాన్ని హక్కుగా మీరు వాదిస్తున్నారు. మా పిల్లల రాజ్యాంగం ప్రకారం ప్రభుత్వమే శిశుపోషణాలయాలు, శిశు సంరక్షణాలయాల ద్వారా పిల్లల పెంపకానికి బాధ్యత స్వీకరించాల్సి వుంటుంది. ఇక మీరు సేవలు చేయటాన్ని మేం కాదనటం లేదు గాని మీ పెంపకంలో చాలా దోషాలున్నాయి

'ప్రమాదాల్ని వారించబోయి పిరికితనం, భయం మొదట పిల్లల్లో కెక్కిస్తారు.

'వైద్యం మీకు రాకపోయినా మీరు పిల్లలకు కారాకు కూరాకు వైద్యం చేస్తారు

'దైవము, మతమూ, భక్తి'గురించి పిల్లలకు బోధపర్చలేక అవసరం లేకపోయినా 'మూఢ' నమ్మకాల్ని చిన్నతనంలోనే పసి మెదడ్లో నాటుతారు.

'ఎక్కువ, తక్కువలు, ఆడమగ విచక్షణ లోకువలు, కులాలు భేదాలు యివన్నీ వుగ్గు పాలతో నూరిపోసి 'యిదీ మన సంస్కృతి' అని మీరు తృప్తిపడుతున్నారు.

'మీ పెంపకంలో పిల్లలకు ఎక్కువ హాని వుండటాన్ని యీ న్యాయస్థానం ఎలపరుస్తున్నది'

ముసలివాళ్ళ ముఖాలువెల్లబడ్డాయి. కొందరు గొణుకుకుంటూ యిలా అన్నారు.

'మీరు పిల్లల్ని తల్లీతండ్రికి దూరం చేసి పెంచుతామంటున్నారు. అభిమానాలు, అపేక్షలు నశింపవుతాయి. ఎవరికివారే యమునాతీరే.'

'ముందుకుపోయే వాళ్ళను ఆ కట్టడానికే మీ ముసలివాళ్ళు పన్నిన వుచ్చుల్లో యీ అపేక్ష- అభిమానాలొకటి. పిల్లల వ్యక్తిత్వాన్ని పాడు చేయటానికి మీ అపేక్షలూ, అభిమానాలూ చాలావరకు తోడ్పటాన్ని మా రాజ్యాంగం సూచించి, అసమర్థులుగా బాల్య జీవితంలో తయారు కావడటాన్ని నివారిస్తూ యీ న్యాయస్థానం ప్రసక్తమే తల్లి తండ్రుల బాధ్యతల్తో పిల్లల్ని పెంచాలని వాదిస్తున్నది.'

(మిగతా 6వ పేజీలో)

జమున

[3 వ పేజీ తరువాయి]

సినిమా వార్తలు

1954-55 లో సెన్సారయిన చిత్రాలు

1954-55లో సెన్సారయిన చిత్రాలీవిధంగా ఉన్నాయి.

	35 ఎ మి మీ	16 మి మీ
భారతదేశచిత్రాలు	672	46
ఇతరదేశ చిత్రాలు	966	700

పై సంఖ్యలలో పూర్తి చిత్రాలు, హ్రస్వచిత్రాలు కలసివున్నాయి ఇతర దేశాల హ్రస్వ చిత్రాల సంఖ్య పూర్తి చిత్రాలకంటె చాలాఎక్కువ 56 బ్రిటిష్, అమెరికన్ చిత్రాలను భారతదేశంలో ప్రదర్శించరాదని

ఫిలిమ్ ఫెడరేషన్ నూతన కార్యవర్గం

ఉరిశిక్షపైన చలనచిత్రం

కన్నడరచికి సన్మానం

సినిమారాబడి తగ్గిపోతున్నదా?

బి. యస్. రంగా కొత్త చిత్రాలు

ఇంగ్లీషు చలనచిత్ర నిర్మాణంపై విమర్శలు



భరణీవారి చింతామణిలో యస్. వి. రంగారావు

గ్రంథ సమీక్ష

కోరణిలోను మాట్లాడుతాడు.

తనకు ఏర్పడిన కష్టాలకూ, దుగలవాళ్లకు కుమిలిపోయి మగ ఙించే స్థితిలో శాంత లక్ష్మిని పాట పాడమనడం కూడా ఇలాంటిదే

తొలి ప్రయత్నం కావడంవలన జరిగిన ఇలాంటి లోపాలను రచయిత ఇకముందు సవరించుకొంటారని, భాషా విషయంలో కూడా శ్రద్ధ వహించుతారని, ఆశిస్తున్నాను తెలుగు అధ్యయనం, శ్రమ చేస్తే మంచి నాటకకర్తగా రాణించడానికి రచయితకు అవకాశాలున్నాయి.

— వేం. రా.

గులాబితోట- పండ్లతోట

మారినమనిషి

పుటలు, వెల మూడున్నర రూపాయలు.

పంజ్లతోట: క్రౌన్ 300 పుటలు, వెల మూడున్నర రూపాయలు.

ప్రాప్తిస్థానం – కవికోకిల గ్రంథావళి, పద్మారెడ్డిపాలెం, యల్లయపాలెంపోస్టు, నెల్లూరు జిల్లా.

— కృష్ణమూర్తి

స్వీకారం

ప్రతాపరుద్రీయం
(నవల)
రచయిత
పొన్నలూరి రాధాకృష్ణమూర్తి
వెల సాధారణ ప్రతి రు2-4-0
మేలుప్రతి 2-12-0
ప్రతులకు విశాలాంధ్ర ప్రచురణాలయం, విజయవాడ-2

★

మహాబోధి
(పద్యకావ్యం)
రచయిత శ్రీ దాశరథి
పుటలు 56 వెల రూపాయి
ప్రాప్తిస్థానం ఆంధ్ర బుక్‌హౌస్, సుల్తాన్ బజార్, హైద్రాబాదు

★

గోరిల్లారాక్షసి
(1, 2 భాగాలు)
రచన శ్రీ ముక్కామల
వెల ఒక్కొకభాగంఅర్ధరూపాయి

తమాషాక్లబ్
రచన శ్రీ ముక్కామల
వెల రు 0-8-0
ప్రతులకు
ఆంధ్రరత్న బుక్ డిపో
తెనాలి, అని వ్రాయాలి

★

దుర్ముఖినామ సంవత్సర గంటల పంచాంగము
పంచాంగకర్త
శ్రీ చల్లా వెంకటాచలపతిసిద్ధాంతి
వెల రు 0—4—0
ఆంధ్రరత్న బుక్ డిపో,
మారీసుపేట, తెనాలి

★

ఆంధ్రవాణి
[మాసపత్రిక]
వెల రు 0—8—0

పిల్లల రాజ్యాంగం

(5 వ పేజీ తరువాయి)

'అయితే మమ్మల్నేం చేస్తారు మీరు?' ముసలివాళ్ళు వణుకుతూ అన్నారు

నల్ల పరికిణమ్మాయి తెల్ల పరికిణమ్మాయికేసి చూసింది

కలువపూల వేదికనుంచి న్యాయమూర్తి యిలా చెప్పింది

'వృద్ధ శిశు సంరక్షణాలయాలు కట్టిస్తాం ఏటా మిమ్మల్ని వుచితంగా దేశాలు, పూళ్ళు, పల్లెలూ త్రిప్పుతాం మీకు ప్రత్యేకంగా వైద్యసదుపాయం, పుస్తకాలు, పత్రికలూ అన్నియిస్తాం మీచేతి తేలికైనపనులు చేయిస్తాం. ముసలివాళ్ళనూ, పసివాళ్ళనూకూడా సమానంగా చూడ్డమే మా రాజ్యాంగ పరమలక్ష్యం ' బోసినోళ్ళు నవ్వాయి ముడుతలుపడ్డ ముఖాలు విప్పారాయి. వృద్ధహస్తాలు మీ రెప్పుడూ చల్లగా వుండాలనే మేము కోరేది అంటూ దీవనలు జల్లాయి.

[ఇంకా వుంది.]

మీకు తెలుసా?

జపానులో నిరుద్యోగం

1955 జనవరితో పోల్చిచూస్తే ఈ యేడు జనవరికి జపానులో లక్షా పది వేలమంది నిరుద్యోగులు పెరిగారు. గత సంవత్సరం డిసెంబరు కన్నా ఇప్పుడు ఉద్యోగులసంఖ్య 100 కి $4\frac{1}{2}$ చొప్పున తగ్గిపోయింది ఇదే కాలంలో వ్యవసాయంలోను, కలపపరిశ్రమలోను ఉద్యోగుల సంఖ్య 15 లక్షల 10 వేల మందికి తగ్గిపోయింది.

ఈ లెక్కలన్నీ ప్రధాని ఆధ్వర్యాన ఉండే కార్యాలయం వారే ప్రకటించారు

కొలంబియాలో హత్యాకాండ

కొలంబియా ప్రభుత్వానికి, పెద్ద భూస్వాములకు వ్యతిరేకంగా కొలంబియా ప్రజలు పోరాటం సాగించుతున్నారు. ప్రభుత్వం, సైనికులను, టాంకులను, విమానాలనుఉపయోగించి అణచివేస్తోంది "జస్టీసియా" అనే పత్రిక కథనం ప్రకారం 1953 నుండి 50 వెలమంది చనిపోయారు. 2 వేల మంది రాజకీయ ఖైదీలు కాన్సెంట్రేషన్ క్యాంపుల్లో వున్నారు.

పెద్దల విద్యావిషయక సచిత్ర మాసపత్రిక
సంపాదకులు
శ్రీ యస్. శ్రీకంఠం
ఆంధ్ర భాషా ప్రచారసమితి,
కోయిలకుంట్ల, కర్నూలుజిల్లా

BOOKS ON POLITICS AND PHILOSOPHY

	Rs	As
HISTORY OF THE COMMUNIST PARTY OF THE SOVIET UNION (B)	1	2
BOURGEOIS NATIONS AND SOCIALIST NATIONS by V Kozlov	0	2
THE ROLE OF ADVANCED IDEAS IN THE DEVELOPMENT OF SOCIETY by F Konstantinov	0	3
BASIS & SUPERSTRUCTURE by F Konstantinov	0	1
PEOPLE'S DEMOCRACY A NEW FORM OF POLITICAL ORGANISATION OF THE SOCIETY by A Sobolev	0	3
FIFTIETH ANNIVERSARY OF THE COMMUNIST PARTY OF THE SOVIET UNION 1903-1953	0	1
ON THE "COMMUNIST MANIFESTO" OF K MARX AND F ENGELS by C Obichkin	0	2
COMMUNIST EDUCATION by M Kalinin	0	12
SELECTED PHILOSOPHICAL ESSAYS by N A Dobrolyubov	5	10
SELECTED PHILOSOPHICAL WORKS by V G Belinsky	4	8
SELECTED PHILOSOPHICAL ESSAYS by N G Chernishevsky	3	0
A I HERZEN–A GREAT RUSSIAN THINKER AND REVOLUTIONARY DEMOCRAT by G Trevayev	0	4
THE SOCIO – POLITICAL AND PHILOSOPHICAL VIEWS OF V G BELINSKY by Z Smirnova	0	2
SOCIO-POLITICAL AND PHILOSOPHICAL VIEWS OF N A DOBROLYUBOV by V Kruzhkov	0	2
THE WORLD OUT-LOOK OF N G CHERNISHEVSKY by M Grigoyan	0	3

Available at
Visalaandhra Publishing House, Vijayawada-2
and
People's Book House, Hyderabad (Dn.)

V/O MEZDUNARODNAYA KNIGA Moscow 200, U.S.S.R.

బజారు ధరలు

విజయవాడ, మార్చి 31
(మధ్యాహ్నం గం. 1 వరకు)

బంగారం ధరలు

మేలిమి పాస్టా	106	0	0
నాసా	105	8	0
నవరసు	67	12	0
వెండి 100 తులములు	184	0	0
1 తులము	1	14	0

ధాన్యం ధరలు

24 వెంబరు	25	0	0
వంకసన్నాలు	23	0	0
12 వెంబరు	22	0	0
అక్కుళ్ళు	22	0	0
కుసుమ	21	12	0
కొరామణి	21	12	0

బియ్యం ధరలు

24 వెంబరు	56	0	0
వంకసన్నాలు	53	0	0
12 వెంబరు	51	0	0
అక్కుళ్ళు	51	0	0
కుసుమ	50	0	0
కొరామణి	50	0	0

అపరాల ధరలు

మినుములు 240శేరులు		56	0	0
కందులు	35/-	36	0	0
నల్లపెసలు(మాగాణి)	41/-	44	0	0
పచ్చపెసలు 280 శే॥		44	0	0
పచ్చపెసలు(మెట్టవి)		43	0	0
శెనగలు (దేశవాళీ)		37	8	0
శెనగలు (పంజాబు)		35	0	0
వనియాలు 90 శేరులు		32	0	0
ఉలవలు		31	8	0
ఆముదాలు		38	0	0
పంచదార (ఉయ్యూరు)		38	5	3
బెల్లం మణుగు 3 10 0		4	4	0
మిర్చి(నైజాం) ,,		17,	2	0
మిర్చి దేశవాళీ ,,		28	0	0
నీరుల్లి ,, 1 2 0		1	10	0
వెల్లుల్లి ,, 6-8-0		7	0	0
చింతపండు(మణుగు) 4-0-0		7	0	0
నువ్వుల నూనె (మణుగు)		21	0	0
కొబ్బరినూనె డబ్బా		25	8	0
వేరుశెనగపప్పు 177 శే॥ 56-8-0		58	8	0
,, నూనె మణుగు		16	2	0
,, కేక్ 160 శే॥		14	6	0
,, పుడిపిండి 160 శే॥		16	8	0
కొబ్బరికాయలు1,000		155	0	0
పసుపు పుట్టి	140/-	240	0	0
సంచులు 100		104	8	0
,, ఘార్వడ్		93	8	0

బియ్యం ఎగుమతి రేట్లు

2 మణుగులు బస్తా సంచితో సహా

ఉప్పుడు బియ్యం

అల్లూరు పాలిష్	32	0	0
కోన్ పాలిష్	33	0	0

పచ్చి బియ్యము

కుసుమ	34	0	0
క. 12	34	8	0
అక్కుళ్ళు	34	0	0
కృష్ణ కాటుకలు	36	0	0
చిన్న కృష్ణ కాటుకలు	37	8	0
ఢిల్లీ భోగాలు	38	8	0
బంగారు తీగెలు	45	0	0
గోధుమలు పంజాబువి	40	0	0
,, ఆస్ట్రేలియా	43	0	0
,, జవ్వలు శేరు	0	9	0

డాబా అమ్మబడును

విజయవాడ సూర్యారావుపేటలో డోర్ నెం 24/494 గల షుమారు 400 గజాల స్థలములో, కరెంటు, మంచినీటి సౌకర్యాలు కల్గిన డాబా యిల్లు అమ్మబడును వివరాలకు

C/o విశాలాంధ్ర-విజయవాడ.

సంపాదక లేఖలు

హిందీ పండితుల ట్రైనింగు

మహాశయా,

రాజమండ్రిలో ప్రభుత్వము తెలుగు పండితులకు వలెనే హిందీ పండితులకు కూడ ట్రయినింగు (శిక్షణ) ఇచ్చుటకు నిర్ణయించినట్లు తెలియుచున్నది ఇది ఎంతయు సమంజసమైనదనీ, సంతోషింపదగినదనీ కాని అందులో ఆంధ్రా యూనివర్సిటీవారి హిందీ భాషా ప్రవీణ, మద్రాసు యూనివర్సిటీవారి హిందీ విద్వాన్, సాహిత్య సమ్మేళన్, అలహాబాదువారి సాహిత్య విశారద పరీక్షలలో ఉత్తీర్ణులైనవారికి మాత్రమే ప్రవేశము ఇచ్చుటకు సంకల్పించినట్లు కూడ తెలియుచున్నది సుమారు 30, 40 సంవత్సరములనుండి అధిక శ్రమతో దక్షిణ భారతదేశములో హిందీ ప్రచారము చేయుచున్న దక్షిణ భారత హిందీ ప్రచార సభవారి పరీక్షలకు స్థానము ఇవ్వకపోవుట ఎంతయు చింతనీయము. దక్షిణ భారత హిందీ ప్రచారసభకూడ టీచరుగా తగిన సాహిత్యమును పొందుటకు పుస్తకములను నిర్ణయించి కడు సమర్థతతో పరీక్షలను నిర్వహించుచున్నది ఆ పరీక్షలలో ప్యాసైనవారికే స్కూళ్లలో ఉద్యోగము లిచ్చుచున్నారు ప్రభుత్వము గూడ హిందీ ఉపాధ్యాయుడుగా ప్రవేశించుటకు విశారద పరీక్షలో ప్యాసైన చాలని ప్రకటించినది ఈ విషయము ఆంధ్ర ప్రభుత్వము గుర్తించి కూడ తిగి తాను ప్రారంభించబోతున్న ట్రయినింగు శిక్షణలో ప్రవేశము ఇవ్వకపోవుట కడుంగడు శోచనీయము. కాన ఈ విషయములో పునరాలోచించి దక్షిణభారత హిందీ ప్రచారసభవారి డిగ్రీ పరీక్షలలో ప్యాసైన వారికి కూడ ప్రవేశమిచ్చుటకు నిర్ణయించ వలసినదిగా ఎంతయు కోరుచున్నాము

ఇట్లు,
అట్లూరి రామారావు,
చింతా రామమూర్తి,
యం. యస్. సుబ్రహ్మణ్యం.
రాజమండ్రి నగరహిందీ ప్రచారకులు

బూరుగుపూడి పోస్టు మాస్టరు దురుసుతనం

మహాశయా!

బూరుగుపూడి పోస్టు మాస్టరు కొవ్విడి రామచంద్రరావుపై తేబడిన అభియోగాలను విచారించెదనని పోస్టలు సూపరింటెండెంటు అందుకు సంబంధించిన ఫోటోగ్రాఫ్‌లను తీసుకొన్నారు రెండుమూడురోజులలో విచారణఫలితాలు తెలియజేస్తానని సూపరింటెండెంటు ఈనెల 14వ తేదీన సెలవిచ్చారు. కాని 15 రోజులు కావస్తున్నా తెలియపరచలేదు

అసలు విషయం ఈ నెల 3వ తేదీన పోస్టులో వేసిన రిజిస్టర్డు కాగితాలను వివిధ తేదీలతో ఆరుముద్రలు వేసి తిరిగి పోస్టుచేసినవారికే తిప్పిపంపాడు పోస్టు మాస్టరు ఇదేమిటనిఅడిగినందుకుపోస్టు మాస్టరు నన్ను నానా దుర్భాషలాడటం, చెప్పుతో కొడ్తానని బెదిరించటం జరిగింది పై విషయాలను పోస్టలు సూపరింటెండెంటుకు నివేదించుతూ వాపసువచ్చిన కాగితాలకూడా ఇచ్చాను.

ఈయనకు పోస్టు మాస్టరు ఉద్యోగంతో బాటు పంచాయితీ బోర్డు గుమాస్తా ఉద్యోగం కూడా ఉంది కావున ప్రభుత్వం ఈయనను పోస్టు మాస్టరు పదవినుంచి తొలగించి వేరే ఉద్యోగం లేని మనిషికి ఈ బాధ్యత అప్పగించటం ప్రజాశ్రేయస్సు దృష్ట్యా చాల అవుసరమని పోస్టలు అధికారులదృష్టికి తెస్తున్నాను.

ఇట్లు,
గో. వెంకట్రావు,
బూరుగుపూడి - తూ గో జిల్లా.

విజయవాడలో ట్రాఫిక్ సౌకర్యాలపట్ల అశ్రద్ధ

ఆర్యా,

విజయవాడలో ట్రాఫిక్ సౌకర్యాలపట్ల నిర్లక్ష్యవైఖరి నవలంబిస్తున్నందుకు ప్రభుత్వం మున్సిపాల్టీపై యెట్టి చర్య తీసికొనకపోవడం శోచనీయం

రోడ్లవిస్తీర్ణం తక్కువగావుండటం వలన, అనేకమంది ప్రమాదాలకు గురియై ప్రాణాలు కోల్పోయారు ఇట్టి విషాద సంఘటనలు జరిగినప్పటికీ మున్సిపాల్టీ కదలకపోవడం శోచనీయం.

ప్రజలు నిలవటానికి, బస్సులు, రిక్షాలు నిలవడానికి స్టాండులు నెలకొల్పాలని మున్సిపాల్టీని ఎన్నిసార్లు కోరినప్పటికీ అదిచేస్తున్న నిర్లక్ష్యం క్షమింపరానిది మున్సిపాల్టీ వారు వెంటనే కదలి లారి, బస్సు, రిక్షా స్టాండులు నెలకొల్పాలి రోడ్లవిస్తీర్ణం, ట్రాఫిక్ పోలీసుల సంఖ్య పెంచాలి

ఇట్లు,
ముదలి వెంకటేశ్వరరావు,
అధ్యక్షులు పట్టణ ప్రజాపార్టీ
విజయవాడ

తిమ్మాపురం హరిజనులకు ఇండ్లస్థలాలు ఎక్వైర్‌చేసి యిప్పించాలని అభ్యర్థన

కర్నూలు, మార్చి 28

శాసనసభ్యులు శ్రీ గంజి నాగేశ్వరరావుగారు యీ నెల 25 న సాంఘిక శాఖామంత్రిగారిని ఇక్కడ కలుసుకుని క్రింది వివరాలతోనున్న మెమొరాండము సమర్పించారు

కర్నూలుజిల్లా కంభం తాలూకా తిమ్మాపురం హరిజనులు 30 మందికి యిండ్లస్థలాలకుగాను 1-75 ఎకరముల భూమిని 11-11-55 న ప్రభుత్వమువారు సర్వే చేయించి ప్రత్యేకించారు ఆ భూమిగల రైతు 1-75 ఎకరములకు ప్రభుత్వము యిచ్చిన రేటుకు అమ్మడానికి అంగీకరిస్తూ ఒక స్టేటుమెంటు ప్రభుత్వానికి ఇచ్చారు ఈ భూమిని కౌలుకు చేస్తూన్న కౌలు రైతు మాత్రము అభ్యంతరము తెలియచేస్తూ ప్రభుత్వానికి పిటీషను యిచ్చారు

ఈ అభ్యంతరాన్ని ప్రభుత్వము గుర్తించకుండా యిండ్లస్థలాలను వెంటనే ఎక్వైరుచేసి యివ్వాలి

మంత్రిగారు సమాధానము చెబుతూ వెంటనే చర్య తీసుకుంటామని తెలియజేసారు.

ఆచంట, రేమల్లె బంజర్లు సాగుదార్లకే యిప్పించాలని విజ్ఞప్తి

కృష్ణాజిల్లా నూజివీడు తాలూకా రేమల్లె గ్రామ బంజరు సాగుదార్లగు హరిజనులకే పట్టాల కివ్వాలనీ, పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం తాలూకా ఆచంట గ్రామపేదలు సాగుచేసుకుంటున్న పోరంబోకు భూములను సాగుదార్లకే యిప్పించాలని కోరుతూ శాసనసభ్యులు శ్రీ గంజి నాగేశ్వరరావుగారు యీనెల 27 న కర్నూలులో రివెన్యూమంత్రి గారిని కలుసుకొని మెమొరాండములు సమర్పించారు.

క్రింది అధికార్లనుండి సమాచారం సేకరించి తగు చర్యలు తీసుకుంటామని మంత్రిగారు తెలియజేశారు

ఆంధ్ర సినిమా పనివారల సమావేశం
నూతన కార్యవర్గ ఎన్నికలు

విజయవాడ, మార్చి 28

ఆంధ్రరాష్ట్ర సినిమా పనివారల సంఘం సర్వసభ్య సమావేశం శ్రీ జోస్యభట్ల సత్యనారాయణగారి అధ్యక్షతన విజయవాడ వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో జరిగింది

కార్యదర్శి నివేదిక, ఉమా బుచ్చిబాబు ఆమోదించిన తరువాత సమావేశం నూతన సంవత్సర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు శ్రీ జోస్యభట్ల సత్యనారాయణగారు అధ్యక్షులుగాను శ్రీ ... రామారావుగారు ఉపాధ్యక్షులుగాను, శ్రీ యస్ వెంకటేశ్వరరావుగారు కార్యదర్శిగాను ఎన్నికయ్యారు శ్రీ యస్ రామచంద్రరావు సహాయ కార్యదర్శిగాను, శ్రీ ... నరసయ్యగారు కోశాధిపతిగాను ఎన్నికయ్యారు 10మంది సభ్యులతో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు

వెలువడింది!

సోవియట్ భూమి

(తెలుగు)

సోవియట్ కమ్యూనిస్టు పార్టీ 20 వ మహాసభలో క్రుశ్చేవ్ ప్రవేశపెట్టిన నివేదిక సంక్షిప్త పాఠంతో సప్లిమెంటుతో

56 పేజీలు వెల 0-2-0

ఏజంట్లకు 25% కమీషను

ప్రతులకు

విశాలాంధ్ర ప్రచురణాలయం
బకింగ్‌హాంపేట పోస్టు విజయవాడ 2

కోఆపరేటివ్ బ్యాంకు స్థాపనకై బందరు కార్మికుల అభ్యర్థన

బందరు, మార్చి 28

బందరుపట్టణ క్రిష్ణా ప్రెస్ మాన్యుఫాక్చరింగ్ కం ఎంప్లాయీస్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం శ్రీ అబ్దుల్ వహాబ్ గారి అధ్యక్షతన యీ నెల 25 న జరిగింది కార్మికులు అప్పులు దొరకక నానా యిబ్బందులకు గురిఅవుతున్నారనీ, ఎవరైనా అప్పు యిచ్చినా విపరీతమైన వడ్డీలతో పీడింపబడుతున్నారనీ అందువల్ల ప్రభుత్వం కార్మికుల పరిస్థితులు విచారించి క్రిష్ణా మాన్యుఫాక్చరింగ్ కంపెనీ కోఆపరేటివ్ బ్యాంకు అను పేర ఒక కోఆపరేటివ్ బ్యాంకు రిజిష్టరు చేయించవలసినదిగా కోరుతూ తీర్మానం చేసారు.

తీర్మానం కాపీ, పిటీషను కృష్ణా కోఆపరేటివ్ డిప్యూటీ రిజిస్ట్రారుగారికి, లేబరు కమిషనరుగారికి పంపించారు శ్రీ అబ్దుల్ వహాబ్ గారిని అధ్యక్షులుగాను, కోలవెన్ను వెంకటేశ్వరరావుగార్ని కార్యదర్శిగానూ, శ్రీయుతులు పినపాల గోవిందరావు, సయ్యద్ రహింతుల్లా, పొన్నూరు సుబ్బారావు, బాజాన్, పి చంద్రశేఖరరావుగార్లను కార్యనిర్వాహక సభ్యులుగాను ఎన్నుకున్నారు.

పల్నాడు తాలూకా పశు ప్రదర్శనం
ఉత్తమ జాతులకు బహుమతుల ప్రదానం

గురజాల, మార్చి 27

గుంటూరు జిల్లా పల్నాడు తాలూకా పశు ప్రదర్శనం మొన్న ఇక్కడ జరిగింది

తాలూకా నలుమూలలనుండి మేలురకం పశువులు, మేకలు, కోళ్ళు, వివిధ చేతిపనిముట్లు, పలువురు ఆర్టిస్టుల చిత్రాలు, ప్రదర్శనలో ప్రదర్శించబడ్డవి. అన్నిటికన్నా వుత్సాహవంతంగా గురజాలలోని బాలలు, కుక్కల్ని ప్రదర్శించి, ఒకకొత్త సాంప్రదాయాన్ని ప్రవేశపెట్టి బహుమతులు సంపాదించారు

ప్రదర్శనానంతరం, రాత్రికి జరిగిన బహిరంగసభకు శ్రీ బొజ్జా ఆదినారాయణగారు అధ్యక్షత వహించారు. డాక్టరు యం సోమరాజు,(యం. బి బి యస్) డా॥ యం వై యల్ నర్సింహారావు, (వెటర్నరీ టూరింగు డాక్టరు) డా॥ యం వి. కృష్ణారావు, డా॥ కె శివరామకృష్ణయ్య (స్థానిక వెటర్నరీ డాక్టరు) స్థానిక తహశీల్దారు తదితర పెద్దలు, పశుసంపదను పెంపొందించవలసిన ఆవశ్యకతను వివరిస్తూ ప్రసంగించారు

తదనంతరం బహుమతులుపంచారు

కమ్యూనిస్టు పార్టీనిధి వసూళ్ల కార్యక్రమం

అనంతపురం తాలూకా గ్రామాలలో రు2300లు వసూళ్లుమరికొన్నివాగ్దానాలు

అనంతపురం, మార్చి 28

కమ్యూనిస్టుపార్టీ నిధికి విరాళాలు సేకరించవలసిందిగా రాష్ట్ర కమ్యూనిస్టు కమిటీ యిచ్చిన పిలుపునందుకుని అనంతపురం తాలూకాలోని వివిధ గ్రామాల కార్యకర్తలు ఇంటింటికి తిరిగి క్రింది మొత్తం సేకరించారు

	వాగ్దానాలు			వసూలు		
తరిమెల	1700	0	0	1622	0	0
నాగ్పల	239	0	0	86	0	0
ప్రసన్నాయపల్లి	172	0	0	96	0	0
గొటుకూరు	158	0	0	131	0	0
పూలకుంట	15"	0	0	140	0	0
నియ్యేడు	121	0	0	66	0	0
క్రిష్ణమరెడ్డిపల్లి	80	0	0	29	0	0
దండువారిపల్లి	75	0	0	75	0	0
కందుకూరు	152	0	0			
ఎల్లుట్ల	76	0	0	33	0	0
ఇతరవాగ్దానాలు	50	0	0	10	0	0
రాప్తాడు				21	0	0
మొత్తం	2979	0	0	2309	0	0

పార్టీ నిధికి నూతన వధూవరుల కానుకలు

విజయవాడ, మార్చి 30

విజయవాడ గవర్నరుపేట వాస్తవ్యులు శ్రీ భోగుల రామకృష్ణారావు శ్రీమతి కనకదుర్గాంబగార్ల తమ వివాహసందర్భంలో కమ్యూనిస్టు పార్టీ నిధికి రు 20/- లు విరాళం యిచ్చారు

పుట్టగుంట

కృష్ణాజిల్లా గుడివాడ తాలూకా పుట్టగుంట గ్రామంలో ఇటీవల జరిగిన శ్రీ మల్లిరెడ్డి రామిరెడ్డి శ్రీమతి సుబ్బమ్మగార్ల వివాహ సందర్భంలో కమ్యూనిస్టుపార్టీ నిధికి రు 10/ లు విరాళం యిచ్చారు

లింగవరం

కృష్ణాజిల్లా గుడివాడ తాలూకా లింగవరం గ్రామంలో శ్రీ మల్లిరెడ్డి గోవిందరెడ్డి శ్రీమతి ప్రేమగార్ల వివాహ సందర్భంలో కమ్యూనిస్టు పార్టీ నిధికి రు 5/-లు విరాళం యిచ్చారు.

కిష్కింధపాలెం

కృష్ణాజిల్లా దివితాలూకా కిష్కింధపాలెంలో ఇటీవల జరిగిన శ్రీ త్రిపురనేని సుబ్బారావు శ్రీమతి వెంకటసుబ్బమ్మ గార్ల వివాహ సందర్భంలో కమ్యూనిస్టు పార్టీనిధికి రు 6/-లు విరాళం యిచ్చారు

జువ్వల పాలెం

కృష్ణాజిల్లా దివితాలూకా జువ్వలపాలెంలో శ్రీ యార్లగడ్డ వెంకటేశ్వరరావుగారు ఇటీవలజరిగిన తమ వివాహ సందర్భంలో కమ్యూనిస్టుపార్టీ నిధికి రు 5/-లు విరాళంయిచ్చారు అక్కడే జరిగిన మరో వివాహసందర్భంలో శ్రీ ముమ్మనేని సూరయ్యగారు కూడా కమ్యూనిస్టుపార్టీనిధికి రు 5/- లు విరాళం యిచ్చారు.

పొన్నెకల్లు

గుంటూరు తాలూకా పొన్నెకల్లు గ్రామంలో శ్రీ పచ్చలరామారావు శ్రీమతి మహాలక్ష్మిగార్లు ఇటీవల జరిగిన తమ వివాహ సందర్భంలో కమ్యూనిస్టుపార్టీ నిధికి రు 16/- లు విరాళం యిచ్చారు.

పారిశ్రామికాభి వృద్ధికి భూసంస్కరణల ఆవశ్యకత
కైకలూరు సభలో శ్రీ నాగిరెడ్డి వివరణ

కైకలూరు, మార్చి 28

దేశపారిశ్రామికాభి వృద్ధికి భూసంస్కరణలకు గల సంబంధాన్ని కైకలూరు సభలో ఆంధ్రకమ్యూనిస్టు నాయకులు శ్రీ తరిమెల నాగిరెడ్డిగారు వివరించారు

బహిరంగసభకు కృష్ణాజిల్లామహిళా సంఘనాయకురాలు నాగెళ్ళ రాజేశ్వరమ్మ గారధ్యక్షత వహించారు సభకు 4 వేల మంది ప్రజలు హాజరయ్యారు

మహిళల దుస్థితిని వర్ణిస్తూ వాటిని తొలగించుటకు మహిళా సంఘం ఎలా కృషిచేస్తున్నది రాజేశ్వరమ్మగారు తమ ఉపన్యాసంలో వివరించారు మహిళల అభివృద్ధికి పురుషులు కూడా తోడ్పడాలని కోరారు మహిళలందరూ మహిళాసంఘంలో చేరాలవిజ్ఞప్తి చేశారు

తర్వాత శ్రీ కోసూరి పున్నయ్యగారిచే 'తీర్థయాత్ర' అను హరికథా కాలక్షేపం ప్రేక్షకులను ఆనందపరిచింది తరువాత కృష్ణాజిల్లా వైజ్ఞానికదళంవారు రుద్రమదేవి బుర్రకథ చెప్పారు

అనంతరం కైకలూరు తాలూకాలో గాజులవాగు పంటకు నీరు అందక వేల ఎకరాల్లోని పైరు ఎండిపోతున్నదని, వెంటనే నీరు అందించే గురుత్వర చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతూ సభలో తీర్మానించారు.

అగ్నిబాధితులపట్ల హైద్రాబాదు ప్రభుత్వం శీతకన్ను

హుజూర్‌నగరు, మార్చి 28

నల్లగొండజిల్లా హుజూర్‌నగరు తాలూకా వెల్లటూరులో సంభవించిన అగ్ని ప్రమాదంలో 9 కుటుంబాలకు చెందిన హరిజనులు నానా ఇక్కట్లు పడుతున్నా జిల్లా ప్రభుత్వ ఉద్యోగులు సాయం చేసిన పాపాన పోలేదు

ఇప్పుడు ఈ నెల 4 వ తేదీన అగ్ని ప్రమాదం సంభవించింది పశువుల మేతతో సహా మూడుపుట్ల బొన్నలు ఒక గెదె దూడ మొత్తం రు. 3000 ల ఆస్తికి నష్టం వాటిల్లింది. బాధితులు తమకు సాయం చేయాల్సిందిగా అధికార్లకు విజ్ఞప్తులు పంపుతున్నారు కాని, ఇంతవరకూ ఆలకించినవారులేరు

ఇవాళ తాలూకా రైతు సంఘ నాయకులు శ్రీ అరబండి లక్ష్మీనారాయణగారు ఒక ప్రకటన గావిస్తూ ఉద్యోగుల మౌనంపట్ల తీవ్ర అసంతృప్తిని ప్రకటించారు ధనరూపంలో ప్రభుత్వం ప్రతి ఇంటికి రు 100 లు ఇవ్వాలని, వాసాలు, తదితర కలప అడవినుంచి తెచ్చుకునేందుకు అనుమతి ఇవ్వాలని, ప్రభుత్వ భూముల్లోని తాటిచెట్లను ప్రతి ఇంటికి రెండు చొప్పున ఇప్పించాలనీ కోరారు.

ఖమ్మం తాలూకా పంచాయితీ ఎన్నికల ఫలితాలు
కాంగ్రెసు అభ్యర్థుల డిపాజిట్ గల్లంతు

ఖమ్మం, మార్చి 28

ఖమ్మం తాలూకా ఏదులాపురం, ముత్తగూడెం పంచాయితీబోర్డు ఎన్నికల్లో ఓడిపోయిన కాంగ్రెసు అభ్యర్థులు డిపాజిట్టులు కూడా పోగొట్టుకొన్నారు ఈ రెండు పంచాయితీల్లో ఒక్క కాంగ్రెసు అభ్యర్థికూడా గెలుపొందలేదు.

ఏదులాపురం పంచాయితీ కమ్యూనిస్టు అభ్యర్థి శ్రీ డి సీతారామయ్యగారు పోటీలేకుండా ఎన్నికయ్యారు మిగిలిన మూడు స్థానాలకు కమ్యూనిస్టు అభ్యర్థులు శ్రీయుతులు వెంపటి రామకోటయ్య, మామిళ్ళ వెంకయ్య అతిమాముల పుల్లయ్యగార్లు గెలుపొందారు.

ఎన్నికలు జరిగిన 3 సీట్లకు కలిపి కాంగ్రెసు 44 ఓట్లు సంపాదించింది కమ్యూనిస్టు అభ్యర్థులకు 573 ఓట్లు వచ్చాయి

ముత్తగూడెం పంచాయితీబోర్డుకు కమ్యూనిస్టుపార్టీ తరఫున పోటీచేసిన శ్రీయుతులు మాలెంపాటి సీతయ్య, ... రామారావు, తిప్పిరెడ్డి మల్లయ్య గార్లు పోటీ లేకుండా గెలుపొందారు ఒక స్థానానికి ఎన్నిక జరిగింది కమ్యూనిస్టు అభ్యర్థి శ్రీ తిప్పిరెడ్డి వెంకటరెడ్డిగారికి 101 ఓట్లు రాగా కాంగ్రెసు అభ్యర్థికి మూడే మూడు ఓట్లు వచ్చాయి (వి వి)

నాగాయలంక పంచాయితీ ఎన్నికల ఫలితాలు

చల్లపల్లి, మార్చి 27

కృష్ణాజిల్లా దివితాలూకా నాగాయలంక పంచాయితీబోర్డు ఎన్నికల్లో గ్రామాభ్యుదయ ఫ్రంటుకు నాలుగు స్థానాలు, దానికి వ్యతిరేకంగా పోటీ చేసిన ఇతరులకు 4 స్థానాలు వచ్చాయి మరొక స్థానాన్ని కూడా వీరు పోటీ లేకుండా సంపాదించారు.

ఫ్రంటు తరఫున పోటీచేసి గెలుపొందిన వారిలో ఇద్దరు కమ్యూనిస్టు అభ్యర్థులు

హుజూరాబాదు

కరీంనగరు జిల్లా హుజూరాబాదు తహశీలు ఆఫీసులో బహిరంగంగా లంచాల వేట సాగుతున్నట్లు లోగడ 'విశాలాంధ్ర' పత్రిక సోదాహరణలతో ప్రకటించిన అనంతరం ఇటీవల లావుని కే గేదారు బంజరుకైతుల తరఫున మాట్లాడేందుకు వెళ్ళిన రైతు సంఘ కార్యకర్త శ్రీ కె నారాయణరెడ్డిగారిచే రు 100/ లంచం ఇవ్వాల్సిందిగా అడిగినట్లు తెల్లుస్తోంది

సభలుసమావేశాలు

ఆంధ్రరాష్ట్ర విద్యార్థి ఫెడరేషన్ కార్యవర్గసమావేశము ఏప్రిల్ 14, 15వ తేదీలలో విజయవాడలోని రాష్ట్ర కార్యాలయంలో జరుగుతుంది.

చౌకడిపోలు తక్షణం ఏర్పాటు చేయాలి
అమలాపురం తాలూకా రిక్షావర్కర్లసభ తీర్మానం

అమలాపురం, మార్చి 28

తూర్పుగోదావరి జిల్లా అమలాపురం తాలూకా రిక్షావర్కర్ల సమావేశం యీ నెల 23 న శ్రీ సరెళ్ల రామారావుగారి అధ్యక్షతన ఇక్కడ జరిగింది

సమావేశంలో రిక్షా వర్కర్ల నిత్య జీవితంలో ఎదుర్కొంటున్న సమస్యల గురించి శ్రీ రామారావు, శ్రీ కె వీరరాఘవులు నాయుడు తదితరులు ఉపన్యసించారు.

తరువాత 17 గురితో కమిటీని, 5 గురితో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు అధ్యక్షులుగా శ్రీ గూటం సాహెబుగారు, ఉపాధ్యక్షులుగా శ్రీ చింతా లక్ష్మణస్వామిగారు, ప్రధాన కార్యదర్శిగా శ్రీ కొప్పుల వీరరాఘవులు నాయుడుగారు, సహాయ కార్యదర్శిగా మంధా శ్రీరామమూర్తి, కోశాధికారిగా శ్రీ సరెళ్ళ రామారావుగారు, ఎన్నుకోబడ్డారు

చర్చల అనంతరం ఈక్రింది తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించారు

అమలాపురం మున్సిపాల్టీ అమలాపురము యొక్క అవసారలకు మించి క్రొత్త రిక్షాలకు లైసెన్సులు యివ్వరాదు

రిక్షా కార్మికులనుంచి ప్రతిరోజూ ఆరుగేట్లలో అనగా, మున్సిపాల్టీ పంచాయితీబోర్డులు పన్నువసూలు చేస్తున్నారు ఈవసూళ్ళు ఆపు చేయించాలి.

రోజురోజుకు పెరుగుతూన్న ఆహార ధాన్యాల ధరలు తగ్గించి ప్రభుత్వం వెంటనే, కార్మిక మధ్య తరగతి ప్రజలకు చౌకడిపోలు తెరవాలి

సిర్పపల్లి

కరీంనగరు జిల్లా సిర్పపల్లిలో కాంగ్రెసు కార్యకర్త ఒకాయన ఈ నెల 27వ తేదీన రైతుసంఘ కార్యకర్త శ్రీ వెంకటరామ నరసయ్యపై బడి జేబులోనున్న రు 16-8-0 నగదు కాజేశాడు ఆయన దేశభక్తిని జూచి స్థానిక ప్రజలు ఏవగించుకుంటున్నారు

శంకర్రావ్ దేవ్ శనివారంనాడు నెహ్రూను కలుసుకొని బొంబాయి సమస్యను గురించి చర్చిస్తారు.

WANTED

Wanted ten Salesmen having previous experience please apply to

B P HONAGUDI Gadag

బొల్లి

మేహపొడ, చైత్య వ్యాధులకు-130 పేజీలుగలనూతనవైద్యగ్రంథంఉచితం

టి వి రెడ్డి అండ్ కో, (రిజిష్టర్డు).

గోపాలపురం (V A) తూ గో జిల్లా

నోటీసు

మహారాజశ్రీ ప్రొద్దుటూరు డి॥ మునసబు కోర్టులో.

Sc 689/55

B వెంకన్న గురప్ప పార్టనర్సు (1) B గురుస్వామి (2) B వెంకట సుబ్బయ్య — వాది.

శ్రీనివాస మునసిపల్ కాంట్రా - ప్రతివాది

దావా వాదులవద్ద ప్రతివాది జరిపిన లావాదేవీల్లో చెల్లుపోను వడ్డీ అసలు వగైరా బాపతు అచ్చవలసిన రు 451-15-6 లకు గాను యీ దావాను ప్రతివాదిపైన వాదులు దాఖల్ చేసివున్నారు. యిందుకు యేదైనా ఆక్షేపణ వున్నయెడల ప్రతివాది పైకోర్టులో(7-4-56) తేదీన వుదయం 10 గంటలకు హాజరై తెలుపుకోవలయును లేనంతట దావా అతనిపరోక్షమందు తీర్మానించబడును

ఆర్. నారాయణరావు,
వాది తరపున వకీలు.

మన దేశంలోనే తయారు చేయబడుచున్న నేపా న్యూస్ ప్రింట్‌పై ఈ పత్రిక ముద్రించబడినది.

Shank Beedi
శంకు బీడి
Prop B SHAMSEER KHAN
SHANK BEEDI FACTORY KURNOOL

పడిపోయిన కాళ్ల చేతులను బాగుచేయును క్షయించిన అవయవములను చక్కజేయును వాత వ్యాధులను ధ్వంస మొనర్చును లక్షణమే గుణము నివ్వగలదు ముఖ్యమగు ఔషధమని మన్నిక పొందినది నంగిమాటలను నయమొనర్చును కుదరని వ్యాధుల నైతము కుదర్చగలదు మా మందు అద్భుతంగా పనిచేస్తుంది ఆ వ్యాధినుంచి మిమ్ములను విముక్తిచేస్తుంది వారపు మందు వెల రు 8-12-0 వి పి గా మంగా పిలయువారు రు 5/- లు అడ్వాన్సు పంపవలెను

వివరాలకు, ఉచిత సలహాకు

బొమ్మా జితేంద్ర
పక్షవాత స్పెషలిస్టు

8 బార్నబి రోడ్డు, మద్రాసు-10 | టౌను రోడ్డు తెనాలి | కేశవవిహార్ నెల్లూరు

రేడియో
ఏప్రిల్ 2 సోమ॥

విజయవాడ: (357.1 మీటర్లలో) ఉదయం

6-50 స్వాగతము, 6-55 ప్రసారవిశేషాలు; 7-0 (తె వా.), 7-15 నాదస్వరం, 7-30 జి ఎస్ రాజకోకిలం, 8-0 (ఆం వా), 1-0 మద్రాసువలె, 1-30 గీతావళి, 1-40 హిందీలో వార్తలు 1-50 (తె వా), 2-0 మద్రాసు వలె, 2-10 హిందీ కార్యక్రమము, 5-30 మొక్కపాటి నాగేశ్వరరావు వీణ, 5-45 సంగీత శిక్షణ, 6-0 స్థానిక ప్రకటనలు; 6-05 (ప్రాం వా), 6-15 గ్రామస్థులకు, 7-0 (తె వా.), 7-30 గానసుధ 8-0 సౌందరనందము, సంగీత రూపకము, 9-0 (ఆం వా.), 9-15 ప్రసంగం, (ఆంగ్లంలో), 10-0 సమాప్తి

మద్రాసు బి (211.3 మీటర్లలో) ఉదయం

6-50 స్వాగతము; 7-0 (తె. వా.), 7-15 నాదస్వరం, 7-30 కృతులు, 8-0 (ఆం వా), 12-0 కార్మికులకు, 12-30 కె కమల, 1-0 గీతమాలిక, 1-30 (ఆం వా), 1-40 గీతమాలిక, 1-50 (తె వా), 2-0 క్లాక్, 2-10 ప్రసంగం, (హిందీ), 5-30 సితార్, 5-50 స్థానిక ప్రకటనలు, 6-0 (ఆం వా), 6-5 (ప్రాం వా), 6-15 గ్రామస్థులకు, 7-0 (తె వా.), 7-30 సంగీతసమ్మేళనం, 9-0 (ఆం వా), 9 15 సంగీతోపన్యాస , 11-0 సమాప్తి

హైద్రాబాద్: (411.0 మీటర్లలో) ఉదయం:

6-50 సుప్రభాత్; 6-55 కార్యక్రమవివరణ 7-0 (తె. వా); 7-15 వీణ, 7-45 (క వా), 8-0 (ఆం వా); 8-15 (హిం వా.), 8-30 ఖయాల్, 12-30 ఫిల్మిసంగీత్, 12-50 (ఉ వా) 1-0 వాద్యబృంద, 1-10 కృతిమంజరి; 1-50 (తె వా), 5-30 గీతావళి, 6-0 వీణ, 6-40 స్థానిక ప్రకటనలు; 7-0 (తె వా), 7-15 గ్రామసీమ, 7-45 గీత్, ఘజల్, 8-0 ప్రసంగం-హిందీ; 8-15 ఉత్తరాలకు - జవాబులు; 8-30 భజన్, 8-30 ప్రసంగం, (ఆంగ్లంలో), 8-45 గీత్, ఘజల్ 9-0 (ఆం వా), 9-15 (వా), 10 3

నాగార్జున సాగర్ చీఫ్ ఇంజనీరుగా మంత్రి బావమరది నియామకం

బంధుప్రీతితో జరిగినదికాదని హైద్రాబాద్ అసెంబ్లీలో మంత్రి వివరణ

హైద్రాబాదు, మార్చి 29

తన బావమరదిని నాగార్జునసాగర్ ప్రాజెక్టు చీఫ్ ఇంజనీరుగా ప్రమోటు చేయడంలో బంధుప్రీతిని ప్రదర్శించానని వచ్చిన ఆరోపణలు నిజమని ధృవపడితే బహిరంగంగా కాల్చి చంపివేయడానికి తాను సంసిద్ధంగా వున్నానని నేడు హైద్రాబాద్ శాసనసభలో పబ్లిక్ వర్క్సు శాఖామంత్రి డాక్టర్ జి. యస్. మేల్కొటే ప్రకటించారు.

తన డిపార్టు మెంటుపద్దుపై జరిగిన చర్చకు జవాబు చెపుతూ ఆయనిలా అన్నారు:

పి. డబ్ల్యు. డి. శాఖలో ఉద్యోగులను ప్రమోట్ చేసే విషయంలో కొంతమంది అధికారుల సీనియారిటీని లెక్కలోకి తీసుకోకుండా త్రోసివేశామని ప్రతిపక్షసభ్యులు కొందరు ఆరోపణచేశారు. ఈ సందర్భంలోనే నాకు నా బావమరది అయిన శ్రీ టి. యస్. మూర్తిని నాగార్జునసాగర్ ప్రాజెక్టు (కాలువలు) చీఫ్ఇంజనీర్‌గా నియమించిన విషయాన్ని ఉదహరించారు. ఈవార్త స్థానిక వారపత్రికలో కూడా ప్రచురించబడింది.

శ్రీమూర్తి సవియర్ సూపరింటెండెంటు ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. నాకు ముందున్న పి. డబ్ల్యు. డి. శాఖమంత్రి ఆయనను గురించి సదభిప్రాయాన్ని వెలిబుచ్చారు. ఆయనను పెద్ద పదవిలోకి ప్రమోట్ చేయవలసి వచ్చినప్పుడు ఆయన నా బావమరది కావడంవలన నా అభిప్రాయాన్ని తెలియజేయడానికి నిరాకరించుతూ, ఆ కేసును ముఖ్యమంత్రికి పంపించాను. చివరికి ఆయనను పబ్లిక్ సర్వీసు కమిషన్ అనుమతితో పై పదవిలోకి ప్రమోట్ చేశారు.

జరిగిన యథార్థమిది. ఈ విషయంలో ఎలాంటి విచారణకైనా నేను సంసిద్ధంగా వున్నాను. ప్రధానమంత్రినే విచారణ జరిపించవలసిందిగా కోరుతున్నాను. నాపై వచ్చిన ఆరోపణ నిజమని ఆ విచారణలో ధృవపడితే బహిరంగంగా కాల్చిచంపివేయబడటానికి నేను సంసిద్ధంగా వున్నాను.

అయితే ఈఆరోపణలు నిజంకావని రుజువైతే ఆరోపణలు చేసిన ప్రతిపక్ష సభ్యులు నన్ను క్షమాపణ వేడుకోవలసి వుంటుంది.

దానిపై ప్రతిపక్ష నాయకుడు శ్రీ వి. డి. దేశపాండే మాట్లాడుతూ, ఈ ఆరోపణలు ఒకస్థానిక వారపత్రికలో పదిపదిహేను రోజులక్రిందట ప్రచురించబడినాయన్నారు. అయినప్పటికీ ఈ వార్తను ఖండిస్తూ అందుకు సంబంధించినవారినుండి ఖండన వెలువడలేదన్నారు. ఆ కారణంగా ఈ విషయాన్ని ప్రభుత్వం ముందు వుంచడం జరిగింది అని తాము తెలసాపున్నారు. అంతేకాని, ఆవార్తనిజమేనని నిర్ధారణకు తాము రాలేదని వివరించారు.

పబ్లిక్ సర్వీసు కమిషన్ అనుమతిలేదట

హైద్రాబాద్, మార్చి 30

హైద్రాబాద్ పి. డబ్ల్యు. డి. మంత్రి బావమరది శ్రీ టి. యస్. మూర్తిని నాగార్జున సాగర్ ప్రాజెక్టు చీఫ్ ఇంజనీరుగా నియమించిన ఉదంతం నేడు తిరిగి హైద్రాబాద్ శాసనసభలో ప్రస్తావనకు వచ్చింది.

డాక్టర్ మేల్కొటే నేడు శాసనసభలో మాట్లాడుతూ నాగార్జున సాగర్ చీఫ్ ఇంజనీర్‌గా శ్రీ మూర్తి నియామకానికి ఇంకా పబ్లిక్ సర్వీసు కమిషన్ అనుమతి రాలేదని తెలిపారు. నిన్నటి రోజున ఆయన నియామకాన్ని పబ్లిక్ సర్వీసు కమిషన్ ధృవపరచినదని తాను చెప్పాననీ, కాని ఇంకా అలాంటి అనుమతి రాలేదని ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి తనకు తెలిపాడనీ డాక్టర్ మేల్కొటే చెప్పారు. పబ్లిక్ కమిషన్ సర్వీసు జవాబు కోసం ఎదురు చూస్తున్నామన్నారు.

ముఖ్యమంత్రి శ్రీ బూర్గుల రామకృష్ణారావు మాట్లాడుతూ, పబ్లిక్ సర్వీసు కమిషన్ చేసే సిఫార్సు ఏదైనప్పటికీ దానిని ప్రభుత్వం ఖచ్చితంగా అమలు జరపగలదనిసభివారికిహామీయిచ్చారు. మూర్తిని చీఫ్ ఇంజనీర్ గా ప్రమోట్ చేయడానికి తానే కారకుడనని శ్రీ బూర్గుల చెప్పారు. ఆకేసును డాక్టర్ మేల్కొటే తనకు పంపించారని చెప్పారు.

బోధనాభాషగా భారతీయభాష

ప్రవేశపెట్టడం అవసరమని డాక్టర్ మత్తాయి విజ్ఞప్తి

బొంబాయి, మార్చి 29

జపాన్‌లోవలే భారతదేశంలో కూడా స్వదేశ భాషలోనే విద్యాబోధ జరగాలని బొంబాయి యూనివర్శిటీ వైస్‌ఛాన్సలర్, స్టేట్ బ్యాంకు చైర్మన్ డాక్టర్ జాన్‌మత్తాయి నేడిక్కడ మాట్లాడుతూ తన అభిప్రాయాన్ని వెలిబుచ్చారు

బోధనాభాషగా ఇంగ్లీషుస్థానే భారతీయ భాషలను ప్రవేశపెట్టినందువలన కొందరు సందేహపడుతున్నట్లు మన విద్యాప్రమాణాలు తగ్గడంగాని, దేశాభివృద్ధి కుంటుపడటంగాని ఏమాత్రం జరగదని ఆయన స్పష్టం చేశారు.

ఇందుకాయన జపాన్ ఉదాహరణనే వివరించారు. విషయంలో, బోధనాపద్ధతులలో పశ్చిమ దేశాలను అనుసరించినప్పటికీ బోధనాభాష విషయంలో జపాన్ ఎన్నడూ విదేశీ భాషను స్వీకరించే పొరపాటుచేయలేదన్నారు. జపాన్ తన భాషద్వారానే ప్రపంచశాస్త్ర, విజ్ఞానాభివృద్ధికి ఎంతగానో తోడ్పడిందని డాక్టర్ మత్తాయి తెలిపారు.

విలీనీకరణకు డాక్టర్ రాయ వింతవాదనలు

నందిగ్రామ్, (పశ్చిమబెంగాల్) మార్చి 30

ఒకేభాషను ఉపయోగించేప్రదేశం భారతదేశంలో లేనేలేదనీ, అందువలన బహుభాషారాష్ట్రాలు ఏర్పడటంవలన వచ్చే నష్టమేమీవుండదనీ పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి డాక్టర్ బి. సి. రాయి నేడిక్కడన్నారు.

మిద్నపూర్ జిల్లా రాజకీయ మహాసభను ప్రారంభిస్తూ, జనపవారమిల్లుల ప్రాంతంలో బెంగాలీలతోపాటు ఇంగ్లీషువారు, బీహారీలు, ఒరియాలు, దక్షిణభారతీయులు వుంటున్నారనీ, తత్ఫలితంగా ఆ పరిశ్రమాభివృద్ధికి ఆటంకమేమీకలుగలేదనీ వాదించారు.

ముడివస్తువులు, ఖనిజ సంపద, సాంకేతిక నైపుణ్యం ఇవన్నీ సవ్యంగా ఉపయోగపడేందుకే తాము బెంగాల్-బీహార్ విలీనీకరణ ప్రతిపాదన చేశామన్నారు. ఒకప్పుడు బెంగాల్, బీహార్, ఒరిస్సాలు కలిపి ఒకే పాలనా ప్రాంతంగా వుండేవన్నారు.

భారతదేశ వాణిజ్య, పరిశ్రమలు పెంపొందాలంటేకూడా బెంగాల్, బీహార్లు లీనం కావడం అవసరమన్నారు.

సభ జరుగుతుండగా కొలుపల విలీనీకరణకు వ్యతిరేకంగా ప్రజలు ప్రదర్శనలు జరిపారు.

టెలిగ్రామ్ రేట్ల హెచ్చింపు

ఏప్రిల్ 1వ తేదీ నుంచి

న్యూఢిల్లీ, మార్చి 30

ఏప్రిల్ 1 నుంచి దేశంలో టెలిగ్రాముల చార్జీలు పెరుగుతాయని తంతితపాలాశాఖ డైరెక్టర్ జనరల్ ప్రకటించారు.

మామూలు తంతెకు ఒక అణా, ఎక్స్‌ప్రెస్ తంతెకు రెండణాలు బేసిక్ చార్జీ పెరుగుతుంది. అంటే మామూలు తంతెలకు మొదటి ఎనిమిది పదాలకు బేసిక్‌చార్జి తొమ్మిదణాలు ఉంటుంది. అదనంగా ప్రతి పదానికి అణా తీసుకుంటారు.

అలాగే ఎక్స్‌ప్రెస్ టెలిగ్రాములకు మొదటి ఎనిమిది పదాలకు బేసిక్ చార్జీ రూపాయి వేడ వుంటుంది. అదనంగా పదానికి బేడచొప్పున తీసుకుంటారు.

ఇది కాకుండా, మామూలు తంతెకు పావలా, ఎక్స్‌ప్రెస్ తంతెకు అర్థరూపాయి సర్‌చార్జీ ఇవరకటివలెనే వసూలుచేస్తారు.

ఢిల్లీకి అల్జీరియా విముక్తి ఉద్యమ నాయకుల రాక

న్యూఢిల్లీ, మార్చి 29

ఫ్రెంచి పీడన నుంచి అల్జీరియా విముక్తిని సాధించేందుకు ఏర్పడిన జాతీయ సంఘటన నాయకులు హుస్సేన్ ... , మహమ్మద్ యూజిన్ నేడు కరాచీ నుండి ఢిల్లీ వచ్చారు. వీరిద్దరూ ఆగ్నేయాసియా దేశాలలో పర్యటిస్తున్నారు.

తాము సందర్శించే దేశాల నాయకుల నందర్నీ కలుసుకొని అల్జీరియా స్వాతంత్ర్య పోరాటానికి సానుభూతి సహాకారాలను సేకరించడమే వీరి పర్యటన లక్ష్యం.

బాండుంగ్ మహాసభ వేసినుండీ, ఐ. రా. స. పదవ మహాసభలోనూ, ఇతరత్రానూ భారత ప్రజలూ, ప్రభుత్వమూ, అల్జీరియా ప్రజల స్వాతంత్ర్య పోరాటానికి అందజేసిన సానుభూతి సహాకారాలకు ఆ ఇద్దరు నాయకులూ తమ కృతజ్ఞతను తెలుపుతూ నేడొక పత్రికా ప్రకటన చేశారు.

"మేము మా స్వాతంత్ర్యాన్ని సాధించేంతవరకూ భారతీయులు మాకు సహాయం చేస్తూ ఉంటారనే నమ్మకం మాకు పూర్తిగా ఉంది" అని వారన్నారు.

"అల్జీరియా సమస్య చాల గడ్డు స్థితికి వచ్చింది. ఫ్రెంచి దురాక్రమణ పట్ల జాతీయ ప్రతిఘటన నానాటికి విస్తరిస్తూంది. దీనిని అణచేందుకు ఫ్రెంచివారు పూర్తిగా సైనిక దండయాత్రను ప్రారంభించారు.

"అందువల్ల ప్రపంచంలోని స్వాతంత్ర్య కాముకులందరి - ముఖ్యముగా ఆసియా, ఆఫ్రికా ప్రజల సహకారం మాకెంతో అవసరం. బాండుంగ్ మహాసభ తీర్మానానుసారం మా స్వయం నిర్ణయాధికారం ప్రాతిపదికగా అల్జీరియా సమస్య శాంతియుతంగా పరిష్కారం కావాలంటే వీరితోడ్పాటు అవసరం."

బెంగాల్లో విలీనీకరణ వ్యతిరేక ఉద్యమం

ఇప్పటికి నాలుగువేల మందికి పైగా అరెస్టయినారని శ్రీ జ్యోతిబాసు వెల్లడి

కలకత్తా, మార్చి 30

బెంగాల్, బీహార్ విలీనీకరణ ప్రతిపాదనను ఉపసంహరించుకొని పక్షంలో ఏప్రిల్ మాసంలో అసమ్మతి ప్రదర్శనలను పెద్దఎత్తున జరిపి ఉద్యమం ఉధృతం చేయబడుతుందని పశ్చిమబెంగాల్ ప్రతిపక్ష నాయకుడు శ్రీ జ్యోతిబాసు నేడిక్కడ తెలియజేశారు.

పశ్చిమ బెంగాల్ భాషారాష్ట్రాల్ల పునర్నిర్మాణ కమిటీ తరఫున, విలీనీకరణ వ్యతిరేక ఉద్యమాన్ని ప్రారంభించిన వామపక్షాల ఐక్యసంఘటన తరఫునా శ్రీ జ్యోతిబాసు మాట్లాడుతూ విలీనీకరణ వ్యతిరేక ప్రజా ఉద్యమం స్వరూపం ఎలావుండాలన్న విషయం తరువాత నిర్ణయించ బడుతుందన్నారు.

విలీనీకరణను వ్యతిరేకిస్తూ ఇంతవరకు ఎనిమిది లక్షలమందికిపైగా సంతకాలుపెట్టి కమిటీ కార్యాలయానికి పంపించారని ఆయన తెలిపారు. ఇప్పటికి ఈ ఉద్యమ సందర్భంలో 4083 మంది అరెస్టు అయారనీ, అందులో 158 మంది స్త్రీలు, 861 మంది విద్యార్థులు, 776 మంది తూర్పుబెంగాల్ నుండి కాందిశీకులుగా వచ్చినవారూ వున్నారన్నారు.

వాషింగ్టన్, మార్చి 29

అమెరికా దేశీయవ్యవహారాల శాఖ మంత్రి డగ్లస్ మాకే నేడు తనపదవికి రాజీనామాఇచ్చారు. ఈ రాజీనామాను ఐసెన్‌హోవర్ అంగీకరించారు. ఏప్రిల్ 15 నుండి ఈ రాజీనామా అమలులోకి వస్తుందట.

పసిఫిక్‌లో అణ్వాయుధ ప్రయోగాలు

నివారించేందుకుధర్మకర్తృత్వ సంఘం నిరాకరణ

న్యూయార్క్, మార్చి 29

పసిఫిక్ మహాసముద్రంలో ఐ. రా. స. ధర్మకర్తృత్వ పాలనకింద నున్న మార్షల్ దీవులలో అమెరికా ప్రభుత్వం జరపదలచుకున్న అణ్వాయుధపాటవ ప్రయోగాల విషయంలో ఎలాంటి జోక్యమూ కలిగించుకోడానికి ధర్మకర్తృత్వ సంఘం నేడు నిరాకరించింది.

ఆ దీవులపై ఐ. రా. స. ధర్మకర్తృత్వ కింద అమెరికాపాలన సాగిస్తూంది. అటువంటి దీవులను అణ్వాయుధ ప్రయోగాలకు ఉపయోగించుకొనే అధికారం అమెరికాకు లేదనీ, దీనిని నివారించాలనీ భారత ప్రతినిధి కృష్ణమీనన్ ఇటీవల జరిగిన చర్చలో వాదించారు. ఈ ప్రయోగాలను మాన్పించవలసిందిగా మార్షల్ దీవుల ప్రజలు కూడా ఒక విజ్ఞప్తి చేసుకున్నారు.

"అంతర్జాతీయ శాంతి, భద్రతల కొరకు అణ్వాయుధ పాటవ ప్రయోగాలు మరకొన్ని అవసరం అని అమెరికా ప్రభుత్వం చేసిన ప్రకటనను గమనించాము" అన్న ప్రతిపాదన నేటి సమావేశంలో 9-4 ఓట్లుతో నెగ్గింది.

ఈ ప్రయోగాలు జరిగే ప్రాంతంలో మనుషుల ప్రాణాలకు హాని కలుగకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటామని అమెరికా ప్రభుత్వ ప్రకటించిన హామీని కూడా గుర్తించామన్నారు.

ఐ. రా. స. మహాసభ

ఈ సంవత్సరం నవంబరులో జరపాలని హామర్‌షెల్డ్ సూచన

న్యూయార్క్, మార్చి 29

ఐ. రా. స. సర్వప్రతినిధి మహాసభను ఈ సంవత్సరం మామూలు ప్రకారం సెప్టెంబరు 18 వ తేదీని కాకుండా నవంబరు 12 వ తేదీని జరపాలని ఐ. రా. స. ప్రధాన కార్యదర్శి హామర్‌షెల్డ్ ఒక సూచన చేశారు.

ఐ. రా. స. ప్రతినిధుల కందరికి ఈ సూచనను అందజేశారు. దానిపై అభిప్రాయాలను ఏప్రిల్ 30 లోగా తెలపాలని కోరారు

నవంబరు ఆరవతేదీని అమెరికాలో అధ్యక్షు ఎన్నికలు కాబట్టి, సెప్టెంబరులో మహాసభ జరుపుతే ఎన్నికల ప్రచారానికి అంతరాయం కలుగుతుందని, అందువల్ల వాయిదా వేయాలనీ చిలీ, క్యూబా, ఈక్వెడార్ ప్రతినిధులు చేసిన సమిష్టి ప్రతిపాదన ఈ సూచనకు కారణం.

విశాఖ నూనె శుద్ధి కార్మికుల సమ్మె జయప్రదంగా ముగింపు

(విశాలాంధ్ర విలేఖరి)

విశాఖపట్నం, మార్చి 30

సమ్మెచేస్తున్న నూనె శుద్ధి కర్మాగార కార్మికులకు,యజమానులకుమధ్య ఒప్పందం కుదరడంల్ల నేడు సమ్మె విరమించబడింది. నిన్నరాత్రి ప్రభుత్వ లేబర్ ఆఫీసర్ ఎదుట ఒప్పందంపై సంతకాలు జరిగాయి.

ఈ ఒప్పందం ప్రకారం దినబత్తెం తీసుకునే సాధారణ కార్మికులకు రోజుకూలీ రెండు రూపాయలనుండి రెండుంబావలాకు పెంచబడుతుంది. కొన్ని వృత్తి పరీక్షలుపెట్టి నిపుణతగల కార్మికులను, లేని కార్మికులను ప్రమోట్ చేయడానికి యజమానులు అంగీకరించారు. ఈ పరీక్షలలో తప్పే వారికి ఆరునెలల సర్వీసు తర్వాత వేతనాలలో నూటికి 10 వంతులు పెంచుతారు.

మిగతా కోర్కెలను లేబర్ ఆఫీసర్ తీర్పుకు వదలివేశారు. ఆయన పరిష్కరించలేకపోతే అడ్జుడికేషన్‌కు పంపాలని నిశ్చయించారు.

ఆస్పత్రి పనివారి సమ్మె

ఆస్పత్రి పనివారల సమ్మె ప్రారంభమై నేటికి మూడవరోజు. నిన్న సాయంత్రం ఆస్పత్రి, నూనెశుద్ధి కార్మిక సంఘాల సంయుక్తయాజమాన్యాన పెద్ద బహిరంగసభ జరిగింది. నూనెశుద్ధి కర్మాగారంలో సమ్మె ముగుస్తున్నందుకు సభవారు హర్షం వెలిబుచ్చారు. కార్మికులతో సంప్రతింపులకు ఎల్లప్పుడూ సిద్ధంగా వుండవలసిందని బర్మాషెల్ కంపెనీ యజమానులను కోరారు.

ఆస్పత్రి కార్మికుల సమ్మెపట్ల తీవ్ర ఆందోళన ప్రకటిస్తూ మరొక తీర్మానం చేశారు. కార్మికులపట్ల కింగ్‌జార్జి ఆస్పత్రి సూపరింటెండెంటు ప్రవర్తన అమానుషమూ, అవమానకరమూ, కక్షతో కూడుకున్నట్టిదీ అని నిరసించారు. ప్రభుత్వం వెంటనే జోక్యం కలిగించుకోవాలని, మారు కూలీలను తీసుకోడం మానాలని, కార్మిక సంఘంతో సంప్రతింపులు ప్రారంభించాలని కోరారు.

సమ్మెదారులను ఉద్యోగాల నుంచి తీసివేస్తామనిబెదిరిస్తూ ఆస్పత్రి సూపరింటెండెంటు నోటీసులు జారీ చేశారు. ఇది పారిశ్రామిక తగాదాల చట్టంలోని 33 వ సెక్షన్‌కువిరుద్ధమని, అందువలన చెల్లనేరదని యూనియన్ భావిస్తున్నది.

పాకిస్తాన్‌కి ఆఫ్ఘనిస్తాన్ నిరసన

ఆగ్నేయాసియా కూటమి ప్రకటనపై

కరాచీ, మార్చి 30

ఆఫ్ఘన్-పాక్ సరిహద్దుపై ఆగ్నేయాసియాకూటమి సమావేశం చేసిన ప్రకటననునిరసిస్తూ కరాచీలోని ఆఫ్ఘన్ రాయబార కార్యాలయం పాక్ విదేశాంగ శాఖకు లేఖ పంపినట్లు తెలుస్తున్నది.

పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్‌లమధ్య డూరాండ్ రేఖే సరిహద్దుగా వుండాలని ఆగ్నేయాసియా కూటమి అభిప్రాయం ప్రకటించింది. దీనిపై ఈవరకే కాబూల్‌లోని పాక్ రాయబార కార్యాలయానికి నిరసన తెలుపబడింది.

నేటి లేఖ ఆఫ్ఘనిస్తాన్ అంతరంగిక వ్యవహారాలలోఆగ్నేయాసియా కూటమి జోక్యంచేసుకుంటున్నందుకు నిరసన తెలిపింది. డూరాండ్‌రేఖకు తూర్పుగానున్న పుష్తూ ప్రాంతాలను పాకిస్తాన్ బలవంతంగా ఆక్రమించిందని, పఖ్తూన్‌లకు స్వయంనిర్ణయహక్కు ఇవ్వాలని కోరింది. ఆగ్నేయాసియా కూటమి ప్రకటనవల్ల ఏదైనా అవాంఛనీయ ఘటనలు జరిగితే అందుకు బాధ్యత వంటకే అవుతుందని హెచ్చరించింది.

పాకిస్తాన్ ద్వారా ఎగుమతులను పంపడం ఆఫ్ఘనిస్తాన్ పూర్తిగా మానివేసిందని, కరాచీలో ఆఫ్ఘన్ వర్తక వర్గాలవారన్నారు. ఇపుడు ఆఫ్ఘనిస్తాన్ సోవియట్, భారతదేశాలద్వారా, ప్రధానంగా తన ఎగుమతి వ్యాపారాన్ని సాగిస్తోందన్నారు.

పాకిస్తాన్‌కి అమెరికా అణుశాస్త్ర నిపుణులు

కరాచీ, మార్చి 29

పాకిస్తాన్లో అణుశక్తి పరిశోధనలకు సహాయంగా అమెరికా నిర్మిస్తానన్న అణుశక్తి ఉత్పత్తి కేంద్రం నిర్మాణాన్ని గురించిన వివరాలు చర్చించేందుకు డాక్టరు ... లారెన్స్, ఐ. ... అనే అమెరికన్ నిపుణులిద్దరు నేడు కరాచీ చేరుకున్నారు. పాక్ ప్రభుత్వ ముఖ్యులతో వీరు చర్చలు జరిపారు.

"వ్యక్తిపూజ"ను నిరసిస్తూ "ప్రావ్దా" ... సంపాదకీయాన్ని పెకింగ్ పత్రికలన్నీ పునర్ముద్రించాయి.

ఆర్థిక సహాయం పట్ల జోర్డాన్‌రాజు ధోరణి

బ్రిటిష్ సాయమూ, అరబ్బు రాజ్యాల సాయమూ కూడా తీసుకుంటారట

అమ్మాన్, మార్చి 29

ఈజిప్టు, సౌదీఅరేబియా, సిరియా ప్రభుత్వాలు తనకు అందజేయ దలచిన ఆర్థిక సహాయాన్ని స్వీకరించేందుకు జోర్డాన్ ప్రభుత్వం అంగీకరించింది. అయితే ప్రస్తుతం బ్రిటన్ ఇప్పుడు ఇస్తున్న ఆర్థికసహాయానికి బదులుగా కాకుండా, బ్రిటిష్ సహాయంతోపాటుగానే వీనికూడా స్వీకరిస్తారట.

బ్రిటిష్ సహాయాన్ని జోర్డాన్ నిరాకరించాలని, దానికి బదులుగా జోర్డానుకు కావలసిన ఆర్థిక సహాయాన్నంతా అందజేయడానికి తాము సిద్ధంగా ఉన్నామనీ ఈజిప్ట్, సౌదీ అరేబియా, సిరియా ప్రభుత్వాధిపతులు ఇటీవల తనకు సమిష్టిగా పంపిన బాబుకి జోర్డాన్‌రాజు హుస్సేన్ జవాబు పంపారు.

ఈ జవాబు ప్రతులను అమ్మాన్ నగరంలో నేడు ప్రకటించారు.

వెనుకటి జోర్డాన్ - బ్రిటన్ ఒడంబడిక ప్రకారం బ్రిటన్ ఏటా జోర్డానుకు సహాయంగా కొంత సొమ్ము చెల్లించవలసి ఉన్నదనీ, ఆ సొమ్మును పుచ్చుకోవలసిన హక్కు జోర్డానుకు ఉన్నదనీ, అందువల్ల దానిని వదులుకోవలసిన అవసరం లేదనీ జోర్డాన్ రాజు తన జవాబులో వివరించారు.

కైరోలో ఇటీవల జరిగిన అరబ్బు రాజ్యాధిపతుల సమావేశానికి తనకు వచ్చిన ఆహ్వానాన్ని ఎందుకు నిరాకరించాల్సివచ్చిందీ హుస్సేన్ రాజు తెలియజేశారు. అరబ్బు రాజ్యాల సమస్యల్నీ, ఇజ్రాయెల్ వ్యవహారాల్నీ చర్చించేందుకు జోర్డాన్ రాజధాని అమ్మాన్ నగరంలో అరబ్బు రాజ్యాలన్నిటి సమావేశాన్ని జరుప నిశ్చయించి, అందరికీ ఇదివరకే ఆహ్వానాలు పంపాము కాబట్టి, తాను కైరోసమావేశానికి వెళ్ళలేదన్నారు.

ఉమ్మడి శత్రువును ఎదుర్కోడంలో ఈజిప్ట్, సౌదీ అరేబియా, సిరియాలతో పూర్తిగా సహకరించేందుకు జోర్డాన్ సిద్ధంగా ఉన్నదని హుస్సేన్ రాజు తన జవాబులో తెలిపారు.

రంగూన్‌లో మికోయాన్

రంగూన్, మార్చి 30

సోవియట్ ఉపప్రధాని మికోయాన్ నేడు ఇండియానుంచి రంగూన్ వచ్చారు. ఇక్కడ మూడు రోజులపాటు ఉంటారు.

మికోయాన్‌తో ఉజ్బెక్ రిపబ్లిక్ సుప్రీంసోవియట్ అధ్యక్షుడు రాషిదోవ్, రష్యన్ ఆర్థిక సహకార శాఖబోర్డు డిప్యూటీ డైరెక్టర్ పి. ఏ. మలేటిన్, విదేశవాణిజ్యశాఖ డైరెక్టర్ స్పాంధారిన్, మరికొందరు అధికారులు వచ్చారు.

బర్మా ప్రధాని యూనూ, మంత్రులు, విదేశాల రాయబారులు విమానాశ్రయంలో మికోయాన్‌కు స్వాగతమిచ్చారు. మికోయాన్ విమానంనుంచి దిగగానే, కొందరు బర్మా బాలికలు వెళ్ళి ఆయన మెడలో పూలమాలలు వేశారు.

మికోయాన్ క్లుప్తంగా ఉపన్యసిస్తూ, గత డిసెంబరులో బర్మాకు బుల్గానిన్, కృశ్చేవ్‌లరాక ఉభయ దేశాలమధ్య స్నేహాన్ని దృఢతరం చేసిందన్నారు. మికోయాన్ రాకకు యూనూ హర్షం వెలిబుచ్చారు.

అల్జీరియాలో ఫ్రెంచివారిచే 103 మంది జాతీయవాదుల హత్య

అల్జీర్స్, మార్చి 30

గత 24 గంటలలో అల్జీరియాలో 103 మంది జాతీయవాదులను ఫ్రెంచి సైనికులు చంపినట్లు చెబుతున్నారు. జాతీయవాదులపై దాడికి ఇపుడు ఫ్రెంచివారు హెలికాప్టర్లు కూడా ఉపయోగిస్తున్నారు.

జాతీయవాదులు గెరిల్లా పద్ధతుల్లో అనేకచోట్ల ఎదురు దెబ్బలు తీస్తున్నారు.

సిరియా, లెబనాన్‌లకు పినే పయనం వాయిదా

అరబ్ లీగ్ ప్రకటనకు నిరసనగా

పారిస్, మార్చి 30

అల్జీరియన్ జాతీయ వాదులను అరబ్ లీగ్ బలపరుస్తున్నందున, ఫ్రెంచి విదేశాంగమంత్రి పినే, సిరియా, లెబనాన్‌లకు తన ప్రయాణాన్ని వాయిదా వేసుకోవచ్చునని ఫ్రెంచి విదేశాంగ శాఖ నేడు ప్రకటించింది.

అల్జీరియన్ జాతీయ పోరాటాన్ని బలపరుస్తున్నట్లు అరబ్ లీగ్ కౌన్సిల్ నిన్న కైరోలో ప్రకటించింది. దీనిపై సిరియా, లెబనాన్ రాయబారులకు పినే నేటి ఉదయం నిరసన తెలియజేశారు. తాను ఆదేశాలకు బయలుదేరేముందు ఈ ప్రకటన చేయడం శోచనీయమన్నారట.

వచ్చే శుక్రవారంనాడు సిరియా, లెబనాన్‌లకు వెళ్ళాలని పినే ఇదివరలో నిర్ణయించుకున్నారు.

బ్రిటిష్ కమ్యూనిస్టు పార్టీ మహాసభ

లండన్, మార్చి 30

బ్రిటిష్ కమ్యూనిస్టు పార్టీ మహాసభ నేడిక్కడ ప్రారంభమైంది. సుమారు వేయిమంది ప్రతినిధులు మహాసభకు హాజరైనారు.

పార్టీ అధ్యక్షుడు విలియం గలాకర్ మాట్లాడుతూ, తాము చేసిన తప్పుల స్వభావాన్ని సరిగా అర్థం చేసుకోవడం పార్టీని ముందుకు తీసుకు వెళ్ళడానికి తోడ్పడుతుందన్నారు.

రష్యన్ రిపబ్లిక్ విద్యాశాఖ మంత్రి బర్తరఫ్

మాస్కో, మార్చి 29

సోవియట్‌లోని రష్యన్ రిపబ్లిక్ విద్యాశాఖమంత్రి ఇవాన్ కైరోవ్‌ని ఆ పదవినుండి బర్తరఫ్ చేశారని పత్రికలు నేడు ప్రకటించాయి.

మాస్కో పట్టణ కమ్యూనిస్టు కార్యదర్శులలో ఒకరయిన ఎ జైనీ అఫ్రానసెంకోని ఆ పదవికి నియమిస్తారు.

బోధనా పద్ధతులను, ముఖ్యంగా విద్యార్థుల రాజకీయ, సిద్ధాంత పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడానికి దేశమంతటా జరుగుతున్న ఏర్పాటులకు సంబంధించినదే ఈ మార్పు అని అనుకుంటున్నారు.

అమెరికన్ పత్రికల దూషణ

కంబోడియా ప్రధాని నిరసన

నాంపెన్, మార్చి 30

నరోదమ్ సిహనాక్ మంత్రివర్గ రాజీనామాను కంబోడియారాజు అంగీకరించినట్లు నేడు అధికారయుతంగా ప్రకటించబడింది.

నిన్నరాత్రి నరోదమ్ సిహనాక్ రేడియోలో ప్రసంగిస్తూ, తనపట్లఅమెరికన్ పత్రికలు ప్రదర్శిస్తున్న వైఖరిని తీవ్రంగా నిరసించారు. తాను పెకింగ్ సందర్శించి వచ్చినప్పటినుంచీ ఆ పత్రికలు తనను వ్యక్తిగతంగా దూషిస్తున్నాయన్నారు. కొన్ని ఫ్రెంచి పత్రికలుకూడా ఇలాగేప్రవర్తిస్తున్నాయన్నారు.

హిందుస్తాన్ మెషిన్ టూల్స్ లిమిటెడ్
జాల్‌హళ్ళిపోస్టు, బెంగుళూరు.

కావలెను

(1) టూలు ఫిట్టర్లు, (2) ఫిట్టర్ మెకానిక్కులు, (3) ప్లానర్లు, (4) మార్కర్లు, (5) కొల్లర్లు, (6) హైడ్రాలిక్ మేకర్లు, (7) కార్పెంటర్ మెకానిక్కులు, (8) ఎలెక్ట్రీషియన్లు, (9) క్రేన్ డ్రైవర్లు, (10) కోటర్ ట్రేడర్లు, (11) హార్డ్ క్రోమియం ప్లేటర్లు, (12) టర్నర్లు, (13) మిల్లింగ్ మెషిన్ ఆపరేటర్లు, (14) సర్ఫేస్ మరియు సిలిండ్రికల్ గ్రైండర్లు, (15) టూల్ గ్రైండర్లు, (16) జిగ్ బోరర్లు, (17) షేపర్లు, (18) గేర్ కట్టర్లు, (19) రేడియల్ డ్రిల్లింగ్ అండ్ డ్రిల్లింగ్ మెషిన్ ఆపరేటర్లు, (20) వర్టికల్ బోరింగ్ మెషిన్ ఆపరేటర్లు, (21) హారిజాంటల్ బోరింగ్ మెషిన్ ఆపరేటర్లు, (22) షేపింగ్ అండ్ బ్రోచింగ్ మెషిన్ ఆపరేటర్లు, (23) గేర్ గ్రైండర్లు, (24) పెయింటర్లు, (25) సైంటర్లు మరియు (26) స్పాండ్ బ్లాస్టర్లు

జీతాలస్కేలు:	
1నుండి 24 నెంబర్ల ఉద్యోగాలకు గు. 2/2/ నుండి రు. 6/ వరకు. 25 మరియు 26 నెం॥ ఉద్యోగాలకు రు. 1/2 నుండి రు. 2/4 వరకు.	గంటకొకియిచ్చే జీతం, మరియు మా కంపెనీలో, ఇంటర్వ్యూలోను, టెస్టు పరీక్షలోను చూపే ప్రావీణ్యతనుబట్టి నిర్ణయించబడి ప్రతివ్యక్తికి అదనంగాఇచ్చే అధికధరల అలవెన్సు.

వయస్సు : 40 సం॥లకు మించనివారు

హైస్కూలు లెవెల్ కు సరిపోయినంత బేసిక్ విద్యను దరఖాస్తుదారులు కల్గియుండవలెను. పని చేయుటలో కావలసిన ఇంగ్లీషు భాషాపరిజ్ఞానము, అదనంగా వుండవలసిన అర్హత. మెషిన్ డ్రాయింగులలో అనుభవం, మరియు సామాన్యంగా వర్కుషాపుల క్వాలిఫికేషనులు తెలిసినవారు గాను వుండవలెను. వారి వారి వృత్తులలో ఏదో ఒక రికగ్నైజుడు వర్కుషాపులో మెటల్ పరిశ్రమలో గాని, కనీసం 5 సం॥ల ప్రాక్టికల్ అనుభవమున్న వారై యుండవలెను. మెషిన్‌టూల్ ఇండస్ట్రీలో పూర్వానుభవమున్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

అన్ని విషయాలలోను సమానత ఉన్నట్లైతే, షెడ్యూల్డు కులములకు, మరియు షెడ్యూల్డు జాతులకు చెందిన వారికి ప్రిఫరెన్సు చూపబడును.

తమ స్వంత అడ్రస్‌వున్న రెండణాల పోస్టల్ కవరును పర్సనల్ మేనేజరుకు పంపి దరఖాస్తు ఫారములు పొందవచ్చును. 21-4-1956 తేదీకి గాని అంతకుముందుగా గాని, రు 0-8-0 విలువగల పోస్టల్ ఆర్డర్‌తో జతపర్చి పూర్తిచేసిన దరఖాస్తు ఫారములు అందవలెను. ఒకటికంటె ఎక్కువ ఉద్యోగములకు దరఖాస్తు చేయువారు వేర్వేరు దరఖాస్తులు, వాటి రుసుముతోసహా దరఖాస్తులు, పంపవలెను.

ప్రభుత్వ సర్వీసులో గాని, ప్రభుత్వ పారిశ్రామిక సంస్థలలో గాని పనిచేస్తున్న వారైతే వారిడిపార్టుమెంటల్ అధిపతుల ద్వారా దరఖాస్తులు పంపవలెను.

బయట ప్రాంతాలనుండి సెలెక్టు కాబడిన అభ్యర్థులకు, ఇంటర్వ్యూలకు మరియు టెస్టు పరీక్షలకు సింగిల్ రిటర్న్ ధర్డుక్లాసు రైల్వేఛార్జి యివ్వబడును.

పర్సనల్ మేనేజరు.

శ్రీ కనకదుర్గా కళాసమితి (రిజిష్టర్డు) విజయవాడ.

ది 1-4-1956 ఆదివారం సా॥ గం. 5 నుండి 8-30 వరకు
విజయవాడ శ్రీ దుర్గా కళామందిరంలో
ఆంధ్ర ముఖ్యమంత్రి గా॥ శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారి సమక్షమున
శ్రీమతి యం. యస్. సుబ్బులక్ష్మి & పార్టీచే

సంగీత సభ

ప్రవేశరుసుము :

1వ తరగతి (రిజర్వుడు) రు. 20	3వ తరగతి సభ్యులకు మాత్రమే
2వ తరగతి (రిజర్వుడు) రు 10	రు. 9. రు 3.
4వ తరగతి రు. 3.	5వ తరగతి రు. 2.

టిక్కట్లు దొరుకుచోట్లు :

1. డి. కృష్ణమూర్తి, ఫోన్ నెం. 199, లక్ష్మీ టాకీసు ఎదుట, విజయవాడ.
2. మెస్సర్సు వెల్‌కం హోటల్సు - గవర్నరుపేట ఫోన్ 391, గాంధీనగరం ఫోన్ 286
3. మాజేటి రామమోహనరావు, ఫోన్ 322 మెయిన్ బజారు, విజయవాడ

ది 1-4-56 తేదీ ఉదయం గం. 9 ల నుండి హాలువద్ద టిక్కట్లు అమ్మబడును.

29—4—56 రామమోహన లైబ్రరీ హాలులో రాజసేవాసక్త, సంగీత కళానిధి శ్రీ సెమ్మంగుడి, ఆర్. శ్రీనివాసయ్యర్ & పార్టీవారి పాటకచేరి

సంపాదకుడు, ముద్రాపకుడు, ప్రచురణకర్త.— కొల్లిపర రాజగోపాలరావు—ముద్రణ: స్వతంత్ర ఆర్టు ప్రింటర్సు, లకింగ్‌హాంపేట, విజయవాడ. సంపాదకవర్గం :— మోటూరు హనుమంతరావు, (అధ్యక్షులు) కంభంపాటి సత్యనారాయణ, గూటూర్డ్డ రాజగోపాలరావు.